తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

డిసెంబరు 2019. వెల రూ.5/-



02-12-2019

తిరుచానూరు

శ్రీపద్మావతీ అమ్మవారి

పుష్పయాగం

## పురుషోత్తముడి పుష్పయాగం.......



**తిరుమల**
**శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో**
**ఉభయదేవేరి సమేత శ్రీవారికి**
**04-11-2019 న జరిగిన**
**పుష్పయాగ మహోత్సవ దృశ్యాలు**













# గీతాశ్లోకార్థసారం

శ్లో : దృష్టకేతు శ్చేకితానః కాశీరాజ శ్చ వీర్యవాన్ ।
పురుజిత్కున్తిభోజ శ్చ శైబ్య శ్చ నరపుంగవః ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-05వ శ్లోకం)

ప్రతిపదార్థం: దృష్టకేతుః= దృష్టకేతుడు–ఇతడు శిశుపాలుని కొడుకు; చేకితానః= చేకితానుడు; వీర్యవాన్= పరాక్రమవంతుడగు; కాశీరాజ శ్చ= కాశీరాజున్ను,; పురుజిత్= పురుజిత్తున్ను; కున్తిభోజ శ్చ= కున్తిభోజుడును; నరపుంగవః= మనుజశ్రేష్ఠుడగు; శైబ్యశ్చ= శైబ్యుడును.

భావం: దృష్టకేతువు, చేకితానుడు, పరాక్రమవంతుడగు కాశీరాజు, పురుజిత్తు, కున్తిభోజుడు, నరోత్తముడగు శైబ్యుడు... వీరందరూ మహారథులే అయి ఉన్నారు.

## జీవులకు చైతన్యసూత్రము

ఈరూపమై వున్నాఁడు యీతఁడే పరబ్రహ్మము
శ్రీరమాదేవితోడ శ్రీవేంకటేశుఁడు


పొదలి మాయాదేవిపట్టిన సముద్రము
అదె పంచభూతా లుండే అశ్వత్థము
గుదిగొన్నబ్రహ్మండాలగుడ్లఁ బెట్టేహంస
సదరపుబ్రహ్మలకు జలజమూలకందము

అనంతవేదా లుండేటి అక్షయవటపత్రము
ఘనదేవతలకు శ్రీకరయజ్ఞము
కనలుదానవమత్తగజసంహారసింహము
మొనసి సంసారభారము దాల్చేవృషభము

సతతము జీవులకు చైతన్యసూత్రము
అతిశయభక్తులజ్ఞానామృతము
వ్రతమై శ్రీవేంకటాద్రి వరములచింతామణి
తతిగొన్న మోక్షపుతత్త్వరహస్యము

(అన్నమాచార్య సంకీర్తనల సంపుటం-02, సంకీర్తనం-244)





పాలసముద్రంనుండి లక్ష్మీదేవి పుట్టినట్లుగా.. శ్రీమహావిష్ణువనే... సాగరం నుండే మాయ పుట్టింది. పంచభూతాలకు ఆధారం శ్రీహరియే. కోట్ల బ్రహ్మండాలనే అండములను పెట్టినది ఈ విష్ణువనే హంసికయే. సర్వవేదాలకు ఆశ్రయమైనది ఈ విష్ణువనే అక్షయవటపత్రమే. ఆలోచింపగా సకలజీవులకు చైతన్యం కలిగించువాడు ఈ ఫణిగిరీంద్రుడే అని అన్నమయ్య భావించాడు.

# మీ మాట

### ఆధ్యాత్మికానందం..

'సప్తగిరి' మాసపత్రికలో సంపాదకీయాలు చాలా విజ్ఞానదాయకంగా ఉంటున్నాయి. భగవంతునికి భక్తితో పత్రం, పుష్పం, ఫలం, తోయం, ఇందులో ఏది సమర్పించినా భగవంతుడు స్వీకరిస్తాడని వ్రాయడం చాల ఆనందంగా ఉంది. అదేవిధంగా, పచ్చటి ప్రకృతి వాతావరణానికి తిరుమల తిరుపతి దేవస్థానంవారు అత్యంత ప్రముఖస్థానం ఇచ్చి తిరుమల కొండలను వనసంపదగా తీర్చిదిద్దడం చాల తృప్తినిచ్చేదిగా ఉంది. అదే మన వన సంపద. నాకు మీ సంపాదకీయం చాల బాగా నచ్చింది.

ఇంకొక శీర్షిక కూడా నా మనస్సుకు హత్తుకుంది. అదేమంటే... "గోదాదేవి జన్మనక్షత్రోత్సవం! గోవిందుడి పూరిశైవారి తోటోత్సవం"లో అనంతాళ్వారు ఆయన భార్య ఇద్దరు కలిసి 'రామానుజ పుష్పవాటిక'ను ఏర్పాటు చేయడం మరియు ఆ తోటలో స్వామివారూ, అమ్మవారు విహరించడంతో తోటపాడవడంతో అనంతాళ్వారు చాల బాధపడ్డాడు. ఇంకొక రోజు రాత్రి కాపలాకాసి ఇద్దరిని పట్టుకోబోతే స్వామివారు పారిపోవడం అమ్మవారు దొరికిపోవడం, బంధించడం వంటివి చదువుతూ ఉంటే నా మనస్సుకు ఆధ్యాత్మికానందం కలిగింది. సప్తగిరి మాస పత్రికలో అన్ని శీర్షికలు చాలా బాగున్నాయి.

*- గోపరాజు వేంకట్రామయ్య, ఏలూరు, ప.గో. జిల్లా.*

### చక్కటి సమాచారం!

అక్టోబరు, 2019 సప్తగిరి మాసపత్రికలో మీరందించిన అనేక ఆధ్యాత్మికవ్యాసాలు బాగున్నాయి. ముఖ్యంగా 'మనదేవాలయాలు'శీర్షికలో అందిస్తున్న సమాచారం బాగుంది. భక్తివ్యాసాలను అద్భుతవర్ణనలతో వర్ణిస్తూ పాఠకులకు అర్థమయ్యేలాగా రచనలు చేసే జూలకంటి బాల సుబ్రహ్మణ్యంగారు 'దివ్యక్షేత్రం తిరుమల' వ్యాసాన్ని చాలా చక్కగా వివరించారు. వీరికి ప్రత్యేక అభినందనలు.

*- గుగ్గిలం జాహ్నవి, వేటపాలెం, ప్రకాశం జిల్లా.*

### క్రమం తప్పక..

సప్తగిరి సచిత్రమాసపత్రికను ప్రతినెలా క్రమం తప్పకుండా చదువుతూ ఉంటాను. సప్తవర్ణశోభితంగా, పాఠకులకు కనువిందుగా, అనేక ఆధ్యాత్మిక విశేషాలతో అన్నివర్గాల పాఠకులను ఆకట్టుకునేలా ప్రతినెలా పత్రికను సకాలంలో అందిస్తున్న తి.తి.దే. యాజమాన్యానికి ధన్యవాదాలు.

*- అందె ప్రభాకర్, వరంగల్లు.*



తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



## 'సప్తగిరి' చందాదారులకు విజ్ఞప్తి

**సప్తగిరి మాసపత్రిక చందాదారులకు ప్రతినెల సకాలంలో చేరడానికి అనేకచర్యలు తీసుకుంటున్న సంగతి పాఠకలోకానికి విదితమే! ఈ క్రమంలో చందాదారుల చిరునామాల క్రమబద్ధీకరణకు అనేకచర్యలు తీసుకుంటున్నాం. చందాదారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ క్రిందివిధంగా ప్రధానసంపాదకకార్యాలయానికి తెలియజేయవచ్చు.**



01) **'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు sapthagiri_helpdesk@tirumala.org ద్వారా తెలియజేయవచ్చు.**

02) **సప్తగిరి చందాదారుల చిరునామాల క్రమబద్ధీకరణకోసం 0877- 2264543 ఫోన్ నెంబరుకు చందాదారులు తమ పూర్తి చిరునామాను పిన్‌కోడ్, సెల్‌ఫోన్‌నెంబరుతో సహా కార్యాలయ పనివేళల్లో (ఉ.10.30 గం॥ల నుండి సా.5.00 గం॥ల లోపు) మరొకసారి తెలియజేయగలరు.**

03) **పై ఫోనునెంబరుద్వారాగానీ, sapthagiri_helpdesk@tirumala.org ద్వారా గానీ తెలుపగలరు.**

04) **ఆన్‌లైన్ చందాదారులు తమ పూర్తి చిరునామాలను క్రమబద్ధీకరణకోసం తి.తి.దే. వెబ్‌సైట్‌ద్వారా మరొకసారి తెలియజేయండి!**

- ప్రధాన సంపాదకుడు



తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 50 డిసెంబరు, 2019 సంచిక : 07

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| తిరుమల సంపద | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 07 |
| గోదాదేవి తిరుప్పావై తత్త్వం | డా॥ పరవస్తు కమల | 08 |
| గ్రహణాలు | శ్రీమతి పి.విజయలక్ష్మి | 12 |
| గీతాజయంతి | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 13 |
| శ్రీకృష్ణభగవద్విజయం | డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు | 15 |
| సందేహాలు - సమాధానాలు | శతావధాని ఆముదాల మురళి | 18 |
| మనిషి ఎదగాలంటే...! | శ్రీమతి జి.సావిత్రి | 19 |
| శ్రీవారిసన్నిధిలో... అధ్యయనోత్సవం | డా॥ చిలకపాటి విజయరాఘవాచార్యులు | 22 |
| ఏగూటి చిలుక.. ఆపాట పాడుతుంది! | మాస్టర్ బి.చరణ్ సంతోష్ | 25 |
| దివ్యక్షేత్రం తిరుమల | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 31 |
| వయస్సుతో.. పని ఏముంది? | డా॥ పి.అనంతలక్ష్మి | 34 |
| ఋషభ దేవుని ఆవిర్భావం | డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్ | 37 |
| శ్రీవిల్లిపుత్తూరు | శ్రీ కె.కె.మంగపతి | 39 |
| వెలితిని పూరించిన వేణుమాధవుడు | డా॥ గాలి రాజేశ్వరి | 40 |
| కైంకర్యమే తనువు దాల్చితే... | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 42 |
| నల్లగుట్ట శ్రీకూర్మనాథస్వామిక్షేత్రం | శ్రీ ఎ.జి.నరేష్ | 44 |
| చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా! | శ్రీమతి వి.ఉమారాణి | 46 |
| ప్రకృతికానుక - కానుగ | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 48 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ టి.వి.కె.పూర్ణప్రసాద సిద్ధాంతి | 51 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 52 |


ముఖచిత్రం : శ్రీ పద్మావతీ అమ్మవారి పుష్పయాగమహోత్సవం
వెనుక చిత్రం : గోదా అలంకారంలో గోవిందుడు

వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి॥


గౌరవ సంపాదకుడు
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

సంపాదకుడు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకుడు
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

ముద్రాపకుడు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఇడి.,
ఉపకార్యనిర్వహణాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



సప్తగిరి మాస పత్రిక
ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360



విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.


24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333

వెబ్‌సైట్- www.tirumala.org, www.tirupati.org; ఆన్‌లైన్ సేవలు/వసతిసౌకర్యం కొరకు- www.ttdsevaonline.com
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# కృష్ణం వందే జగద్గురుమ్

భగవద్గీత సర్వకాలిక ప్రామాణిక గ్రంథం. సర్వులకూ, సర్వత్రా మార్గదర్శి, ఈ గ్రంథంలో విశ్వజనీన సత్యాలు, సమకాలీన ఉపయుక్తధర్మాలు ఎన్నో ఉన్నాయి. అందుకే ఇది ఈనాటి వరకు కాలంతో పాటు నడిచి వస్తూనే ఉంది. నిజానికి నాడు భగవద్గీతా ప్రబోధం జరిగింది, కురుక్షేత్రంలోనే అయినప్పటికీ, ఆ ఉపదేశం అను దినం మానవహృదయక్షేత్రంలో వర్తిస్తూనే ఉంది. కురుక్షేత్రం ధర్మక్షేత్రం. ఇంద్రియాలనే రథాశ్వాలను అదిలించగల కృష్ణుడు- సర్వాంతర్యామి అయిన పరమాత్మ.

భారతీయ ఆధ్యాత్మికసంస్కృతిలో కృష్ణుడు ఒక గురువు, పరిపూర్ణుడు, అర్జునుడు శిష్యుడు, సాధకుడు. ఇది ఒక గురుశిష్యసంప్రదాయం. ఈ కురుక్షేత్రంలో కృష్ణుడు ఐహికఅశ్వాలను అనగా ఇంద్రియాలను అదుపులో ఉంచు కుంటే ఆత్మానందానుభూతికి నిలయుడు కాగలడన్నాడు. అక్షరగీత మనకళ్లముందుంది. ఆ ఉపదేశం మానవజాతికి హితోపదేశం కాబట్టి శ్రీమద్భగవద్గీత ఈనాటికీ నిత్యనూత్నంగా ఆవిష్కృతమవుతూనే ఉంది. మనుషులకు అనునిత్యం అవసరమవుతూనే ఉంది.

ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో కృష్ణుడు అర్జునుడికి చేసిన గీతోపదేశమే కాలాతీతమైన ఆత్మజ్ఞాన సంకలనం. ఇంతకి ఈ క్షేత్ర వైశిష్ట్యం ఏమిటంటే కురుక్షేత్రంలో వీరమరణం పొందినవారు ఉన్నత స్వర్గవాసులు అవుతారని కురురాజుకు బ్రహ్మ అభయమివ్వటమే!

సృష్టి ప్రారంభంనుండి భరతఖండాన్ని ఆలంబనంగా చేసుకున్న భూగ్రహ చరిత్రమే మహాభారతం. లక్షశ్లోకాల మహాభారతాన్ని మించిన మరో మహాగ్రంథం ప్రపంచసాహిత్యంలో లేదు. ఎన్నివేల సంవత్సరాలు గడుస్తున్నా మనలోని ప్రతిఒక్కరం గీతలో మన స్వస్వరూపాన్ని చూచుకోగలం.

మన మనస్తత్వాన్ని, మనవ్యక్తిత్వాన్ని, మన తత్త్వాన్ని మనకు మనంగా గీతలో చూచుకోగలం. కురుక్షేత్ర సంగ్రామ సమయంలో కృష్ణుడు అర్జునుడికి ఎరుక పరచిన కర్మ, భక్తి, జ్ఞాన యోగాల త్రిపుటి భగవద్గీత పద్దెనిమిది అధ్యాయాలతో మూడువిభాగాలుగా శ్లోకాలతో ఇప్పటికీ సంపూర్ణ, సమగ్రవిశ్లేషణకు అందని మహాగ్రంథమిది.

వృత్తి-సామాజిక-ఆత్మ ధర్మాల పరంగా తిరోగమించకుండా కర్తవ్య పరాయణతను స్పష్టపరుస్తుంది-గీత. ఈ కర్తవ్యానికి మరోముఖమే కర్మ. ఫలితంకంటే ఆచరణే ముఖ్యం అనేది గీతాసారాంశం. మానవజన్మ అనేది కేవలం ఈ దేహానికిమాత్రమే సంబంధించింది కాదు. దేహం అంటే క్షరం- నశించేది- అశాశ్వతమైంది- కాబట్టి ఈ స్థితులన్నిటికీ సాక్షీభూతం అవుతూ, అతీతం కావటం ముఖ్యం. అది ఆత్మజీవనం.

ఆత్మ అంటే అక్షరం- నశించనిది- శాశ్వతమైంది-అమృతం. మరల మరల జన్మకు వచ్చేదంతా ఒక మాయా వలయం. ఈ భ్రమాన్విత దృశ్యమానంనుండి యోగ ధ్యానాది మార్గాలద్వారా ఆత్మకు అతీంద్రియత సుసాధ్యం అని గీత స్పష్టంగా చెప్తుంది. గురుశిష్య సంవాదరూపంలో చైతన్య స్థితుల రహస్యాలను ఆవిష్కరించింది. మనలోని ప్రతి ఒక్కరికి ఒక 'ఖగోళబాధ్యత' గీత ప్రతిభ! కృష్ణుడు అర్జునుడికే కాదు మనకూ చెప్పాడు. గీతని నిష్కామకర్మ సిద్ధాంతాన్ని బోధించి, మానవుడు సకల కర్మలూ చేస్తున్నా-కర్మబంధాల్లో తగుల్కోకుండా ఎలా ముక్తుడు కావచ్చో చక్కగా నిరూపించింది. గీత- సకల ఉపనిషత్తుల సారాంశం. యోగశాస్త్రం. ధర్మశాస్త్రం. కర్మశాస్త్రం. జ్ఞానశాస్త్రం- అన్నిటినీ మించి, మానవజీవన ఆనందరహస్యాన్ని- అర్జునుని నిమిత్తంగా లోకానికి అందించిన మహోన్నత గ్రంథరాజం! గీతోపదేశంతో కృష్ణుడు జగద్గురువయ్యాడు. గీత ఆవిర్భవించిన పుణ్యదినాన్ని ప్రతి భారతీయుడు ఒక పర్వదినంగా జరుపుకుని సకలశుభాలు పొందాలని ఆకాంక్ష!

# తిరుమల సంపద

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

వేంకటగిరి స్థూలనేత్రాలకు రాతికొండగా కనిపించినా, సూక్ష్మదృష్టికి ఇది విష్ణుచైతన్య విలసితం.

**'వేదములే శిలలై వెలసినదీ కొండ. యే దెస పుణ్యరాసులే ఏరులైనదీ కొండ, పదివేలశేషులపడగలమయమైన దివ్యపర్వతమిది.... అని శాస్త్రాధారంగా అన్నమయ్య దర్శించాడు.'** ప్రాచీన ఆధ్యాత్మికగ్రంథాల్లో ఉన్న ప్రశస్తితో పాటు, భారతీయ చారిత్రక సాంస్కృతిక వైభవాలకు కూడా ఈ గిరి ఆధారం.

ఈ కొండను, ఈ దైవాన్ని కొనియాడుతూ అద్భుతమైన సాహిత్య, సంగీత, శిల్పకళాదులు విస్తరిల్లాయి. ముఖ్యంగా ఆంధ్రసాహితీ సంగీతాల్లో అగ్రస్థానాన్ని అలంకరించిన అన్నమయ్య తన ప్రాణభావ కళాసృజనలను ఈ స్వామికే కైంకర్యం చేశాడు.

శ్రీకృష్ణదేవరాయలు తన 'ఆముక్తమాల్యద' ప్రబంధాన్ని ఈ వేంకటభర్తకే అంకితం చేశాడు.

ఆళ్వారుల రచనలు స్వామిని అనేకంగా కీర్తించాయి. పేయాళ్వారు, పొయ్‌గైఆళ్వారు, తిరుమంగై ఆళ్వారులు స్వామిని హరిహరాద్వైతమూర్తిగా కొనియాడారు.

తిరుమలనంబి (శ్రీశైలపూర్ణులు), భగవద్రామానుజులు, కురువనంబి, అనంతాళ్వారు మొదలైన భక్తాచార్యులు శ్రీనివాసుని దివ్యతత్త్వాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు.

**“ఒప్పుల కుప్పయై ధర మహోన్నతుడై వెలుగొందుచుండు మా అప్పుడు వేంకటేశ్వరుడహర్నిశమున్ కమలాసమేతుడై...”** అని కీర్తించిన తరిగొండ వేంగమాంబ శ్రీవేంకటాచలమాహాత్మ్యం' రచించింది. పలు కీర్తనలతో ఆరాధించింది. శ్రీనివాసుడు భక్తవాత్సల్యమూర్తి. ఆయన సేవలు భక్తులపై తాను చూపించిన కృపకు సంకేతాలు. స్వామి గర్భగుడి గడప- కులశేఖరాళ్వారుల రూపం.

**లెక్కలేనన్ని తీర్థాలు, కోనేరులు ఈ పర్వతశ్రేణిలో ఉన్నాయి. దేవతలు, మహర్షులు, ఆచార్యులు, భక్తులు, తపస్వులు అనాదిగా ఆశ్రయించి ఆరాధిస్తున్న వేంకటాద్రి చరిత్రకీ, సంస్కృతికీ, ఆధ్యాత్మికతకీ, భక్తికీ ఆధారమై విరాట్ హైందవ చైతన్యాన్ని విశ్వవ్యాప్తం చేస్తోంది.**

నిరంతరం వేంకటేశదర్శనాన్ని కోరిన కులశేఖరులు గడప (కులశేఖరాళ్వార్‌పడి)గా మారాడంటారు. కురువరతి నంబి అలనాడు మట్టిపాత్రలో నివేదన చేసినదానికి గుర్తుగా నేటికీ స్వామివారికి మట్టిపాత్రల్లోనే ఆరగింపు. 'పడి'కి ఆవల స్వామికి నివేదించేది మట్టిపాత్రలోనే.

తరిగొండవారి హారతి, అన్నమయ్యవారి పాట ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అనంతాళ్వారువారి భక్తికి సంకేతంగా స్వామి గడ్డాన పచ్చకర్పూరం, తిరుమలనంబివారి సేవకు ప్రతీకగా ఆకాశగంగాజలం నేటికీ స్వామి భక్తవాత్సల్యానికి చిహ్నాలు.

యోగపరంగా చూస్తే - మనలోని మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞాచక్రాలను దాటి సప్తమస్థానమైన పరంధామాన్ని (సహస్రాన్ని) చేరుకొనే యోగసాధన ఈ సప్తగిరియాత్రలో సంకేతం.

ఈ ఏడుచక్రాల ప్రయాణంలోని యోగశక్తి కుండలినిని యోగవిద్యలో సర్పంగా సంకేతించారు. ఆ సర్పస్ఫురణే 'శేషాచలం'గా ఈ పర్వతంలో ద్యోతకమవుతోంది.

స్వామి పుష్కరిణిలో సరస్వతీనది అంశగా ప్రవేశించిందని పురాణకథ.

ఆపద్బాంధవునిగా, భక్తవత్సలునిగా, సర్వదేవతామయునిగా ప్రకాశిస్తున్న నారాయణ బ్రహ్మం-శ్రీతిరుమలగిరి ప్రభువు.





# గోదాదేవి తిరుప్పావై తత్త్వం

- డా॥ పరవస్తు కమల, 82472 20512

'తిరుప్పావై' అనేది దివ్యప్రబంధం. ఇది ద్రావిడ వేదంగా పరిగణింపబడుతున్నది. 'తిరుప్పావై' అంటే ఏమిటి? 'తిరు' అంటే శ్రీ. 'శ్రీ' అంటే లక్ష్మి, సంపద, మోక్షం - అని అర్థాలున్నవి. 'పావై' అంటే వ్రతం. నియమ నిష్ఠలతో ఆచరించబడే సంకల్పవ్యాపారం 'వ్రతం' అన బడుతుంది.

## 'తిరుప్పావై' అంటే...

శ్రీకోసం ఆచరించబడిన ఒక వ్రతం ('పావై' అంటే పాటలతో కూర్చినమాల.) శ్రీని పొందడం కోసం మాల కూర్చి పాటలుగా పాడింది గోదా. మాలలో రకరకాల పుష్పాలు కూర్చబడి ఉంటాయి. అన్నిపుష్పాలు ఒకే దారానికి (సూత్రానికి) కూర్చబడి ఉన్నాయి. దారం ఒకటే కానీ పువ్వులెన్నో! ఈ పాటలలోని భావాలు ఎన్నైనా, ఒకరి కోసమే! ఒకే ఫలితం పొందడంకోసం, రకరకాల తత్త్వాలతో కూడుకున్న విషయాలను ఒకేచోట కూర్చి, గానం చెయ్యబడింది. కేవలం గానంమాత్రం చేస్తే అది వ్రతం ఎలా అయింది? అంటే ఇదొక సంకల్పయజ్ఞం. మనసు సంకల్పించి భక్తిభావనాజలంలో స్నానమాడి 'ఆనందానుభూతి' అనే శ్రీని గోదా పొందింది. ఇదే ఈ పాట పొందించిన అనుభవం. ఇదే ఈ వ్రతం అందించిన మధురానుభవం. అదెలా సాధ్యం? ఎందుకు కాదు! అప్పుడెప్పుడో, ద్వాపరయుగంలో గోపికలు వ్రేపల్లెలో ఈ రకమైన సంకల్ప వ్రతం చేశారట! అందుకు సాక్ష్యంగా భాగవతం గోపికల కథలు చెప్తున్నది.

## ద్రావిడ వేదమంటే?

ఏదో భక్తితో భగవంతుణ్ణి గూర్చి పాడుకొన్న పాటలు 'ద్రావిడవేదం' ఎలా అయింది? వేదమంటే సంస్కృతంలో, స్వరాలతో కూర్చిన ఎన్నోమంత్రాలు, అందులో ఎన్నో భాగాలు? కేవలం ముప్పైపాటలు కలిపి పాడితే అదేం వేదం? అనంతమైన వేదాలను రాశితో కొలిస్తే ఈ విశ్వం సరిపోదు. మూడువేదాలు మూడుపర్వతాలు. ఆ పర్వతప్రమాణ అనంతజ్ఞానాన్ని అధ్యయనం చేయడానికి భరద్వాజమహర్షి అంతటివానికే మూడువందల ఏళ్ల ఆయుః ప్రమాణం సరిపోలేదు. మామూలు మనుషులు ఆ జ్ఞానాన్ని పొందడానికి ఈ ఆయువు సరిపోతుందా?

అందుకే ఆ రాశితత్త్వాన్ని, ఉపనిషత్తులు ప్రతిపాదించిన పరమాత్మతత్త్వాన్ని, జీవి పొందవలసిన జ్ఞానాన్ని పొందుపరిచి, పరమాత్మకు అర్పించిన మాలయే తిరుప్పావై. వేదోపనిషత్తుల సారమైన భగవద్గీతాజ్ఞానాన్ని కూడా ఇందులో సువాసనలుగా అందుకున్న మాల ఇది.

అందుకే ఇది వాడని అక్షరమాల. దీన్ని మననం చేస్తే ఆత్మ వికసించి పరిమళిస్తుంది. ద్రావిడభాష తమిళం కనుకనే, ఇది ద్రావిడ వేదమై సూక్ష్మంలో మోక్షాన్నిస్తుంది.

## తిరుప్పావై వ్రతం ఎవరు చేశారు?

ద్రావిడదేశంలో శ్రీవిల్లిపుత్తూరులో ఒక 'వట పత్రశాయి' అనే శ్రీ కృష్ణుడిఆలయం ఉంది. ఆ కృష్ణుణ్ణి తన తులసీవనంలో తులసిమాలలతో మాలాకైంకర్యం చేస్తూ ఉండేవాడొకభక్తుడు. అతడి పేరే విష్ణుచిత్తుడు అనే ఆళ్వార్. 'ఆళ్వార్' అంటే గొప్పభక్తుడు. భగవత్ప్రేమసాగరంలో మునిగినవాడు. అతడికి తులసివనంలో దొరికిన బిడ్డ గోదా దేవి. ఆ గొప్పభక్తుడిచే పెంచబడిన ఆమెకూడా గొప్ప భక్తురాలైంది. గోపికలు శ్రీకృష్ణుణ్ణి పొందడానికై భక్తితో వ్రతం చేశారట-ఆనాడు. ఈ నాడు ఈ కలియుగంలో తన తోటివారినే గోపికలుగా ఊహించుకొని, తాను స్వయంగా తిరుప్పావై పాటలు పాడి, ఆ వ్రతాన్ని ఆచరించింది. ఆచ రించడమే కాదు, శ్రీరంగనాథుని పాదపద్మాల్లో లీనమై తాను కోరిన వ్రతఫలాన్ని పొందింది. "భక్తితో భగవంతుణ్ణి కోరు కుంటే, తప్పక అతణ్ణి పొందగలరు. దానికి దేశ, కాలాలతో సంబంధం లేదు" అని నిరూపించింది-గోదాదేవి. అందుకే విష్ణుచిత్తులవారు ఆమెను, "తనను రక్షించడానికై వచ్చింది ఆ తల్లి" అనీ 'ఆండాళ్' అనీ పిల్చారు. లక్ష్మీ అంశంతో జన్మించిన గోదాదేవి విష్ణువులో లీనమైంది.

## ఈ వ్రతం ఆండాళ్ ఎందుకు చేసింది?

లక్ష్మిగా ఉన్న ఆ తల్లి ఈ భూమిపై జన్మించడ మెందుకు? జన్మించి, ఈ వ్రతాలు చేసి, పాటలు పాడి, మళ్ళీ జన్మసమాప్తి చేసుకోవడం ఎందుకు? అంటే అదే ఆ పరమాత్మ సంకల్పం. పరమాత్మహృదయంలో లక్ష్మి వెలిగి తేనే జీవులను కరుణించే సంకల్పం కలుగుతుంది.

శ్రీకృష్ణావతారంలో ధర్మసంరక్షణం, స్థాపనం కోసం, అందరికర్మల్నీ నిర్ణయించే పరమాత్మ అర్జునుడితో కర్మ చేయించి, జీవులకు మళ్ళీ గీతోపదేశం చేశాడు. అవతారం చాలించుకున్నా తృప్తి తీరలేదు. చింతిస్తూ ఉన్నాడట! అప్పుడు లక్ష్మీదేవి గోదాదేవిగా జన్మించి, మళ్ళీ జీవులను తరింపజేయడానికి, ఇంకో పద్ధతిలో భగవంతుణ్ణి అర్చించే విధానాన్ని అను గ్రహించింది. ఇక్కడ కాలం మారింది. నోటితో చెప్తే చాలదు నిదర్శనం కావాలి- అందుకే తానే స్వయంగా ఆచరించి, 'ఇదిగో ఈ ఫలితాన్ని మీరు పొంద వచ్చు సుమా! ఎవరైనా చేసి ఫలితం పొందవచ్చు అని నిరూపించింది.

## ఈ వ్రతం లక్ష్యం ఏమిటి?

ఈ వ్రతలక్ష్యం ఏమిటి? మరి తమ ఒక్కరి సుఖం కోసమే, ఆనందంకోసమే దీన్ని ఆచరిస్తారా! అంటే ఈ లక్ష్యాలు స్పష్టంగా చెప్పబడినాయి. లోకమంతా సంపద లతో, సస్యశ్యామలంగా ఉండాలి. అందరూ కలిసి భగ వానుణ్ణి కీర్తిస్తూ తెల్లవారుజామున స్నానం చేసి, ఆచరించే వ్రతం ఇది. స్వతంత్రతాభావాన్ని వదిలి, భగవానుడికే పరతంత్రలం అనుకునే స్వభావం కల్గియుండడం ఈ వ్రత నియమాల్లో ముఖ్యమైంది. అంతేకాదు, సౌందర్య స్వరూప లైన గోపికలు చేశారు- వ్రతం. సౌందర్యమంటే ఆత్మ సౌందర్యం. స్నానమంటే భక్తిజలంలో తడిసి పవిత్రం కావడమే! శ్రీకృష్ణుడినే ఎందుకు ఆరాధించారు? భక్తి, దాస్యాలు కల్గించేవాడు- కృష్ణుడు. కనుక ఆరెండింటితోనే మోక్షాన్ని పొందారు గోపికలు.



## ఈ వ్రతం చేసి వీరు పొందింది ఏమిటి?

ఏదో పర అనే వాద్యమట! గొల్లలు కనుక 'తప్పెట' (పర) అనే వాద్యాన్ని కోరారు. ఆడవాళ్ళకు వాద్యాలెందుకు? అంటే ఈ పరవస్తురూపంలో చెప్పబడుతున్నా కూడ, నిజంగా కనిపించే వస్తువేనా! అంటే 'కాదు' అని. తెలుస్తున్నది. ఎల్లప్పుడూ పరమాత్మతో కలిసి ఉండే వస్తువులే ఈ వ్రతంలో గోపికలు కోరారు. పరమాత్మలో కలిసి ఉండడమంటే మానవులకు సాధ్యంకాదు గదా! అది ఎప్పుడు సాధ్యపడుతుందో, ఆ విధంగా సాధ్యపడేట్లు చేస్తుందట ఈవ్రతం, అంటే గోదాదేవి వ్రతం చేసి రంగనాథునిలో లీనమైపోయింది కదా! మానవులు ఈ వ్రతం చేసి పొంద వలసింది అదేనా! అనే అనుమానం వస్తుంది. అప్పుడు ఈ వ్రతంవల్ల పొందే బాహ్య వస్తువులు, బాహ్యంగా ఆచరించే నియమనిష్ఠలూ అన్నీ పైకి కన్పించేవే గానీ, నిజంగా వాటి అసలు అంతరాలు, అర్థాలు వేరు అని స్పష్టంగా తెలిసి పోతున్నది. ఈ విధంగా అంతరార్థాలు దాచుకుని కొన్ని ప్రత్యేకసంకేతాల ద్వారా, వస్తువుల ద్వారా విషయాన్ని తెలియజెప్పే సాహిత్యం ప్రతీకాత్మక సాహిత్యంగా పిలువ బడుతున్నది. ఈ తిరుప్పావై సాహిత్య రచన ఈ విధమైన (ప్రతీకాత్మక) రచనగా స్పష్టమౌతున్నది. వేదోపనిషత్తు భావాలను, పురాణకథలను, విష్ణువు దశావతార తత్త్వాలను సంపూర్ణంగా దాచుకొని, కేవలం, కన్నెపిల్లలు చేసే ఒక, స్నానవ్రతంగా కనబడుతుంది. ప్రస్థానత్రయంలో ఒకటైన భగవద్గీత చెప్పే కర్మ, జ్ఞాన, భక్తి యోగాలను స్పష్టపరుస్తూ, మధురానందాన్ని పొంది, పొందించే ఒక అపూర్వభక్తిమాల ఇది. గోదాదేవి ధరించే నిండైన తోమాల, భక్తి, గాన తత్త్వమాలిక. ఆమె చేతిలోని చిలుక ఆచార్యుడికి ప్రతీక. పుష్పమాల భక్తి భావాలకు ప్రతీక. జ్ఞానం, పొందడమే గాకుండా దాన్ని ఆచరించడం అనేది ఆచార్యుల లక్షణం. జ్ఞానం, ఆచరణం అనే రెండు రెక్కలతో, బ్రహ్మానంద భావాలను తీయగా పలికే పలుకు చిలుక ఆచార్యుడి స్వభావానికి స్వరూపానికి ప్రతీక.

## ఈ వ్రతాచరణకు ఎంచుకున్న సమయం

గోదాదేవి ఆచరించిన ఈ వ్రతానికి 'మార్గశీర్ష వ్రతం' అని పేరు. మార్గశిరమాసం, లేక దాన్నే ధనుర్మాసం అంటారు. ఈ వ్రతం ఈ నెలలోనే ఎందుకు చేయాలి? మార్గమంటే ఉపాయం, శీర్షమంటే శ్రేష్ఠమైంది. భగవంతుని పొందడానికి అది మంచిసమయం. 'ప్రణవస్వరూపుడు' శ్రీరాముడు ధనుస్సు ధరించాడు. విష్ణువుకూ ధనుస్సు ఉంది. ధనుర్విద్య లక్ష్యసాధనకోసం పూర్వకాలంలో నేర్పించే విద్య; 'ధనుస్సును' ప్రణవంగా, ఆత్మనే బాణంగా శరీరాన్నే ధనుస్సుగా, తెలియజెప్పున్నాయి ఉపనిషత్తులు, పురాణాలు. మాసాల్లో మార్గశీర్షమాసాన్ని నేనే సుమా!"– అంటున్నాడు భగవద్గీతలో స్వయంగా పరమాత్మ.

కనుక వ్రతనియమాలు ప్రత్యేకఅర్థాలు కలిగినవే! వ్రతఫలం ప్రత్యేకమైనదే! వ్రతం చేసే సమయం ప్రత్యేక మైనదే! ఇవన్నీ ప్రత్యేకార్థాలను దాచుకున్నవే. కనుక 'తిరుప్పావై' – సాహిత్యంలో ప్రతీకలను తెలియజెప్పే పారమార్థిక రచనగా తెలుస్తున్నది.

## గోదాదేవి, భక్తిమాల, కాంతితీగ, దివ్యకంకణ ధ్వని

గోదాదేవి, భక్తిసుమమాలగాను, 'బంగారుకాంతి తీగగాను చెప్పబడుతున్నది. "శూడిక్కొడుత్త శుడర్ క్కోడియే! తొల్ పావై పాడి యరుళ వల్ల పల్ వళైయామ్, వేంగడ వఱ్కెన్నైవిది యెన్ఱ విమ్మాత్తమ్, నాంగడవా వణ్ణమే నల్గు." అని పరాశరభట్టర్ గోదాదేవిని స్తుతించినారు.

"బంగారుకాంతులు (భక్తిజ్ఞానసౌరభాలు) వెదజల్లే పుష్పమాలను దాల్చి, దాన్ని శ్రీరంగనాథునికి సమర్పించిన ఓ బంగారు తీగ! పూర్వమెప్పుడో జరిగిన దివ్యమైన వ్రతాన్ని మధురగీతాలుగా పాడి, ఎన్నోరకాల జ్ఞానాలను శమింప జేసిన దివ్యకంకణధారిణీ! వేంకటాచలపతికి నీవు ప్రియము కల్గించుమని ప్రార్థించిన విధంగానే, నీ దాసులైన మాకు కూడా ఆవ్రతభాగ్యం తప్పక కల్గించుతల్లీ." అని దీని భావం.

గోదాదేవి శ్రీరంగేశ్వరుడికి అందించిన మాల, భక్తి జ్ఞానపరిమళాలు వెదజల్లేది. గోదాదేవి భక్తిమాలకు ప్రతీక శరీరంలో దాగిన షట్చక్రాలు, (తామరలు) బంగారు తీగకు అమర్చి ఉన్నాయి. జ్ఞానతత్త్వాన్ని పొందడమే బంగారు, కాంతి తీగ సంకేతం. గోదాదేవి బంగారుతీగకు ప్రతీక. గోదాదేవి పాడినపాటలు రకరకాలుగా (శ్రుతి అనేక రకాలుగా ప్రతిపాదించిన) ధ్వనించే కంకణశబ్దాలు కల్గినవి.



తిరుమలలో భక్తులు శ్రీవరాహస్వామిని ముందుగా దర్శించాలి

అంటే భక్తిసుమమాలను పరమాత్మకు అందించే చేయి అనేకరకాల కంకణాల ధ్వని కల్గి ఉండాలి. చేయి కదిలితే కంకణాలు (గాజులు) ధ్వనిస్తాయి. హృదయస్పందనను చేతిగాజులు ప్రతిధ్వనింపజేయాలి. గోదాదేవి తిరుప్పావై, దివ్యకంకణాలకు ప్రతీక. 'వేం' అంటే పాపాలు, 'కట' తొలగించేవాడు కనుక వేంకటాచలపతి పరమాత్మ రూపం. వేంకటాద్రికూడా పరమాత్మను చేరే జ్ఞానతత్త్వమే!

## వ్రతస్థలం - గోవులు, పాడి, సస్యసమృద్ధి, హంసలు, వరిపంటగల వ్రేపల్లె

శ్రీకృష్ణుడికోసం గోపికలు చేసిన వ్రతం కాత్యాయనీ వ్రతం. గోపికలు ఉండేచోటు వ్రేపల్లె. లేక రేపల్లె. అక్కడ గోవులు, సమృద్ధిగా ఉంటాయి. వర్షం సమృద్ధిగా కురుస్తుంది. పంటలు బాగా పండి ఫలాన్నిస్తాయి. వరిపొలాల్లో హంసలు తిరుగాడుతుంటాయి.

కాత్యాయని అంటే పార్వతీదేవి. స్త్రీలు సౌభాగ్యం కోసం పార్వతిని కొలుస్తారు. పార్వతి శివునిలో లయం చెందినట్లుగానే గోదాదేవికూడా శ్రీరంగనాథునిలో లీనం కావాలని కోరింది.

### 1) గోపాలురు, గోపికలు

గోవులను కాపాడేవారు-గోపాలురు. గోవంటే వేదం. వేదరక్షణ చేసినవారు గోపాలురు.

గోపిక అన్నా కాపాడేదనే అర్థం. గోపాలకులు గోవుల్ని కాపాడితే, గోపిక పాడిని కాపాడింది. పాలు, పెరుగు సాత్త్వికతత్త్వాలు. ఆ తత్త్వాల్లో దాగి ఉండే పరమాత్మ తత్త్వం అదే వెన్న. ఆ వెన్నను తీయడం, యజ్ఞకర్మల కుపయోగించే నెయ్యిని తయారు చేయడం- ఇది గోపికల పని. అందుకే గోపికలకు అందుబాటులో ఉన్నతత్త్వం శ్రీకృష్ణతత్త్వం. నిర్మలమైన మనసుతో కృష్ణతత్త్వాన్ని, ప్రణవాన్ని, ఆరాధించే కర్మను చేశారు- గోపికలు. 'గోప్యం' అంటే దాచడం. ప్రణవాన్ని హృదయంలో దాచినవారు గోపికలు, భక్తులు.

### 2) యమునానది - శ్రీకృష్ణుడు

శ్రీకృష్ణుడు యమునానది ఒడ్డున ఉన్న వ్రేపల్లెలోనే దాగి పెరిగాడు. కృష్ణ అంటే యమున అనికూడా. 'కృష్ణ' అంటే- కోకిల, కాకి, అగ్ని, మబ్బు అనికూడా అర్థాలున్నాయి. కాకి వలె ఉన్న జీవాత్మ భక్తితో కొలిస్తే, కోకిల లాగా, ప్రణవగానం చేయించగలడు- కృష్ణుడు. పాపాలను అగ్నిలాగా భస్మం చేయగలడు. పాడితే కరుణించి మబ్బులాగా వర్షించగలడు. ఇదే కృష్ణతత్త్వం! నల్లనైనది, లోతైనదీ అగు యమునానది శ్రీకృష్ణుని తత్త్వానికి ప్రతీక. అక్కడ వ్రేపల్లెలో పెరిగాడు-కృష్ణుడు. 'య' అంటే నరకడం. జన్మబంధాలు నరికేసి ముక్తినిచ్చే పల్లె అదే వ్రేపల్లె. ప్రణవ స్వరూపమైన శ్రీకృష్ణుణ్ణి దాచుకున్న తత్త్వమే వ్రేపల్లె. 'రేవు' అంటే గుర్తు. ప్రణవసంకేతం రేపల్లె. 'యమున' అంటే పార్వతి, నది అనికూడా అర్థాలున్నవి. నదిలో స్నానాలు చేసి, పార్వతిలాగా పరమాత్మలో లయం కావాలని చేసిన వ్రతమే, గోపికలు చేసిన వ్రతం.

## శ్రీకృష్ణుని భగవద్గీత - గోదాదేవి తిరుప్పావై

అర్జునుణ్ణి ఒక సాకుగా పెట్టుకొని, కురుక్షేత్ర యుద్ధాన్ని నిమిత్తంగా ఎంచుకొని, శ్రీకృష్ణుడు ద్వాపర యుగంలో, సమస్తమానవులు, కర్మ, జ్ఞాన, భక్తి యోగాలు పొందడానికి భగవద్గీతోపదేశం చేశాడు. అట్లాగే గోదాదేవి, కలియుగంలో మానవులందరూ, ఈ కర్మద్వారా భక్తి మార్గంలో అర్చావతార పరమాత్మను కొల్చి భక్తితో ముక్తి పొందవచ్చునని తెలియజెప్పింది. అందుకోసం, ఒక కారణంగా గోపికలనూ, వారివ్రతాన్ని ఎన్నుకున్నది. వేదోపదేశాన్ని, ఉపనిషత్తుల తత్త్వాన్ని అందంగా, మాలగా కూర్చి, మధురంగా పాటగా పాడి, శ్రీకృష్ణుణ్ణి పొందింది. మీరూ ఇహపరసౌఖ్యాలు పొందండి మానవులారా! అంటున్నది. సంపూర్ణగీతాతత్త్వానికి 'తిరుప్పావై' ప్రతీక. గీత బోధించే నిష్కామకర్మతత్త్వం భక్తి, జ్ఞాన, కర్మ యోగాలు. జీవి, ఈ పరమాత్మను పొందడానికి చేసే కర్మతత్త్వం. పరమాత్మవిభూతుల తత్త్వాలు, భగవంతుడి అవతారతత్త్వాలు, ధర్మరక్షణ, వీటన్నిటనీ మించి, జీవుల మీద పరమాత్మకుండే ఆర్తి, ఇవన్నీ మధురంగా గానం చేయబడి, అర్చావతార ప్రాముఖ్యతను చాటుతోంది తిరుప్పావై గ్రంథం.

గృహలక్ష్మి

# గ్రహణాలు

- శ్రీమతి పి. విజయలక్ష్మి

గ్రహణమంటే సూర్యచంద్రులకు ఏర్పడే ఉపరాగం. ఉపరాగమంటే ఎర్రనిరంగుతో గ్రహింపబడటం. గ్రహణంనాడు సూర్యచంద్రులు తెల్లనికాంతితో గాక- ఎర్రనికాంతితో కన్పించడం మనం చూస్తూనే ఉన్నాము. గ్రహణం= గ్రహించడం.

మన పురాణాల ప్రకారం ఛాయాగ్రహాలైన రాహు కేతువులు సూర్యచంద్రుల్ని మ్రింగినప్పటికాలం గ్రహణం. రాహుకేతువులు నవగ్రహాల్లో చివరిరెండుగ్రహాలు. కాని ఇవి అంతరిక్షంలో ఉండే ఇతరగ్రహాలవలే బ్రహ్మాండ వస్తువులు కావు. ఇవి అప్రకాశగ్రహాలు.

వైజ్ఞానికంగా భూమిచుట్టూ పరిభ్రమించే చంద్రుడు ఈ క్రాంతిమార్గాల్లో ప్రవేశించే కాలం గ్రహణం. భూమికీ- సూర్యునికీ మధ్య వచ్చేకాలం సూర్యగ్రహణం. సూర్యునికీ- భూమికీ ఆపైన ఉండే క్రాంతిమార్గానికి వచ్చునప్పటి కాలం చంద్రగ్రహణం.

సూర్యునిచుట్టూ భూమీ, భూమిచుట్టూ చంద్రుడూ తిరుగుతున్నపుడు ఈ రెండూ ఒక్కోసారి సూర్యునితో ఒకే అక్షంలో ఉండటానికి అవకాశం ఉంటుంది. ఒకే అక్షంలో సూర్యునికీ, చంద్రునికీ మధ్య భూమి రావచ్చు. ఈ స్థితిలో సూర్యునికాంతిని భూమి అడ్డగించడంవల్ల భూమినీడ చంద్రునిపై పడటంతో చంద్రుడు కనబడడు. ఇదే చంద్ర గ్రహణం. ఇట్లే సూర్యునికీ-భూమికీ మధ్య చంద్రుడు వచ్చినపుడు సూర్యకాంతి మనకు కన్పడదు. ఇదే సూర్య గ్రహణం.

ఈ గ్రహణకాలంలో సూర్యచంద్రుల్ని ఆవరించే జ్వాల, చుట్టూ ఉండే బిందువులు - సస్యాలపైనా, ప్రాణుల మీదా, మానవులపైనా విచిత్ర పరిణామాన్ని ప్రసరింప జేస్తాయి. అందువల్ల అనేక దుష్ఫలితా లుంటాయి.

గ్రహణకాలంలో మనఋషులు నియమించిన ప్రకారం ఆహారం, స్నానం - అధికారం ఉన్నవాళ్లు తర్పణం ఆచరించడం ద్వారా ఆ దుష్ప్రభావాలనుంచి గట్టెక్కవచ్చు.

## గ్రహణకాలంలో దర్భల ప్రయోజనం

గ్రహణకాలంలో- ఇంట్లో ఉండే తిండిపదార్థాలైన ఊరగాయలు, పచ్చళ్లు మొదలగువాటిపై కొంతదర్భను వేయడంవల్ల గ్రహణదోషం తొలగుతుందని మన నమ్మకం. ఇది మూఢవిశ్వాసం కాదు. గ్రహణకాలంలో సూర్యచంద్రుల నుంచి వెలువడే ఆకర్షణశక్తి ప్రభావం యొక్క వికిరణం వల్ల- భూమిమీద ఉండే అన్ని చరాచర వస్తువుల మీదా ఆశక్తిప్రభావం ప్రసరణమవుతుంది.

దర్భకు వికిరణశక్తిని నిశ్శక్తిగా చేసే గుణంఉంది. ఇది ప్రకృతి ఇచ్చిన వరం. దర్భను ఆయా వస్తువులపై ఉంచడంతో ఆ గ్రహణకాల సూర్యచంద్ర కిరణాల్లోని విప రీత శక్తిని హరిస్తుంది. ఇది వైజ్ఞానికులు పరిశోధించి, గ్రహించిన విషయం. గ్రహణ సమయంలో చేసే జపాలూ, పారాయణాలూ గొప్పశక్తిని పుంజుకొంటాయి. గ్రహణ కాలంలో గర్భవతులపై ఆ కిరణాలు పడితే - పుట్టే బిడ్డలపై ఆ దుష్ఫలితం తప్పక ఉంటుంది. అందుకే గర్భవతుల్ని గ్రహణమున్నంత సేపూ ఆ కిరణాలు సోకనీకుండా ఇంటి లోపల్నే ఉంచుతారు.

ఈ గ్రహణాలనుగూర్చి, మన జోతిశ్శాస్త్రజ్ఞులు ఎంతో కచ్చితంగా లెక్కలువేసి, ఫలానారోజు- ఇదే సమ యానికే- ఇంతేకాలం- ఫలానా ప్రాంతంలో కన్పించేట్టుగా ఏర్పడుతుంది- అని చెప్పడం ఆశ్చర్యకరం!



క్యూలైన్లలో భక్తులు 'ఓం శ్రీవేంకటేశాయనమః' అని ధ్యానించుకోవాలి

## భగవద్గీత-యువత

# గీతాజయంతి

- డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్
9821914642

డిసెంబర్ 8వ తేదీన గీతాజయంతి. ప్రపంచ వ్యాప్తంగా ఒక గ్రంథానికి ఆవిర్భావమహోత్సవం జరపడం భగవద్గీతకే లభించింది. భగవద్గీత సాక్షాత్తుగా భగవద్వాణి. సాక్షాత్తుగా శ్రీకృష్ణభగవానుడు అర్జునునికి ఉపదేశించిన జ్ఞానమే భగవద్గీత. భగవద్గీత ఆవిర్భవించింది అద్భుతమైన విజయాన్ని, ఐశ్వర్యాన్ని, అసాధారణమైన శక్తిని, నీతినీ ప్రసాదించడానికేనని తెలిస్తే-గీత పట్ల అమోఘమైన, అపూర్వమైన అభిమానం కలుగుతుంది. ప్రపంచంలో ఎవ్వరైనా జీవితంలో విజయాన్నే కోరుకుంటారు. కానీ, విజయం నిశ్చయంగా కలుగుతుందని అతికొద్దిశాతంమందే ధైర్యంగా చెప్పగలుగుతారు. అయితే విజయం వద్దన్న వ్యక్తి ప్రపంచంలో మనకు ఒక్క అర్జునుడే కనిపిస్తాడు. “విజయం వద్దు, రాజ్యసుఖం వద్దు” అని పలికిన అర్జునుడే భగవద్గీతతో ఉపదేశం విన్న తర్వాత సమస్తవిజయాన్ని సాధించి, విజయునిగా ప్రసిద్ధి చెందాడు. అంటే ఎవడైనా తనకు విజయం వద్దేవద్దని అనుకున్నా, భగవద్గీతను శ్రద్ధగా విని, ఆచరిస్తే విజయాన్ని నిశ్చయంగా పొందుతాడు. దీన్ని బట్టి అర్థమౌతున్నదేమిటంటే ప్రపంచంలో విజయం కోరేవారు నూటికి నూరుశాతం ఉన్నప్పటికీ విజయం కలుగుతుందని ధీమాగా చెప్పేవారు నూటికి పదిశాతం కూడా ఉండకపోవచ్చు. కాని మనిషి ఎప్పుడైతే గీతాధ్యయనం చేసి, గీతాదేశానుసారం జీవితాన్ని కొనసాగిస్తాడో అతడు నూటికి నూరుపాళ్ళు విజయాన్ని సాధిస్తాడు. ఇదే గీతామహిమ. మానవులకు జీవితంలో పరమవిజయాన్ని ప్రసాదించడానికే గీత ఆవిర్భవించింది.



భగవద్గీతా పఠనం- విజయం ఎలా కలిగిస్తుందో విద్యార్థులు అర్థం చేసుకొంటే గీతాభిమానులు అవుతారు. గీతాభిమానంవల్ల మొట్టమొదట కలిగే ప్రభావం మోహం తొలగిపోవడం. మోహమంటే చేయవలసిన పనిని మరచిపోయి, ఏదో ఆలోచనలో పడిపోవడం. అర్జునుడు యుద్ధం చేయడానికి రణరంగానికి వచ్చి, ఆ పనిని చేయకుండా సన్న్యాసం తీసుకొందామని నిర్ణయం తీసుకోవడం మోహానికే గుర్తు. చక్కగా చదువుకోవలసిన విద్యార్థులు, చదువు తప్ప వేరే కార్యక్రమమే లేనటువంటి విద్యార్థులు దానికి బదులు వేరే కలాపాలలో పడడం మోహానికి గుర్తు అవుతుంది. ఇది దాదాపుగా ఎనభైశాతం విద్యార్థులలో కనిపిస్తుంది. గీతాభ్యాసం ద్వారా మోహం తొలగి స్మృతి కలుగుతుంది. స్మృతి అంటే జ్ఞాపకం. అర్జునునికి గీతాశ్రవణం తర్వాత తన కర్తవ్యం గుర్తుకు వచ్చినట్లే విద్యార్థులకు, యువతకు కూడా తమ తత్క్షణకర్తవ్యం గుర్తుకు వస్తుంది. అదే శుభ పరిణామం. కర్తవ్యం గుర్తుకు రాగానే కలిగే మరొక శుభ

పరిణామం ఏమిటంటే వ్యక్తి సుస్థిరునిగా అవడం, చంచలత్వం పోవడం. ఇటువంటి అద్భుతమైన పరిణామం జీవితంలో చోటు చేసికోగానే మనిషిలోని సందేహాలన్నీ తీరిపోతాయి. సందేహాలు దెయ్యాలవంటివి. అవి మనస్సును పట్టి పీడిస్తాయి. కాని బుద్ధి సుస్థిరంగా ఉండే విద్యార్థికి సందేహాలన్నీ తొలగిపోతాయి. అప్పుడు కార్యనిర్వహణం ఒక్కటే ఎదుట నిలుస్తుంది. "కరిష్యే వచనం తవ- శ్రీకృష్ణా! నీవు చెప్పిన కార్యం చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను అని అర్జునుడు అన్నాడు.

"కృషితో నాస్తి దుర్భిక్షం-కృషి చేసేవానికి అసాధ్యమైనది ఏదీ ఉండదు." అయితే నిరంతరకృషి చేసే అద్భుతమైన స్థితిని భగవద్గీతోపదేశ పాలన అందరికీ అందిస్తుంది. ఈ విధంగా మానవులందరినీ కర్తవ్య పరాయణులుగా చేసి జీవితంలో అద్భుతమైన విజయాలను అందించడానికే భగవద్గీత ఆవిర్భవించింది. ఎప్పుడైతే మనిషి ముఖ్యంగా యువత గీతాభిమానులుగా మారుతారో అప్పుడు జీవితంలో విజయపరంపరను సాధిస్తారు.

## తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ శాసన పరిష్కర్త ప్రప్రథమ అముద్రిత తాళ్లపాక సాహిత్యప్రకాశకులు శ్రీ సాధుసుబ్రహ్మణ్యశాస్త్రి - 131వ జయంతి సందర్భంగా...



ఆలయకుడ్యాల అక్షరలిపి నేర్చి
అతిశయసంపద లందఁజేసె
గద్వాల రాణిదె కాంక్షలు నెరవేర
వజ్రకిరీటంబు వాసి పెంచె
తాళ్లపాకకవుల తరుగని సాహితి
ముద్రితమగునట్లు ముదలఁజేసె
ఆరుమొగమువాడు ఆనందమొందఁగా
ఆరు సంపుటముల నలరఁ జేసె

ఏడుకొండల ఒడయండు ఎలమిఁజూడ
ప్రచుర 'శ్రీవేంకటేశ్వర' రచన చేసె
సాత్త్విక గణంబు మదిమెచ్చు సజ్జనుండు
సాధుగృహనామకుని నేను సన్నుతింతు

కనుపాప మెదలెడి కన్నకూతురు చూడ
కాటికి చేర్చిన ఘటన ఒకటి
భూషిత గుణులైన పుత్రద్వయంబదె
బహుదూర మేగిన బాధ యొకటి
పండువయసువేళ భార్యను కోల్పోయి
ఏకాకి అయినట్టి ఎలుగు ఒకటి
హోర వెచ్చమునకై పరులయాచింపని
మదినిండు ఆత్మాభిమానమొకటి

సంకటంబుల పెరిగిన సత్యకీర్తి
కాలపురుషుని గెలిచిన కర్మయోగి!
వేంకటేశపదంబున వెలసినట్టి
సాధు సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి వర్య!

– ఆచార్య కె. సర్వోత్తమరావు,
97041 04000

## 2020, జనవరి నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | ఆంగ్ల సంవత్సరాది |
| 05 | తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామివారి తెప్పోత్సవం ప్రారంభం |
| 06 | ముక్కోటి ఏకాదశి |
| 14 | భోగిపండుగ |
| 15 | మకరసంక్రాంతి |
| 16 | కనుమపండుగ శ్రీగోదా పరిణయోత్సవం |
| 24 | పురందరదాసు ఆరాధనోత్సవం |
| 26 | భారతగణతంత్రదినోత్సవం |
| 30 | వసంతపంచమి (శ్రీపంచమి) |



తిరుమలలో వివాహాది శుభకార్యాలకు 'పురోహిత సంఘా'న్ని సంప్రదించవచ్చు

గత
సంచిక
తరువాయి
భాగం..

ధారావాహిక-08

# శ్రీకృష్ణభగవద్విజయం

- డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు, 89198 32285

రుక్మిణీమందిరంలో...

శ్రీకృష్ణుడు ఉయ్యెలబల్ల మీద కూర్చున్నాడు. రుక్మిణీదేవి లోపలిగదినుండి పిల్లనగ్రోవి తెచ్చి పైటతో తుడిచి శ్రీకృష్ణునికి అందిస్తుండగా నారాయణ..! నారాయణ...!! అంటూ నారదమహర్షి ప్రవేశించాడు. రుక్మిణీ శ్రీకృష్ణులు వినయంగా 'దేవర్షికి ప్రణామాలు' అని చేతులు జోడించారు. నారదమహర్షి 'జగన్మాతా పితృభ్యాం శ్రీరుక్మిణీ వాసుదేవాభ్యాం నమోనమః' అని ప్రతినమస్కారం చేశాడు. స్వాగతం బ్రహ్మనందన! అని శ్రీకృష్ణుడు చేయి చూపగా నారదుడు ఆసనంలో కూర్చున్నాడు. శ్రీకృష్ణుడు కూడా ఆసీనుడయ్యాడు. రుక్మిణీదేవి స్వామిప్రక్కన నిలబడింది.

**శ్రీకృష్ణుడు** : ఎక్కడనుండి తమరిరాక? ఏమిటి విశేషాలు?

**నారదుడు** : నీకు తెలియనివి వున్నయా నీరజాక్ష!

**శ్రీకృష్ణుడు** : అయినా మీనోట వినటం మాకు మహానంద సంధాయకం మహర్షీ!

**నారదుడు** : ఈ మధ్య ఒకసారి సాల్వదేశంలో సంచరించాను. సరికొత్త విషయాలు సంగ్రహించాను. అందుకే నిన్ను సందర్శించాలని వచ్చాను.

**రుక్మిణి** : ఊరక రారు మహాత్ములు.

**నారదుడు** : ఊరక రావలసిన కర్మ నారదునికేం పట్టిందమ్మా రుక్మిణీదేవీ! ఎంతమందమతి అయినా ప్రయోజనాన్ని ఆశించకుండా పనిచేయడు కదా! కనుక ప్రయోజనాన్ని కోరే ప్రభుదర్శనానికి వచ్చాను.

**రుక్మిణి** : మీ ప్రయోజనమైతే అది జగత్కల్యాణానికి దారితీసేదై ఉంటుంది.

**నారదుడు** : చక్కగా గ్రహించావు తల్లీ!

**రుక్మిణి** : అయితే తమరు స్వామివారితో ఏకాంతంగా సంభాషించుకోవచ్చు. వస్తాను.

అని లోనికి వెళ్లిపోయింది. మందహాసం చేశాడు మాధవస్వామి.

**నారదుడు** : వాసుదేవా! రుక్మిణీదేవి ఔచిత్యం తెలిసిన ఇల్లాలు.

**శ్రీకృష్ణుడు** : కనుకనే ఆమె అష్టమహిషులలో పట్టమహిషి.

**నారదుడు** : నీకిష్టమహిషి కూడా. ఇక ముఖ్యవిషయానికి వస్తున్నాను. సాల్వరాజయిన బ్రహ్మదత్తులవారికి ఇద్దరు పుత్రులున్నారు కదా!

**శ్రీకృష్ణుడు** : అవును. ఆ రాజకుమారులలో పెద్దవాడు హంసుడు, పిన్నవాడు డిభకుడు. వారిని కౌశికుడు, చిత్రసేనుడు అని కూడా పిలుస్తారు కొందరు. వారిద్దరు జరాసంధ చక్రవర్తికి సైన్యాధ్యక్షులై పలుమార్లు మథురానగరదండయాత్రలో పాల్గొని మా యదువీరుల నెదిరించిన మహావీరులు.

**నారదుడు** : ఆ మహావీరులు ప్రస్తుతం రజతాద్రిమీద మహాదేవుని అనుగ్రహంకోసం మహాతపస్సు చేస్తున్నారు మాధవా!

**శ్రీకృష్ణుడు** : మంచిది.

**నారదుడు** : ఇక నీ ప్రియభక్తుడు ఆ హంసడిభకులప్రియ మిత్రుడు అదే- జనార్దనుడు స్వగృహంలోనే నిన్నారాధిస్తున్నాడు.

**శ్రీకృష్ణుడు** : అదీ మంచిదే.

**నారదుడు :** ఆ శంకరుడు భక్తవశంకరుడు. రేపో మాపో ప్రత్యక్షమవుతాడు. హంసడిభకులకు కోరినవరాలిచ్చి దీవిస్తాడు.

**శ్రీకృష్ణుడు :** తపస్సునకు తగినఫలితము అంది తీరాలి కదా దేవమునీ!

**నారదుడు :** అంది తీరాలి కదా నందనందనా! మరి స్వగృహంలో నిన్నే ఆరాధిస్తున్న ఆ భక్త జనార్దనునికి నీవు దర్శన మిచ్చేదెప్పుడు ద్వారకానాథా?

**శ్రీకృష్ణుడు :** దేవర్షీ! నీవు భక్తిసూత్రాలకు నిర్మాతవు. నీవు నిర్మించిన భక్తి సూత్రాలు "నారద భక్తి సూత్రాలు" అనే పేరుతో విశ్వవిఖ్యాతి వహించాయి కదా!

**నారదుడు :** నీకటాక్ష వీక్షణాలచేతనే ఆ భక్తిసూత్రాలకు జగద్విఖ్యాతి వచ్చింది జగన్నాథా!

**శ్రీకృష్ణుడు :** అమృతస్వరూపా చ – అని నీవు భక్తిని నిర్వచించావు కదా! అతని భక్తికి అమృతస్వరూపం సిద్ధించినవెంటనే అతని తపస్సు ఫలించగలదు.

**నారదుడు :** మరి నాకు సెలవా జలజాక్షా?

**శ్రీకృష్ణుడు :** వచ్చినపని అయినట్లే కదా! ఇక వెళ్లిరా నారదా!

**నారదుడు :** ధర్మస్య ప్రభుః అచ్యుతః, నారాయణ నారాయణ!

అంటూ బయలుదేరాడు బ్రహ్మనందనుడు. సాలోచనగా నిలబడ్డాడు నందనందనుడు.

– – – – – – –

అది ద్వారకానగరరాజవీథి. రాజవీథిలో సాయంసమయంలో క్రయవిక్రయాలు జరుగుతున్న హడావిడి ద్వారకానగర వైభవాన్ని చాటుతున్నది. మధ్యమధ్య రాజభటులు అటూ ఇటూ సంచరిస్తూ పర్యవేక్షిస్తున్నారు.

లవణవీథి (ఉప్పుబజారు)లో పెదసాంబయ్య తన ఉప్పు దుకాణంలో కూర్చుని పని చూచుకుంటున్నాడు. కొనుగోలుదారులు లాగుడుబండ్లు, దున్నలబండ్లు, ఎద్దుల బండ్లు మొదలయినవాటితో వచ్చి తాము కొన్న ఉప్పు బస్తాలను బండ్ల కెత్తించుకుని వెళుతున్నారు. ఆ సమయంలోనే ఆ వైపు దుకాణాలు చూస్తూ వస్తున్నాడు వసంతకుడు. వినయంతో నిలబడ్డాడు పెదసాంబయ్య.

**పెదసాంబయ్య:** దండాలు వసంతయ్యగారూ!

**వసంతకుడు :** శుభమస్తు! ఏరా పెదసాంబయ్యా! వ్యాపారం బాగా సాగుతోందా?

**పెదసాంబయ్య:** కృష్ణయ్య దయవల్ల బాగానే ఉందయ్యా!

**వసంతకుడు :** శుభం శుభం. నీతమ్ముడు చినసాంబయ్యేడిరా?

**పెదసాంబయ్య:** ఎక్కడ కల్లు తాగుతున్నాడో!

**వసంతకుడు :** కృష్ణకృష్ణ! వాడింకా కల్లు మానలేదా?

**పెదసాంబయ్య:** తమరు ఈ వీథికి వచ్చినప్పుడు మానేస్తున్నాడు, ఆ తరవాత తాగేస్తున్నాడు.

**వసంతకుడు :** ఆగరాసుగాడికి ఇంకా బుద్ధి రాలేదన్నమాట!

**పెదసాంబయ్య:** బుద్ధి రావాలంటే కల్లు మానాలి. కల్లు మానాలంటే బుద్ధి రావాలి. అదీ మావాడి తీరు. ఇంతకీ సముద్రతీరానికేనా తమరి ప్రయాణం?

**వసంతకుడు :** అవును. ఎందుకలా అడిగావు?

**పెదసాంబయ్య:** సాయంకాలం... మాంచి చల్లగాలిలో.... అదే పిల్లగాలిలో బయలుదేరితేను.

**వసంతకుడు :** సముద్రతీరానికి వెళ్లేవాళ్లు సాయంవేళలో కాక, కాందారి మాందారి ప్రొద్దులో వెళతారుటరా? ఇంతకీ నీదేహానికి సందేహం దేన్నిగురించి?

**పెదసాంబయ్య:** అదేనండీ వసంతయ్యగారు– సముద్ర తీరానికి పెళ్లయిన వాళ్లు, పెళ్లి అయ్యేవాళ్లు విహారానికి వెళ్తున్నారు. మరి తమరు పెళ్లాంగాని, ప్రియురాలు గాని లేని బ్రహ్మచారులు గదా! మీకేం పని అక్కడ?



భక్తులు కానుకలను శ్రీవారి 'హుండీ'లోనే సమర్పించాలి

**వసంతకుడు** : ఓరి లవణబుద్ధీ! నీకు సంసారపుటాలో చనలు తప్ప సారపుటాలోచనలు రావేమిరా? సాగర తీరవిహారానికి జంటలు మాత్రమే వెళ్లాలి, ఒంటరి వాళ్లు వెళ్లగూడదు- అని ధర్మశాస్త్రాలేమైనా ఘోషిస్తు న్నాయా? నీ దుంప తెంపి గంపకెత్త. నువ్వు అమ్మే దేమో ఉప్పు, నీకడుపునిండా నిప్పు. ఎంత మాట న్నావురా ఈకృష్ణయ్య మిత్రుణ్ని!

**పెదసాంబయ్య:** ఏదో ఎగతాళికంటే ఎందుకండీ అంత కోపం?

**వసంతకుడు** : శ్రీకృష్ణుని మిత్రుణ్ణి. నాతో ఎగతాళేమిట్రా సాంబయ్యా! సంసారపులంపటయ్యా!

**పెదసాంబయ్య:** తప్పయింది బాబోయి తప్పయింది. మళ్లీ ఎప్పుడయినా మీతో సరసమాడితే - అదే ఎగతాళిగా మాట్లాడితే చెప్పుతో.... కాదు కాదు ఉప్పుతో కొట్టండి!

**వసంతకుడు** : అలా రా దారికి. కృష్ణయ్యతోను, కృష్ణయ్య మిత్రునితోను పరాచికాలా?

అంతలో పెదసాంబయ్య తమ్ముడు చిన సాంబయ్య తూలుతూ దుకాణం దగ్గరకొస్తున్నాడు.

**చినసాంబయ్య** : జయతాత్ మహాబలః బలరామదేవః, జయతాత్ మహాబలః బలరామదేవః. అయ్యబాబోయి వసంతయ్యగారా? దండాలండి!

**వసంతకుడు** : ఏమిరా చినసాంబా! నీ వింకా సురాపాన విలాసం మానలేదన్న మాట?

**చినసాంబయ్య** : ఎప్పుడో మానేశానండి! ఈ పూట కాస్త అలా తాటితోపుకెళ్లే సరికి .....

**వసంతకుడు** : తాటితోపుకా? ఎందుకు వెళ్లావురా?

**చినసాంబయ్య** : తాటితోపుకెందు కెళతారండి, దూడమేత కోసం.

**వసంతకుడు** : దూడమేతకోసం తాటితోపులకీ, గొఱ్ఱెమేత కోసం ప్రక్కనే ఉన్న యీతతోపులకీ వెళుతున్నావన్న మాట! ఏమిరా సాంబా! నీకల్లుబొల్లి మాటలు నమ్మ టానికి నేను వ్రేపల్లెనుంచి వచ్చిన వెఱ్ఱివెంగళప్పలాగా కనబడుతున్నానా? మథురాపట్టణంనుంచి ద్వారకా నగరానికి వచ్చిన శుద్ధవైదికుణ్ని రా!.

**చినసాంబయ్య** : పొరపాటయిందిలే వసంతయ్యగారూ! ఏదో బుద్ధి గడ్డి తిని.

**వసంతకుడు** : నీబుద్ధి గడ్డి తింటే దూడగడ్డికోసం వెళ్లా నంటావేమిరా! నగరంలో జీవిస్తూ కూడా నాగరికం నేర్చుకోకపోతే ఎప్పుడురా మీరు బాగుపడేది?

**పెదసాంబయ్య:** కనకపు సింహాసనం మీద శునకాన్ని కూర్చోబెడితే వెనకటిగుణం మానుతుందా? కమ్మటి పాడిపంటలు చూసుకుంటూ, మంచివ్యాపారం చేసు కుంటూ బ్రతకటానికి ఏర్పాట్లు చేశారు బలరామ శ్రీకృష్ణులు. వీడు నాకు చేదోడువాదోడుగా ఉంటాడని ఈ వ్యాపారంలోకి దిగితే చీటికిమాటికి ఇలా తప్ప దాగి తందనాలాడుతున్నాడు. నేనేం చెయ్యాలి వసం తయ్యగారూ?

**వసంతకుడు** : ఏమిరా సాంబా! ఈ సురాపానంమానవా?

**చినసాంబయ్య** : ఇదిగో వసంతయ్యగారూ! మీజందెప్పోగు మీద ఒట్టేసి చెబుతున్నా. ఇంకమీదట నా జీవితంలో కల్లు తాగితే తమరి బ్రహ్మచర్యం పాడైనంత ఒట్టు.... మన్నించాలి, నాసంసారం పాడైనంత ఒట్టు. సరేనా? ఏంది నన్ను నమ్మరా?

**వసంతకుడు** : చివరిసారిగా నమ్ముతున్నాను రా! మరలా నీవు సురాపానం చేసినట్లు నేను విన్నానో నీ వ్యవ హారం మనబలరామదేవుల చెవిలో వేస్తాను. ఆ తర్వాతి సన్నివేశాన్ని నీదివ్యదృష్టితో ఒక్కసారి తిల కించరా!

అంతే! చినసాంబయ్య వెంటనే తలపైకెత్తి ఊహాలోకానికి వెళ్లాడు. అక్కడ బలరాముడు క్రోధతా మ్రవదనంతో తననాగలి చినసాంబయ్య మెడకు తగి లించి, రోకలితో తలమీద బాదబోతున్న దృశ్యం కని పించింది. అంతే! పెద్దకేకతో ఈలోకానికి వచ్చాడు చినసాంబయ్య.

*(ఇంకా ఉంది)*



# సందేహాలు - సమాధానాలు

*-శతావధాని ఆముదాల మురళి, 9440432683*

**1) ధర్మాచరణతోనే మానసిక ఆనందం సాధ్యమా?**
**-కె. ఆర్. ఆర్. శ్రీనివాసరెడ్డి, మొలకలచెరువు.**

మానవజన్మకు నాలుగు ప్రయోజనాలున్నాయి. వాటిని చతుర్విధపురుషార్థాలు అంటారు. అవి ధర్మం, అర్థం, కామం, మోక్షం, వీటిలో మోక్షమంటే ఆనందం. ఆనందం అంటే తాత్కాలికమైంది కాదు శాశ్వతమైంది. మనిషికి ఆనందం కలగాలంటే కోరికలు తీరాలి. ఆ కోరికలే కామం. కోరికలు తీరాలంటే ధనం కావాలి. అదే అర్థం. ధనం కావాలంటే వ్యవసాయమో, ఉద్యోగమో, వ్యాపారమో చేయాలి. అంటే పని చేయాలి. అదే ధర్మం . అంటే మనిషి ఆనందంగా ఉండడానికి ధర్మమే మూల కారణం.

లోకశ్రేయస్సును కల్గించేది ధర్మం ఒకటే. అందు వల్ల ధర్మాన్ని రక్షించుకోవాలి. దానికి ప్రతిఫలంగా ధర్మం వ్యక్తుల్ని, సమాజాన్ని రక్షిస్తుంది. సమాజంలో ధర్మానికి సమాంతరంగా ధర్మవ్యతిరేక శక్తులు కూడా పనిచేస్తూం టాయి. యోగ్యుడైనవాడు ఆ పాపశక్తులను చూస్తూ నిర్లక్ష్యం చేయకూడదు. ధర్మరక్షణ చేయకపోతే జాతి నిర్వీర్యమై పోతుంది. నిజానికి ధర్మమంటే మనిషికి బ్రతకడానికున్న హక్కు. స్వేచ్ఛగా తను ఎంచుకొన్నపని తాను చేసుకొంటూ, ధనాన్ని సంపాదిస్తూ, కోరికలు తీర్చుకొంటూ ఆనందంగా జీవించడానికి ఉన్న హక్కుకే ధర్మమని పేరు. ధర్మరక్షణ కోసం పోరాటం చేయడమంటే తనకోసం తాను పోరాడు కోవడమని అర్థం. ధర్మాన్ని ఆచరించడానికి మానవునికి ప్రధాన సాధనం శరీరం. ఆ శరీర ఆరోగ్యానికి విఘాతం కలిగించే విధంగా ధనాన్ని సంపాదించరాదు. కోరికలు తీర్చుకోరాదు.

మనిషి జీవించినంతకాలం తనశక్తిపై, తన ధర్మంపై నమ్మకంతో బ్రతకాలి. తాను సాధించదలచుకొన్న దాన్ని తన ధర్మంగా భావించాలి. దాన్ని పొందడానికి శ్రమించాలి. ఆశతో, ఆశయంతో జీవిస్తూ, మరణించే వరకు ధర్మాన్ని అంటిపెట్టుకొని ఉండాలి. ధర్మం వ్యక్తిని కాపాడు తుంది. వ్యవస్థను రక్షిస్తుంది. సమాజాన్ని, జాతిని అభ్యుదయం వైపు నడిపిస్తుంది. ఎవరి ధర్మం వారికి శ్రేష్ఠమైంది. అందుకే ఎవరిధర్మాన్ని వారు రక్షించుకోవాలి. జీవితాల్ని శాశ్వతా నందంవైపుకు నడిపించాలి.

**2) జ్ఞానజీవనం అంటే ఏమి? -జి. నిర్మలారాణి, కదిరి.**

మానవుడు పశుపక్ష్యాదుల కంటే భిన్నమైనవాడు. ఆహారం, నిద్ర, భయం, సంతానోత్పత్తి పశువులకు మనుష్యులకు సమానమే కాని మానవుడు మాత్రం రెండు కాళ్ల పశువుకాడు. అలా పశువు కాకుండా మనిషిని పశువుల నుండి వేరుచేసేది జ్ఞానం. జ్ఞాన ప్రభావం వల్లనే మానవుడు నాగరికుడయ్యాడు. విజ్ఞానవంతుడయ్యాడు. తనకు అవసరమైన, ఆనందకరమైన, ఆహ్లాదకరమైన పరికరాలను, కళలను సృష్టించుకోగలిగాడు.

మానవుడు సృష్టిని జ్ఞానదృష్టితో చూస్తాడు. పశువు సృష్టిని ఆహారదృష్టితో చూస్తుంది. సృష్టి రహస్యాలకోసం మానవుడు అహోరాత్రాలు అన్వేషిస్తాడు. పశువు అన్వేషణ ఆహారంవద్దే ఆగిపోతుంది. మానవునికి వృద్ధాప్యం, మరణం తప్పించుకోలేని దుఃఖాలు. ఇవికాక మధ్యలో ఆధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవికములనే నానా దుఃఖాలు కలుగు తుంటాయి. దుఃఖానికి కారణం అజ్ఞానం. అజ్ఞానమంటే ఉనికి లేనిదాన్ని శాశ్వతమని భావించడం, శాశ్వతమైనదాన్ని గుర్తించకపోవడం.

జ్ఞానజీవితం శ్రేష్ఠమైంది. అది ఆచరణాత్మకమైంది. సమస్తకల్యాణగుణాలు జ్ఞానానికి తోబుట్టువులు. గురు శుశ్రూషతోపాటు, నిరంతర గ్రంథపఠన చేస్తూ, ఆచరణతో కూడిన జ్ఞానాన్ని మానవుడు సంపాదించుకోవాలి.



తిరుమలలో వీధి వర్తకులవద్ద నకిలీ ప్రసాదాలు కొనకూడదు

యువవాణి

# మనిషి ఎదగాలంటే...!

– శ్రీమతి జి.సావిత్రి

నీతి, ధర్మం అనేవి రెండూ మానవుణ్ణి సంస్కారవంతుణ్ణి చేసి చక్కని రాజమార్గంలో నడిపించేవి. నీతి అంటే దేశకాలపాత్రానుగుణంగా నడుచుకునే హిత రీతి అనీ, ధర్మమంటే త్రికాలాబాధితమైన సత్యహితస్వరూపమైనదనీ పెద్దలంటారు.

హృదయం, మేధ మానవుడికి జీవాధారాలు, వీటిలో ఏది లోపించినా మానవత్వం పూర్ణంకాదు. ఈ రెంటి సముచితసమన్వయమే మానవత్వం. ఆ మానవత్వ సముపార్జనకై మానవుడు చేసేప్రయత్నాల్లో సాహిత్యోపాసన లలితప్రక్రియ.

మహాభారతం పంచమవేదం, ఇహపరసాధనం. అది సాటిలేని నీతిదర్పణం, విశ్వజనీనం. అందులోని ప్రతి వాక్యం, ప్రతిసన్నివేశం, ప్రతికథ, ప్రతిపాత్ర ఒక గొప్ప నీతినీ, ధర్మాన్ని స్ఫురింపజేస్తుంది.

గురువు తండ్రితో సమానం. గురువుసంతానం తోబుట్టువుతో సమానమని చాటి చెప్పేపవిత్రచరిత్ర కచదేవయానికథ. ఇదీ భారతంలోనిదే. ధర్మబద్ధమైనకామం తృతీయ పురుషార్థం. ధర్మబద్ధం కాని విషయవాంఛ హేయమైంది. ఒకటి ధార్మిక జీవనంకోసం. రెండోది ఇంద్రియపరితృప్తి కోసం. ధార్మికజీవనం ఆత్మోద్ధరణసాధనం. ఈ నీతిని నిరూపిస్తుంది కచదేవయానుల చరిత్ర.

దేవతల గురువు బృహస్పతి. అతనికుమారుడు కచుడు, బ్రహ్మచారి. శుక్రాచార్యులను సేవించి సంజీవనీ విద్య సంగ్రహించాలి. అది దైవకార్యం. శుక్రాచార్యుని ప్రియపుత్రిక దేవయాని. అపురూపసౌందర్యవతి. క్షణక్షణోద్భిన్నమైన యౌవనశోభిని.

ఆవిడ కచుణ్ణి ప్రేమించింది. అది క్రమంగా గాఢ ప్రణయంగా మారింది. బహుప్రయాసలు భరించి కచుడు సంజీవనిమంత్రం గ్రహించాడు. కృతార్థుడై ఆచార్యుల అనుమతితో మరలిపోనున్నాడు. ముందుగా ప్రాణదాతయైన గురుపుత్రిక దేవయానిని సౌహార్దపూర్వకంగా సెలవడిగాడు. స్వప్నలోకాల్లో పెంచుకున్న తన మోహప్రవృత్తిని అతనికి వ్యాఖ్యానించింది. సానునయంగా సాక్రోశంగా ఆమె అతని పాణిగ్రహణానికి ఆశపడింది.

కచుడింత వరకు ఆమె ప్రవృత్తి గమనించాడో లేదో కాని, ఇప్పుడు పూర్తిగా ఆమెకోరికను అర్థం చేసికున్నాడు. విషాదంతో మనస్సు వ్యాకులమైంది. లోక నింద్యమైన ఈ భావం దరిచేరడం పాపహేతువు కదా!

**గురులకు శిష్యులు పుత్రులు**
**పరమార్థము లోకధర్మ పథమిది దీనిం**
**బరికింపక యీ పలుకులు**
**తరుణీ! గురుపుత్రి! నీకుఁ దగునే పలుకన్ (1–3–131)**

అని నీతి బోధించాడు. నీవు నాకు సహోదరివి కావున నీ అభిలాష మిక్కిలి అధర్మం అని స్పష్టంగా తన భావాన్ని వ్యక్తం చేశాడు. దేవయాని సహజంగా పట్టుదల గలది. కచునిపై కోపించింది. అతనికి “సంజీవని పనిచేయకుండు గాక!” అని శాపమిచ్చింది.

“బ్రాహ్మణుడు నిన్ను పరిగ్రహింపకుండు గాక” అని ప్రతిశాప మిచ్చాడు కచుడు. గురుపుత్రి సోదరితో సమానం. ఆమెను భార్యగా పరిగ్రహింపకూడదు. ఈ నీతిని పైకథ చాటుతుంది.

**భూతహితంబుగాఁ బలుకు బొంకును సత్యఫలంబు నిచ్చుఁ ద ద్భూతభయాస్పదం బగు ప్రభూతపుసత్యము బొంకు నట్ల, ప్రాణాతురుఁ డైనచో, పరిణయంబునయందును బల్కుబొంకు స త్యాతిశయంబ యండ్రు, మహితాత్మక! యిట్టివి ధర్మసూక్ష్మముల్ (3–5–62)**

ఇది ధర్మవ్యాధుని ధర్మోపదేశం. ధర్మవ్యాధుడు, జితేంద్రియుడు, సత్యవాది, కౌశికునంతటి వానికి నీతి బోధించి పంపిన అతనికథ అందరూ స్మరింపదగింది. ధర్మ వ్యాధుడు కౌశికునికి అహింసాలక్షణాది అనేకధర్మాలు విన్పిస్తూ తల్లిదండ్రుల సేవకంటే మించినధర్మం లేదన్నాడు. 'తన కోపమె తనకు శత్రువు' అనే పరమ నీతివాక్యాన్ని బోధించి పంపాడు.

ఎఱుక గల వారిచరితలు
గఱచుచు, సజ్జనులగోష్ఠిఁ గదలక ధర్మం
బెఱుఁగుచు, నెఱిఁగిన దానిని
మఱవ కనుష్ఠించునది సమంజసబుద్ధిన్ (1-3-203)

ఇది యయాతి పూరునకు బోధించిన నీతుల లోనిది. ఇవి నన్నయనీతులు. వివరణ అవసరం లేని పద్యాలు.

కణ్వమహర్షికి శకుంతల పెంపుడు బిడ్డ. వేటకు వచ్చిన దుష్యంతుడు చాలా అలసిపోయి కణ్వాశ్రమానికి వచ్చాడు. అక్కడ మహర్షి లేడు. శకుంతల అతిథి సత్కారాలు చేసింది. ఆమె జన్మవృత్తాంతం తెలిసికున్నాడు. ఆవిడ రాచకన్య, శాస్త్ర సమ్మతంగా గాంధర్వవివాహం చేసు కున్నాడు. ఆమెకు పుత్రోదయమైంది. ఆ పుత్రుణ్ణి దుష్యం తుని దగ్గరకు తీసుకునిపోయింది. బయలుదేరే సమయంలో మానవసహజమైన అనుమానం ఆమెను పీడిస్తోంది. పెద్దల అనుజ్ఞలేక చేసినకార్యం మహాపరాధంగా భావనకు తెచ్చు కుంది.

దుష్యంతుడు ప్రజాభిప్రాయానికి జంకి ఆమెవరో తనకు తెలీదన్నాడు. శకుంతల తెల్లబోయింది. ముఖం చిన్నబుచ్చుకుంది. నిశ్చేష్ట అయింది. కోపారుణిత నయనాల్లో బాష్పకణాలు రాల్తున్నాయి.

ఎన్నో ధర్మసూక్తులు వల్లించింది. కడపట కొడుకును కౌగిలించుకొమ్మన్నది. ఆ కౌగిలిలో సుఖమెట్లుంటుంది? ముత్యాలహారం ధరించినట్లు, పచ్చ కర్పూరపుదట్టమైన పొడి మేనచల్లుకొన్నట్లు, మంచిగంధం శరీరానికి అలదుకొన్నట్లు, వెన్నెలలో విహరించినట్లు ఉంటుంది. కాదు, కాదు, వాటన్నిటికంటే పుత్రగాత్రపరిష్వంగం మరీ చల్లగా ఉంటుం దన్నది. పున్నామనరకం నుండి రక్షింపగలవాడు ఈ పుత్రుడే అని సానునయంగా... పల్కింది. సత్యవాక్య ప్రభావాన్ని వినిపించింది. ఇలా చెప్పిన ప్రతిమాట ఒక నీతి, ఒకధర్మం మనకు బోధిస్తున్నట్లుంటుంది.

నలుడు దమయంతిని అడవిలో వదలి వెళ్ళాడు– కలి ప్రభావంతోనే గానీ బుద్ధిపూర్వకంగా కాదు. దమ యంతి నిద్ర మేల్కొని భర్తను కానక దుఃఖించింది. సాధారణ అనాగరకస్త్రీలైతే ఈ సందర్భంలో వారి వెనుకటి సంగతు లన్నీ ఏకరువు పెట్టి ఏడ్చేవారు. లేదా తూలనాడేవారు. అష్టదిక్పాలకులను కాదని నలుణ్ణి ప్రేమించి వరించింది. ఇక్కడ ఆమెదుఃఖం కట్టలు తెంచుకుని పారుతుంది.

వేదవేదాంతాలు అధ్యయనం చేసినప్పుడు వచ్చే పుణ్యంకంటే ఒక్క సత్యవాక్యంవలన వచ్చేపుణ్యం అధికం. సాంగోపాంగంగా వేదాధ్యయనం చేసి ఎంతో పుణ్యం సంపాదించిన నలుడు, "దమయంతిని వదలిపెట్ట" నని పల్కి కూడా విడిచి వెళ్ళాడు. ఇప్పుడు ఈ సత్యప్రతి పాలన భంగంవల్ల ఆ పుణ్యమంతా వ్యర్థమైందే అని వాపోయింది. ఇందులో స్వార్థం లేదు. పతిహితం కోరి తనసంకటాలకు వగవకుండా, భర్త కడగండ్లను ఊహించు కుని వగచింది. మహాగౌరవం ప్రకటించింది దమయంతి. ఇది పరమోపదేశం.

సావిత్రి తన పాతివ్రత్యంపై విశ్వాసంతో... అల్పా యుష్కుడని తెలిసికూడా సత్యవంతుణ్ణి వివాహమాడింది. చివరకు వనంలో సత్యవంతుడు హఠాత్తుగా అసువులు బాశాడు.

భర్తప్రాణాలు తీసుకుపోతున్న యముణ్ణి వెంబడిం చింది. తన పాతివ్రత్య మహిమతో త్రికరణశుద్ధితో ఎవ్వరికి ఏ బాధా కలిగింపరు. దీనుల కరుణతో రక్షిస్తారు. ఆశ్రితుల


భక్తులు అపరిచితులకు తమ కాటేజీలలో ఆశ్రయం ఇవ్వకూడదు

సంపూర్ణంగా... కాపాడుతారు. ఎవరు? యముని వంటి ధర్మజ్ఞులు - అని చెప్పక చెప్పిన ప్రాజ్ఞురాలు సావిత్రి.

అందుకే సావిత్రి ఆదర్శమహిళ. మామకు నేత్రలాభం, రాజ్యలాభం,తండ్రికి పుత్రలాభం, భర్తకు ప్రాణదానం-నాల్గు వరాలతో అటు పుట్టినింటికి, ఇటు మెట్టినింటికి శ్రేయస్సు కూర్చింది. తనకు ప్రాణపతినీ, అఖండ కీర్తిని సంపాదించుకున్నది. అనగా స్త్రీలు పతివ్రతలై ఉభయకుల ఉద్ధారకులై మెలగాలి. ఇది సావిత్రి చరిత్ర నేర్పే నీతి. 'సఖ్యం సాప్తపదీనమ్' అనే ఆర్యోక్తితో యముడంత వానికి నోరు మెదపకుండా కాళ్లు కదపకుండా చేసింది మహాసాధ్విసావిత్రి.



**అడిగిన నిచ్చుకంటెను నయాచకుఁగాఁగ! నెఱింగి యిచ్చు టెక్కుడు ఫల మిచ్చు, దానవిధికోవిద! వేఁడుట సావు, వేఁడగాఁబడుటది పెద్దసావు, దగు ప్రార్థన పూర్ణము సేయునాతఁ డాయడిగిన వానిఁ దన్నును దయారతిఁ గావఁగఁజాలువాఁ డగున్**

**(13-2-343)**

యాచన మృత్యువుతో సమానమని ఇందులోని నీతి. తనఅభిమాన హృదయంతో ఇతరుల హృదయాభిమానాన్ని తెలుసుకోవాలి. 'ఆత్మవ త్సర్వభూతాని' అనే సూక్తికి ఈ పద్యం దర్పణం.

అరణ్యపర్వం ప్రారంభంలో శౌనకుడు ధర్మరాజుకు చెప్పిన నీతులు సకలమానవలోకానికి ఇచ్చిన శాశ్వత సందేశాలు.

మృత్యువు ప్రాణులకు ఎంత భయంకరమో అట్లే ధనవంతులకు రాజచోర స్వజనజలానలంబులవల్ల ఎప్పుడూ భయం తప్పదు. కావున అర్థం సర్వ అనర్థాలకు మూలం. మాయామోహాన్ని కలిగిస్తుంది. దర్పం, కార్పణ్యం, భయం, అన్నీ ధన దురాశ వల్లే ఆవిర్భవిస్తాయి. కావున అర్థోపార్జన చింత చేయకూడదనీ, రూపయౌవనధనవిభవప్రియసంవాసము లనిత్యాలనీ నీతిసారం.

చండాలుని మొదలుకుని బ్రాహ్మణుని వరకు సమదృష్టితో చూడగలిగినవాళ్లే నిజమైన పండితులు. సామాన్యంగా పండితులంటే- పాండిత్యప్రకర్ష, వేదవేదాంగ పురాణేతిహాసాలలో మంచిప్రవేశం కలవాళ్లని రూఢి. ఇది గీత అంగీకరించడం లేదు. సమస్తచరాచరకోటిని సమదృష్టితో చూడగల్గినవాడే పండితుడు. అన్నింటా దేవతారూపాన్ని చూడగల్గడం భారతీయసంస్కృతి.

ఉచ్చనీచభేదాలు లేక జగత్తులోని సకలవస్తువులనూ, జంతువులనూ సమదృష్టితో ప్రేమించి, గౌరవించగల భారతధర్మపద్ధతి విశిష్టమైంది. సర్వమానవ సౌభ్రాత్రంతోనే తృప్తి చెందరాదనీ సర్వాత్మదృష్టిని అలవరుచుకోవాలనీ భారత నీతి.

**"వాసుదేవః సర్వమ్"**
**"మత్తః పరతరం నాన్య త్కించి దస్తి"**

భారతాంతర్గతమైన ఈ గీతావాక్యాలే సకలభారత నీతిసారం.

# శ్రీవారిసన్నిధిలో... అధ్యయనోత్సవం

*- డా॥ చిలకపాటి విజయరాఘవాచార్యులు*

సప్తగిరీశసార్వభౌములైన శ్రీవేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో మున్నూటఅరవైరోజులు నిత్యబ్రహ్మోత్సవ సదృశమైన ఆధ్యాత్మికపారమ్యమే! దాదాపు వేయేండ్లనాడు భగవద్రామానుజాచార్యులవారు ఏర్పరచిన నిత్య, పక్ష, మాస, వార్షిక, విశేష బ్రహ్మోత్సవ సంరంభాలే తిరుమలగిరు లంతటా ప్రతిబింబిస్తూంటాయి, ప్రతిధ్వనిస్తూంటాయి. వాటిలో అధ్యయనోత్సవం ఒకానొక మనోహరమైన దివ్య ప్రబంధానుసంధాన పూర్వకమైన భవ్యపరీ మళం.

సాధారణంగా.. తమిళభాషలో... రచింపబడి, గానం చేయబడిన పాశురా లను 'దివ్యప్రబంధం' అంటారు. ఇది 'నాలాయిరం'-అంటే నాలుగువేలు. శ్రీవైష్ణవ దేవాలయాలలో దివ్యప్రబంధాన్ని ఆ యా సమయాల్లో గానం చేస్తారు. అలా గానం చేయబడే క్షేత్రాలను 'దివ్యక్షేత్రాలు'గా భావి స్తారు. ఇలాంటివి మొత్తం 108గా గుర్తిం చారు. ప్రపన్నులైన మహానుభావులు ఈ దివ్యదేశాలలోమాత్రమే తీర్థస్వీకారం చేయడం ఒక సంప్ర దాయం. అనేకపాంచరాత్రాగమసంహితలుసైతం అలాంటి సత్సంప్రదాయాలను నిర్దేశిస్తూండడం గమనార్హం!

**తిరుమలలో ఈ నెల 26 న ప్రారంభమయ్యే అధ్యయనోత్సవాల సందర్భంగా ఈ వ్యాసాన్ని ప్రచురిస్తున్నాం...**

ప్రపన్నజనకూటస్థులైన... శ్రీనమ్మాళ్వార్లపరమ పదోత్సవాన్ని అధ్యయనోత్సవమనీ, వైకుంఠోత్సవమనీ, ప్రపన్నోత్సవమనీ, మోక్షోత్సవమనీ పిలిచినా, తిరుమలలో మాత్రం దీన్ని అధ్యయనోత్సవమని మాత్రమే వ్యవహరి స్తారు. తిరుమల శ్రీవారిసన్నిధిలో... శ్రీభాష్యకారుల ప్రతినిధిగా పెద్దజీయంగార్‌స్వామివారు, వారికి అధీ నులుగా చిన్నజీయంగార్‌స్వామివారు తమ ఏకాంగుల తోడ్పాటుతో ఈ దివ్యప్రబంధ అనుసంధానాది కైంకర్యాలను నిత్యమూ సమర్పిస్తూంటారు. నాలుగువేల పాశురాలతో శోభిల్లే దివ్యప్రబంధం నాలుగువిభాగాలుగా విస్తరించి ఉంది. అవి ముదలాయిరం-పెరియతిరుమొళి- ఇయర్పా- తిరువాయ్‌మొళి. ఈ సంపూర్ణదివ్యప్రబంధపారాయణానికే అనగా సంపూర్ణద్రావిడవేదాధ్యయనానికే "అధ్యయనోత్సవం" అని ప్రసిద్ధి.

శ్రీనమ్మాళ్వార్లజన్మ /అవతరణ స్థలం ఆళ్వారు తిరు నగరి. తిరుమంగై ఆళ్వార్ (పరకాలన్) అనే మహానుభావులు ఆ ఊరిలో నమ్మాళ్వార్ల విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆ ఉత్సవ మూర్తిని శ్రీరంగానికి పల్లకీలో వేంచేపు చేసుకొని వచ్చి, శ్రీరంగనాథస్వామివారి శ్రీసన్నిధిలో వైకుంఠఏకాదశి మొదలు పదిరోజుల పాటు తిరువాయ్‌మొళిని అను సంధానం చేసినట్లు, అప్పటినుండి అధ్యయ నోత్సవం ఆరంభమైనట్లు పూర్వాచార్య పరంపర. ఇక ఉత్సవసమాప్తి అయిన రోజున నమ్మాళ్వార్లను శ్రీవారి పాద సన్నిధిలో చేర్చి, మరలా లోకోద్ధరణ నిమిత్తమై "మా ఆళ్వార్లను మాకు ప్రసా దించ"మని ప్రార్థిస్తారు.

తర్వాతి కాలంలో నమ్మాళ్వార్ల అనుగ్రహంతో శ్రీమన్నాథమునులు నాలా యిరాన్ని తిరిగి సంపాదించి, ఈ ఉత్సవాన్ని 22 రోజుల పర్యంతం జరిగేలా ప్రారంభించారు. ఇలా ఈ వరవడి సాగుతోంది.

నాలుగువేల పాశురాలను మొత్తం ఒకేసారి స్థిరా సనంలో పూర్తిచేయడం కనుక, శ్రీవైకుంఠ ఏకాదశికి ముందు పదిరోజులు (పగల్‌పత్తు), మొదటి రెండువేల పాశు రాలను (ముదలాయిరం, పెరియ తిరుమొళి) అనుసంధి స్తారు. ఏకాదశి నుండి పదిరోజుల రాత్రివేళ (రాపత్తు) మిగిలిన రెండు వేలపాశురాలను (ఇయర్పాల, తిరువాయ్ మొళి) అనుసంధానం చేస్తారు.



కలియుగ వైకుంఠమైన తిరుమలని పరిశుభ్రంగా ఉంచడం మన విధి

ఇరవై ఒకటవరోజున రామానుజనూఱ్ఱందాది, ఉపదేశరత్నమాల అనుసంధానం చేస్తారు. ఇరవై ఒకటవరోజున రామానుజనూఱ్ఱందాది, ఉపదేశ రత్నమాల అనుసంధించి, 'శాత్తుముఱై' చేయడం, ఆ మరునాడు తిరుప్పల్లాండు తొడక్కం పూర్తిచేయడం సాధారణంగా జరుగుతుంది.

అయితే, తిరుమల శ్రీవారిసన్నిధిలో 22వ రోజున కణ్ణినున్ శిరుత్తాంబు, 23వ రోజున రామానుజనూఱ్ఱందాది, 24వ రోజున శ్రీ వరాహస్వామిసన్నిధిలో శాత్తుముఱై, 25వ రోజున తన్నీర్ అముదు ఉత్సవంతో, అధ్యయనోత్సవాలను శుభసమాప్తి చేస్తారు.

ఈ సందర్భంగా ఒక నిషేధాన్ని గుర్తు చేసుకోవాల్సి ఉంది. అధ్యయనోత్సవానికి ముందు కార్తికపౌర్ణమి నుండి (కృత్తికాదీపోత్సవం) కూరత్తాళ్వార్ తిరునక్షత్రం (జన్మ దినం) వరకు- అంటే రెండు మాసాలపాటు- దివ్య ప్రబంధ పారాయణాన్ని అనధ్యయన(నిషేధం) కాలంగా పెద్దలు పరిగణించడం జరిగింది.

అయితే, ఈ రెండునెలలకాలంలో తిరువాయ్‌మొళికి సారరూపమైన 120 పాశురాలు గలిగిన తిరువాయ్‌మొళి నూఱ్ఱందాదిని.. అనుసంధించాలని... పూర్వాచార్య పరంపరగా... వస్తోంది. ఈ రెండు మాసాలు తిరుమంగై ఆళ్వార్లు నమ్మాళ్వార్లను శ్రీరంగంలో వేంచేపు చేసినకాలానికి ఒక సంకేతం అన్నమాట!



వైష్ణవాలయాల్లో దివ్యప్రబంధఅధ్యయనం తప్పక జరిగి తీరాలని పారమేశ్వర, శాండిల్య, జయాఖ్య, ఈశ్వర, శ్రీప్రశ్న, పాద్మ, బ్రాహ్మ, నారాయణ, విష్వక్సేనాది సంహితలలోనూ, విష్ణుతంత్రంలోనూ ప్రముఖంగా ప్రస్తావించబడింది. నిత్యమూ జరిగినా, జరగకపోయినా కనీసం సంవత్సరంలో ఒక్కసారైనా... అనుసంధించబడాలి అనే నియమంతో శ్రీమన్నాథమునులు ఈ అధ్యయనోత్సవాన్ని 22 రోజులకు పరిమితం చేశారట!

ఇక తిరుమల విషయానికి వస్తే అధ్యయనోత్సవాన్ని ఏర్పాటు చేసినవారు తొలుత తిరుమంగైఆళ్వార్లు, తదుపరి నాథమునులు, తదనంతరం భగవద్రామానుజాచార్యుల వారు. దీనికి సంబంధించి, 1253 సం॥ నాటి తిరుపతి శాసనం పాక్షికదివ్యప్రబంధపారాయణాన్ని సూచించగా, 1360 సం॥ నాటికే సంపూర్ణ దివ్యప్రబంధపారాయణం మొదలైనట్లు ఇతర శాసనాలు ఋజువు చేస్తున్నాయి. 1446 సం॥ నాటి శాసనం బ్రహ్మోత్సవాలలో ఈనాటివలే, తిరువాయ్‌మొళి అధ్యయనాన్ని తెలియజేస్తోంది.

మొదట్లో తిరువాయ్‌మొళిగానం రాజగోపురానికి ముందు తిరువాసన్ దగ్గర, తరువాత ఎంబెరుమానార్ల సన్నిధి ఎదుట, ప్రస్తుతం రంగనాయకమండపంలోనూ

ఈ అధ్యయనోత్సవం జరుగుతోంది. అన్నమాచార్యులవారు కూడా ఈ ఉత్సవాన్ని విశేషంగా కీర్తించడం జరిగింది.

## అధ్యయనోత్సవవిధానం

యథావిధిగా నిత్యఆరాధనాదులన్నీ పూర్తిచేశాక, ఉత్సవమూర్తులను ఒకపల్లకీలో వేంచేపు చేస్తారు. వేరొక పల్లకీలో శఠగోపాది ఆళ్వార్లను వేంచేపు చేసి, శ్రీస్వామివారికి ఎదురుగా ఆళ్వార్లు ఉండేలా సన్నిధిచుట్టూ ప్రదక్షిణం చేసి ధ్వజస్తంభంవరకు వస్తారు. వీరుభయుల మధ్య భాగవతోత్తములు గోష్ఠిగా రెండువరుసలలో చేరుతారు.

ఆ తర్వాత శ్రీవారికీ, ఆళ్వార్లకూ అర్ఘ్యపాద్యాదిషోడశోపచారాలు సమర్పిస్తారు. అప్పుడు స్థానాచార్యులవారికి పరివట్టం (తలపాగ వంటిది) ధరింపజేసి, వేదాది విన్నపం (శంగోలం) చేస్తారు. ఆ తర్వాత ఆళ్వార్లకు శఠారి ఇచ్చి, 'అరుళప్పాడు' చెప్తారు. దివ్యప్రబంధం అనుసంధానం ఆరంభించి, భాగవతోత్తములకు శఠారి ఇచ్చి మళ్లీ ఆలయానికి ప్రదక్షిణం చేసి, శ్రీవారి గర్భగుడిలో చేరుస్తారు. అప్పుడు ఆళ్వార్లను శ్రీవారికి అభిముఖంగా ముఖమండపంలో వేంచేపు చేసి, ఆనాటి దివ్యప్రబంధ భాగాన్ని పూర్తి చేస్తారు. ఇక ఆళ్వార్లను యథాస్థానంలో చేర్చాక, నైవేద్యం, శాత్తుమురై, తీర్థప్రసాద వినియోగం ఒక క్రమంలో జరుగుతుంది. ఇలా అధ్యయనోత్సవం ప్రతిరోజు జరుగుతూంటుంది.

ఇక చివరిరోజు నమ్మాళ్వార్ల పరమపదోత్సవం. తిరుమలలో మాత్రం అధ్యయనోత్సవం శుభసమాప్తి. శ్రీస్వామివారిని గరుడవాహనంపై / తిరుచ్చిపై వేంచేపు చేసి, వారికి ఎదురుగా ఆళ్వార్లను (తిరుమలలో శ్రీరామానుజులవారి) సేవగా పురప్పాట్టు (తిరువీథిఉత్సవం) జరుపుతారు. తిరిగి వచ్చాక వేదాది విన్నపం చేశాక, తిరువాయ్‌మొళిలోని చివరిపత్తు (శాత్తుమురై పాశురాలను విడిచి) అందాదిగా అనుసంధిస్తారు. ఆళ్వార్లను శ్రీస్వామివారిదివ్యశ్రీచరణ సన్నిధిలో చేర్చగా, భక్తులు తులసీ పుష్పాదులను ఆళ్వార్లకు సమర్పిస్తారు. హారతి ఇస్తారు.

ఆపైన ద్వారాన్ని మూసివేసి, ఆళ్వార్లకు తిరుమంజనం, అలంకారం వగైరాలు సమర్పించి, పొంగలి ఆరగింపు చేస్తారు. ఆ తర్వాత ఆళ్వార్లను తిరిగి తమకు అనుగ్రహించమనీ, లోకోద్ధరణకు అవశ్యమనీ ప్రార్థన చేస్తూ, ద్వారం తెరచి, శాత్తుముఱై పూర్తి చేస్తారు. ఆ సందర్భంగా శ్రీవారికి, నమ్మాళ్వార్లకు, ఎంబెరుమానార్లకు, పూర్వాచార్యులకు సంభావనలు సమర్పించడం సంప్రదాయం. చివరకు స్థానాచార్యులకు మాలాపరివేష్టం, శఠారి, తీర్థప్రసాదాదులతో... సత్కారం, ఇతరులకు, తీర్థప్రసాద వినియోగం జరుగుతుంది.



తిరుమలలో పెరియజీయర్ స్వామివారు, ఎంబెర్‌మానార్లకు ప్రతినిధులుగా, సత్సంప్రదాయపరిరక్షణ ధర్మకర్తలుగా, 'అరైమర్ల' స్థానంలో ద్రావిడవేద గానాన్ని నిబద్ధతతో నిర్వహిస్తారు.

*భక్తామృతం విశ్వజనానుమోదనమ్‌।*

బాలవాక్కు

# ఏగూటి చిలక.. ఆపాట పాడుతుంది!

మనగుణాలు మనప్రవర్తన తినే ఆహారం మీద, చేసే స్నేహంమీద, చుట్టూ ఉండే పరిసరాలమీద, వినే మాటల మీద ఆధారపడతాయి.

అందుకే ఏగూటిచిలుక ఆ పాటపాడుతుందని పెద్దలంటారు. దీనికి ఒక కథ చెబుతారు.

ఒక మర్రిచెట్టుపై రెండుచిలుకలుండేవి. ఒక వేటగాడు వలపన్ని ఆ రెంటిల్నీ పట్టుకొన్నాడు. దారిలో వెళ్తూ వెళ్తూ ఒక చిలుకను ఒక సాధువుకూ, మరొక చిలుకను ఒక గజదొంగకూ అమ్మేశాడు. అలా ఒక చిలుక సాధువు ఇంట్లో, మరో చిలుక గజదొంగ స్థావరంలో చేరు కొన్నాయి.

ఆ సాధువు, దొంగ – తమ తమ అభిరుచులకు తగినట్లుగా వాటికి పేర్లు పెట్టుకొన్నారు. సాధువు



మాస్టర్ బి.చరణ్ సంతోష్,
S/o బి.శేషగిరిరావు,
7వ తరగతి, బి.వి.బి.ఎస్.వి.వి,
తిరుపతి - 517 501.


ఇంట్లో చిలుకకు రాముడనీ, గజదొంగ స్థావరంలో చిలుకకు దుర్ముఖుడనీ పేర్లు పెట్టుకొన్నారు. వారివారిఇండ్లలో తాము స్వీకరించే ఆహారపానీయాదులే వాటికీ ఇచ్చేవాళ్లు. వారివారి ఇండ్లలో మాట్లాడేమాటల్నే వాటికీ నేర్పించ సాగారు. అవి 'చిలుకపలుకులు' పలుకసాగాయి. (విన్నవి విన్నట్లు పల్కడం)

'రాముడు' చిలుక ఆ సాధువుఇంట్లో మంచి మాటలతో మధురంగా మాట్లాడం నేర్చుకొనింది. సాత్త్వికమైన ఆహారం తింటూ, అతిథుల్ని గౌరవించే పద్ధతుల్నీ గమనిస్తూ, సాధువుగా తయారయింది. ఇంటికి వచ్చినవాళ్లనందర్నీ మంచిమాటలతో గౌరవిస్తూ సంతోషపరచేది.

'దుర్ముఖుడు' చిలుక ఆ గజదొంగయింట్లో మాట్లాడే దురుసుమాటల్ని విని, హింసాకార్యాల్ని చూస్తుండటంవల్ల దానినోట దురుసుమాటలే వచ్చాయి.

కొన్నాళ్లకు ఆ రెండుచిలుకలూ తమతమఇండ్ల నుండి తప్పించుకొని, బయటికి వెళ్లిపోయాయి. 'రాముడు' (చిలుక) ఒక మామిడిచెట్టుమీద నివసించసాగింది. 'దుర్ముఖుడు' (చిలుక) ఒకపెద్దమర్రిచెట్టుపైన ఉంటూ వచ్చింది.

వేసవికాలంలో ఒకరోజు ఎండలో ఆదారిలో వెళ్తున్న ఒక బ్రాహ్మణుడు అలసిపోయి, సేదదీర్చుకొందామని



'దుర్ముఖు'డుండే మర్రిచెట్టుక్రిందికి చేరాడు. ఆ వ్యక్తిని చూడ గానే 'దుర్ముఖుడు' చిలుక ఆ చెట్టుపై నుండేపక్షుల్తో "ఎవరో మనిషి ఇక్కడికి వచ్చాడు. వాడిని దోచుకొందాంరండి! వీడు ఎవడో శత్రువు కావచ్చు. చంపుదాం పదండి. వెళ్దాం!" అని అరవసాగింది. తోడిపక్షుల్తో ఎగిరివచ్చి ఆ బ్రాహ్మణుడి తలపైన ముక్కుతో పొడవసాగింది.

ఆ బ్రాహ్మణుడు ఈ సంఘటనతో భయపడి పారిపో సాగాడు. మధ్యలో ఒక మామిడిచెట్టు కనిపించింది.

ఇలా పరుగెడుతున్న బ్రాహ్మణ్ణి చూచి- 'రాముడు' చిలుక "స్వామీ! ఈ చెట్టుక్రిందికి రండి. ఎండ విపరీతంగా ఉంది. ఇక్కడ సేదదీర్చుకోండి. మామిడి కాయలు రాలుస్తాను- తినండి. పక్కలో ఉండే బావిలో నీళ్లున్నాయి- త్రాగండి" అని మృదుమధురంగా... ఆహ్వానించింది. ఆ బ్రాహ్మడికి చాలా సంతోషమయింది.

'చూడడానికేమో ఈ చిలుకలు రెండూ ఒకే తల్లి పిల్లల్లాగా ఉన్నాయి. కాని పెరిగిన చోట్లు వేరుకావడంవల్ల వాటిస్వభావాలు ఎంతగానో మారి పోయాయి. అంతేమరి!' అనుకొన్నాడు- ఆ బ్రాహ్మణుడు.

అంచేత స్నేహితులారా! మనం మంచి వాతావరణంలో పెరగాలి. మన తల్లిదండ్రుల వద్ద, స్నేహితుల వద్ద, మంచిని నేర్చుకోవాలి. పదిమందిలో మంచిని పెంచాలి- పంచాలి. బాల్యంలో సద్గుణాలు అలవడితే పెద్దవాళ్లయ్యాక మంచివ్యక్తులుగా తయారయి, సమాజానికి మేలు చేసేవాళ్లమవుతాం.

## తిరుపతి పరిసర ప్రాంతాలలోని తిరుమల తిరుపతి దేవస్థానముల ఆలయాల దూరం కిలోమీటర్లలో...


### తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ నుండి దూరం కి.మీలలో...

| | |
|---|---|
| 01) శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం, తిరుచానూరు | 05 కి.మీ. |
| 02) శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీనివాసమంగాపురం | 12 కి.మీ. |
| 03) శ్రీగోవిందరాజస్వామివారి ఆలయం, తిరుపతి | |
| 04) శ్రీకోదండరామస్వామివారి ఆలయం, తిరుపతి | |
| 05) శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయం, తిరుపతి | |
| 06) శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయం, అప్పలాయగుంట | 30 కి.మీ. |
| 07) శ్రీవేదవల్లీ సమేత శ్రీవేదనారాయణస్వామివారి ఆలయం, నాగలాపురం | 65 కి.మీ |
| 08) శ్రీపద్మావతి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, నారాయణవనం | 37 కి.మీ. |
| 09) శ్రీవేణుగోపాలస్వామివారి ఆలయం, కార్వేటినగరం | 48 కి.మీ. |
| 10) శ్రీకోదండరామాలయం, ఒంటిమిట్ట, కడప జిల్లా | 116 కి.మీ. |

ఓం నమో వేంకటేశాయ.

తిరుమల తిరుపతి దేవస్థానములు

# గోవిందం
# పరమానందం





## తిరుమల
## శ్రీ వేంకటేశ్వరస్వామివారి
## ఆలయంలో
## నిత్య సేవలు



# గోవిందం పరమానందం

## తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో నిత్య సేవలు

(తి.తి.దే. నమూనా ఆలయ ఆధారంగా)



సుప్రభాతం



సుప్రభాతం



ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం



కొలువు


తోమాలసేవ


సహస్ర కలశాభిషేకం


తిరుప్పావడ సేవ


అష్టదళ పాదపద్మారాధన


సహస్రనామార్చన


శుక్రవారాభిషేకం


ఏకాంతసేవ



తిరుమలలో 09-11-2019 న తెల్లవారుజామున జరిగిన కైశిక ద్వాదశి మహోత్సవం



చంద్రగిరి శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో అక్టోబరు 23 నుండి 25వ తేదీ వరకు జరిగిన అష్టబంధన, బాలాలయ జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ దృశ్యాలు



నవంబరు 07 నుండి 10 వరకు దేవుని కడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో జరిగిన అష్టబంధన మహాసంప్రోక్షణ వేడుకలు



తి.తి. దే. బోర్డు ఎక్స్-అఫిషియో సభ్యురాలు గా దేవదాయ మరియు ధర్మాదాయ శాఖ కార్యదర్శి శ్రీమతి వేమూరి ఉషారాణి, ఐ.ఏ.యస్., గారిచే (10-11-2019) తిరుమల శ్రీవారి ఆలయంలో తి.తి.దే. అదనపు ఇ.ఓ. శ్రీ ధర్మారెడ్డి గారు ప్రమాణస్వీకారం చేయించి. శ్రీ స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించారు



తి.తి. దే. బర్డ్స్ ఆసుపత్రిలో దివ్యాంగులు, వారి సహాయకుల మధ్య దీపావళి వేడుకల్లో పాల్గొన్న తి.తి.దే. జె.ఇ.ఓ. శ్రీ బసంత్‌కుమార్. ఐ.ఏ.యస్.,

*గత సంచిక తరువాయి భాగం...*

## యాగం ఎవరి కోసం!

పూర్వం ఒకప్పుడు పవిత్రమైన గంగానది ఒడ్డున మునులు చాలమంది ఒక్కచోట చేరారు. వాళ్లు లోక కల్యాణం కోసం ఒక యాగాన్ని చెయ్యడానికి తలపెట్టారు. ప్రారంభించారు కూడా 'వేదమంత్రాలమధ్య, మంగళ వాద్యాలు మోగింపబడుతుండగా ఆ యజ్ఞం కోలాహలంగా ప్రారంభం అయ్యింది. ఇంతలో నారాయణ! నారాయణ!! అంటూ ఆకాశం నుంచి ఊడిపడ్డట్టుగా, నారదమహర్షి అక్కడ ప్రత్యక్ష మయ్యాడు.

అబ్బ! కలహభోజనుడైన నారదుడు వచ్చాడు. ఈ యాగం సాగదు గాక సాగదు అనుకొన్నారు కొందరు ఋషులు. లోకక్షేమం కోసం శుభప్రదంగా యాగం ప్రారంభమైన వేళ దేవర్షి రావడం శుభశకునం అనుకొన్నారు మరికొందరు మునులు.

నారాయణ! నారాయణ!! అన్న నారదుడి నారాయణ నామస్మరణంతో అందరి ఆలోచనలు ఆగిపోయాయి. అందరూ లేచి నిలబడి నమస్కరిస్తూ నారదుడికి స్వాగతం పలికారు, ఆతిథ్యమిచ్చారు.

వారి సత్కారానికి సంబరపడిపోతూ నారదుడు ఇలా అన్నాడు. మహర్షులారా! మీరంతా ఇక్కడ ఏం చేస్తున్నారు, అని ఆసక్తిగా అడిగాడు.

అయ్యా! దేవర్షీ! మేం ఒక యాగాన్ని ప్రారంభించాం. ఈ యజ్ఞంవల్ల జగత్కల్యాణం కలగాలన్నదే మా ఉద్దేశం. సరిగ్గా ఈ సమయంలో మీరు రావడం ఆనందదాయకం, మా కార్యానికి ఆశీస్సులందించండి అంటూ చేతు లెత్తి దండం పెట్టారు.

నారాయణ! నారాయణ!! అంటూ నారదమునీంద్రుడు ఆశ్చర్యంతో ఇలా అన్నాడు. "ఏమిటీ! లోకక్షేమం కోసం యాగం తలపెట్టారా? బాగుంది! బాగుంది! కాని మీ కోరిక ప్రకారం లోక కల్యాణం కలిగించే దేవుడు ఎవరు? శివుడా? విష్ణువా? బ్రహ్మదేవుడా? ఎవర్ని గూర్చి ఈ హోమం చేస్తున్నారు.



ఈ ప్రశ్నలకు మునులందరూ ఒకరి మొగాలొకరు చూసుకొంటూ అయోమయంలో పడ్డారు.

వాళ్లందరి దీనావస్థను చూసి, మళ్లీ నారదుడే ఇలా అన్నాడు. అయ్యా! దేవతల్లో త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు గొప్పవారు కదా! ఈ ముగ్గురిలోను లోకకల్యాణాన్ని కల్గించే వారెవరు? భక్తులు అడిగిన వెంటనే ఆదుకొనే ఆపద్బాంధవుడు ఎవరు? కోరిన వరాలిచ్చే దేవుడు



04

# దివ్యక్షేత్రం... తిరుమల

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

ఎవరు? స్మరించిన వెంటనే పాపాలను పోగొట్టి, సర్వ శుభాలను ప్రసాదించే పరంధాముడు ఎవరు? అంతేకాదు. ఇక కలియుగం తొందర్లో రాబోతూంది. అది కలుషాల మయం. కలిదోషాలనుండి రక్షించగల దేవాది దేవుడు ఎవరో, ముందుగా నిర్ణయించుకోండి. ఆ తర్వాతే ఆ దేవుణ్ణి గూర్చి యాగం చెయ్యండి! మీ కోరికా తీరుతుంది. తప్పక జగత్కల్యాణం సిద్ధిస్తుంది. అంటూ నారాయణనామ స్మరణంతో నారదుడు అదృశ్యమయ్యాడు.

## ఎవరు గొప్ప!

నారదుడు ఉన్నట్టుండి రావడం, సందేహాన్ని కలిగించి వెళ్లడంతో మునులందరూ కొంచం తేరుకున్నారు. ఆ దేవర్షి అన్నమాట నిజమే కదా. అని చర్చించారు. తర్జన భర్జనకు లోనయ్యారు. త్రిమూర్తుల్లో ఎవరు గొప్పో తేల్చడం ఎలా? అది సులువైన పనేనా? ఎవరు నిర్ణయించగలరు, అని తమలో తాము ఆలోచించుకొని చివరకు ఈ కార్యభారాన్ని భృగుమహర్షికి అప్పగిస్తూ ప్రార్థించారు.


జగత్కల్యాణం కోసం కదా! తప్పుతుందా! అను కొంటూ బయలుదేరాడు భృగుమహర్షి.

## పూజే లేకుండు గాక!

ముందుగా భృగువు సత్యలోకంలో అడుగుపెట్టాడు. సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడి లోకమే సత్యలోకం.

అక్కడ తెల్లని పద్మంలో నాలుగు మొగాలతో వేదాలను వల్లిస్తున్న బ్రహ్మదేవుడు కనపడ్డాడు. ఆ పక్కనే బ్రహ్మదేవుడి వేదనాదాలకు అనుగుణంగా వీణపై చేతివేళ్లను సుతారంగా మీటుతూ ఉన్న శ్రీసరస్వతీదేవి దర్శనమిచ్చింది.

సత్యలోకంలో ప్రవేశించిన భృగుమహర్షికి బ్రహ్మదేవుడి వేదనాదం, సరస్వతీదేవి వీణావాదనం అబ్బురపరచాయి. పరమానందం పొందాడు. వాళ్లకు సాగిలబడి నమస్కరించాడు. అనేకవిధాలుగా గట్టిగా స్తుతించాడు. వాళ్లు ఇద్దరూ, తనను చూస్తేగా? తన ప్రార్థనల్ని వింటేగా? వాళ్లిద్దరూ వాళ్లలో వాళ్లు మునిగిపోయ్యారు. కనీసం తనను



గమనించినట్లైనా కన్పించరే! ఎంత దేవతలయితే మాత్రం వీళ్లకు ఇంత అహంకారమా!! నాపైన ఇంతటి నిరాదరణా! అంటూ కోపంగా "బ్రహ్మదేవుణ్ణి చూస్తూ, నీకు భూలోకంలో పూజలే లేకుండు గాక! అంటూ శపించి అక్కడినుండి బయటపడ్డాడు.

## స్థాణువుగా ఉండు!

సత్యలోకంలో తనకు ఎదురైన నిరాదరణను గూర్చి ఆలోచిస్తూ భృగువు కైలాసంలో ప్రవేశించాడు. వేళ కాని వేళ ఇప్పుడు లోనికి వెళ్లకూడదు. పార్వతీ పరమేశ్వరులు ఏకాంత మందిరంలో ఉన్నారు. ఇప్పుడు లోనికి వెళ్లడం కుదరదు, అంటూ నందీశ్వరుడు అడ్డుకొన్నాడు.

ఆ ముని నందీశ్వరుణ్ణి ఒక్కతోపు తోసి లోపల చొరబడ్డాడు. అంతే! ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరుల ప్రణయానికి భంగం వాటిల్లింది, ఇంకేముంది. శివుడు ఎక్కడలేని రౌద్రరూపంతో త్రిశూలంతో అతణ్ణి చంప బోయాడు. వెంటనే పార్వతి అడ్డుపడించి.





తిరుమలలో వసతి ఒక రోజుకు మాత్రమే పరిమితం

బ్రతుకు జీవుడా! అనుకొన్న భృగుమహర్షి కట్టలు తెంచుకొన్న కోపంతో, "తామసుడవైన ఓ శివా! నీవు భూలోకంలో స్థాణువుగా" పడివుండు. నీవు లింగాకారంలో మాత్రమే పూజలందుదువు గాక! అంటూ శపించి విస విసా వెళ్లి పోయాడు.

## అందరి ఆనందాల దేవుడు


మనోవేదనతో భృగుముని వైకుంఠంలో ప్రవేశించాడు. అక్కడ ద్వారానికి ఇరువైపులా కాపలా ఉన్న ద్వారపాలకులు జయ విజయులు ఆ మహర్షిని అడ్డుకున్నారు.

వాళ్ల అడ్డగింపు ఏమీ పని చెయ్యలేదు. భృగుమహర్షి అదుపులేని ఆవేశంతో వైకుంఠంలోని అభ్యంతరమందిరంలో దూకుడుగా చొరబడ్డాడు.

శేషపాన్పుపై శ్రీమహావిష్ణువు! ఆయన ఎదపై వాలి వున్న శ్రీమహాలక్ష్మి! స్వామివారితో ఏదో ముచ్చటి స్తున్న సుందర దృశ్యం. స్వామివారు చిరునవ్వుతో ఆమె మోములో మోము పెట్టి, ఆమె చెబుతున్న దేదో ఆసక్తిగా వింటున్నాడు!

దివ్యమంగళ దంపతులైన శ్రీలక్ష్మీనారాయణులు ఆ ముని ఉక్రోషంతో లోనికి రావడం గమనించినా, ఏమాత్రం గమనించనట్లుగానే ఉండినారు.

పాపం భృగువు అనేకవిధాలుగా వాళ్లిద్దర్నీ స్తుతిం చాడు. పొగిడాడు. గట్టిగా పిలిచాడు. అరిచాడు కూడ. ఇప్పటికే సత్యలోకంలోనూ, కైలాసంలోనూ తలకెక్కిన కోపం,





భక్తులకోసం...

అలిపిరినుండి కాలిబాటలో భక్తులకు దారిపొడవునా త్రాగునీటి వసతి కల్పించబడింది.

మరియు రక్షణనిమిత్తం తి.తి.దేవస్థానం సెక్యూరిటీ గార్డులను నియమించింది.


ఇక్కడ నిర్లక్ష్యానికి మరింతగా పెరిగింది. ఇంక తాళలేక, పట్టపగ్గాలు లేని ఆవేశంతో శేషశయ్యపై శయనించిన విష్ణువు రొమ్ముపైన కాలితో తన్నాడు. ఈ హఠాత్సంఘటనకు వెంటనే లక్ష్మీదేవి ప్రక్కకు తొలగింది. ఆ ఋషి కాలు స్వామివారి హృదయానికి తాకింది. వెంటనే విష్ణువు లేచి, ఆ మునిని శాంతపరుస్తూ ఆయనను గమనించకపోవడం తమ పొరపాటు అన్నాడు. అంతేగాదు, ఆ మునిని శేషశయ్యపై కూర్చుండబెట్టి అతని కాళ్లను పిసుకుతూ పాదంలో ఉండే అహంకార నేత్రాన్ని నలిపి వేశాడు, వెంటనే



మునీశ్వరుని అహంకారం పూర్తిగా నశించి, తాను చేసిన తప్పిదాన్ని క్షమించమని వేడుకొన్నాడు. శ్రీ మహావిష్ణువే, భూలోకంలో అందరి చేతా పూజింపదగినవాడు, అందరికీ ఆనందాలను పంచి ఇచ్చే దేవుడు అంటూ నిశ్చయించి భూలోకానికి వచ్చి మునులకు చెప్పగా. వాళ్లు ఆ యాగాన్ని విష్ణు పరంగా పూర్తి చేశారు.

తత్ఫలితంగానే శ్రీమహావిష్ణువు "శ్రీవేంకటేశ్వరుడి" పేరుతో శ్రీవైకుంఠంనుండి భువికి తరలివచ్చాడు. అదెలా జరిగింది. అంటే! *(ఇంకా ఉంది)*

### బాలప్రబోధం

# వయస్సుతో.. పని ఏముంది?

– డా॥ పి. అనంతలక్ష్మి

నచికేతుడి కథ కఠోపనిషత్తులో ఉంది. వాజశ్రవసుడు అనే బ్రాహ్మణుడు ఉత్కృష్టమైన యాగం వేదోక్తంగా చేశాడు. ఆ యాగం చివర తన సర్వస్వాన్ని యోగ్యుడయిన బ్రాహ్మణుడికి దానం చేస్తేనే ఆ యాగం సఫలమవుతుంది. అందువల్ల వాజశ్రవసుడు తన యావదాస్తి అయిన గోవుల్ని దక్షిణగా ఇవ్వడం మొదలుపెట్టాడు. ఆయన ఆస్తి అంతా గోవులే కదా!

వాజశ్రవసుడికుమారుడు నచికేతుడు తండ్రి చేస్తున్న దానాన్ని గమనించి పనికిరాని గోవుల్ని ఇచ్చినందువల్ల ఫలితం ఉండదు కదా! అనుకొన్నాడు. తండ్రిదగ్గరకు వెళ్ళి "నన్ను ఎవరికి దానం ఇస్తున్నావు?" అని రెండుమార్లు అడిగాడు. వాజశ్రవసుడు పనిలో ఉండి పట్టించుకోలేదు. మూడవసారికూడా అడిగితే విసుగుతో "నిన్ను యముడికి ఇస్తున్నాను" అన్నాడు. "అయ్యో! పాపం నా వల్ల యముడికి ఏమి ఉపయోగం ఉంటుంది?" అని ఆలోచించాడు – కొడుకు.

ఇంతలో తండ్రికి తాను చేసిన పొరపాటు అర్థమయ్యింది. పశ్చాత్తాపంతో బాధపడ్డాడు. అప్పుడు నచికేతుడు తండ్రిని బాధపడవద్దని చెప్పి, తాను తండ్రిమాట నిలబెట్టడానికి యమసదనానికి వెళతానన్నాడు. తండ్రి ఎంత బతిమాలినా తమపూర్వులప్రవర్తన గుర్తు చేసుకొమ్మని, జననమరణాలు తప్పవని సర్ది చెప్పాడు.

తండ్రిని ఒప్పించి యమలోకానికి ప్రయాణమయ్యాడు – నచికేతుడు. చిన్న పిల్లవాడైనా ఎంతధైర్యమో చూడండి! అంతే కాదు, తండ్రిమాటమీద ఎంత గౌరవమో చూచారా! తీరా యమలోకానికి వెళ్ళేసరికి యముడు ఇంటివద్ద లేడు. నచికేతుడు యముడు వచ్చే వరకు ఆతిథ్యం స్వీకరించలేదు. మూడుదినాల తరువాత యముడు ఇంటికి వచ్చాడు.

యముడితో అక్కడివాళ్ళు బ్రాహ్మణబాలకుడు మూడురాత్రులు భోజనం లేకుండా ఉన్నాడని చెప్పారు. "ఎవరి ఇంట్లో బ్రాహ్మణుడు భోజనం లేకుండా ఉంటాడో వాళ్ళ పుణ్యఫలాలు పోతాయి. పుత్రులు, పశువులు నాశనం అవుతారు. ఎందుకంటే అగ్నిదేవుడే బ్రాహ్మణరూపంలో గృహస్థు ఇంటికి వస్తాడు". అనే శాస్త్రవిషయం చెప్పి, వెంటనే అతడిపాదాలు కడిగి అతిథిమర్యాదలు చేయండన్నాడు.

అన్ని ధర్మాలూ తెలిసినధర్మమూర్తి యముడు ఎంతగానో నొచ్చుకొన్నాడు. మరుక్షణం నచికేతుడివద్దకు వెళ్ళి "బ్రాహ్మణోత్తమా! అతిథివై వచ్చి నా ఇంట్లో మూడురాత్రులు నిరాహారివై ఉన్నావు. అతిథి నమస్కరింపదగినవాడు. కనుక నమస్కారం! నీకు శుభం కలుగుగాక! నా ఇంటిలో మూడు రాత్రులు ఆహారం లేకుండా ఉన్నతప్పిదానికి పరిహారంగా మూడువరాలు ఇస్తాను. కోరుకో!" అన్నాడు.

నచికేతుడు సరే అన్నాడు. "సమవర్తీ! నేను ఇంత దూరంలో ఉండడంవల్ల బాధపడుతున్న నా తండ్రి దిగులు పడకుండా, నా మీదకోపం లేకుండా ప్రేమతో ఉండేట్టు, నన్ను తిరిగి ఇంటికి పంపినపప్పుడు నా తండ్రి నన్ను గుర్తుపట్టి, స్వీకరించేట్టు వరం ఇవ్వండి" అన్నాడు. యముడికి సంతోషం కలిగింది కన్నతండ్రికోసం ఎక్కువగా బాధపడినందుకు. "అట్లాగే! నీ తండ్రి నిన్ను ఇంతకు ముందులాగానే ప్రేమగా చూస్తాడు, స్వీకరిస్తాడు. దిగులు లేకుండా సుఖంగా రాత్రుల్లో నిద్రపోతాడు". అని వరం ఇచ్చి యముడు రెండవ వరం కోరుకొమ్మన్నాడు.



తిరుమల అశ్విని ఆసుపత్రిలో యాత్రికులకు ఉచిత వైద్య సౌకర్యం ఉంది

"స్వర్గంలో మరణం, రోగం, ముసలితనం, ఆకలి దప్పుల బాధ ఉండవు. అక్కడివాళ్ళు సుఖాల్నే అనుభవిస్తూ ఉంటారు. అటువంటిస్వర్గాన్ని పొందడానికి కావలసిన అగ్ని విద్య నీ వద్ద ఉంది. నాకు ఆ విద్యను బోధించు. శ్రద్ధగా అడుగుతున్నాను" అని రెండవవరం కోరుకొన్నాడు– నచికేతుడు.

యముడు అగ్నిచయనవిద్యను నచికేతుడికి ఉప దేశించాడు. హోమకుండానికి కావలసిన ఇటుకలు, కొలతలు, అగ్నిచయనవిధానం మొత్తం బోధించాడు– యముడు. నచికేతుడు శ్రద్ధగా విని, చెప్పిన దాన్ని చెప్పినట్టు అప్ప చెప్పాడు. ఇంత చిన్న పిల్లవాడిశ్రద్ధకు, తిరిగి చెప్పిన మేధాసంపదకు మురిసిపోయిన యమ ధర్మరాజు "నచికేతా! ఇంతకు ముందు ఇచ్చిన రెండువరాలతో పాటు ఈ మూడవవరాన్ని కూడా స్వీకరించు. ఈ అగ్నివిద్య నీ పేరుతో ఇక నుంచి నాచికేతాగ్ని అని పిలుస్తారు. ఈ నాచికేతాగ్నిని మూడుసార్లు అనుష్ఠించేవాడు తల్లి, తండ్రి, ఆచార్యుల మాటల్ని పాటించి యాగాదులు చేసి, జననమరణాల్ని అధిగ మిస్తాడు. పరమాత్మను తెలుసుకొని పరమ శాంతిని పొందుతాడు. ఈ వివరాలు తెలుసు కొని యాగం చేస్తే శరీరం వదలడానికి ముందే మృత్యుపాశాన్ని తెంచుకొని, 'దుఃఖం లేనివాడై.. స్వర్గలోకంలో... ఆనందిస్తాడు" అన్నాడు.

చూచారా! వరం కోరుకొమ్మంటే కోరుకోవడం కూడా తెలియాలి. ఈ రెండే కాదు, మూడోది కూడా ఎటువంటిది అడిగాడో! చూద్దాం!

"మనిషి చనిపోయాక... ఆత్మ ఉంటుంది అంటారు – కొందరు. అటువంటి దేమీ లేదు అంటారు మరికొందరు. వీటిలో ఏది నిజమో తెలుసుకోవాలనుకొంటున్నాను. ఇదే నేను కోరే మూడవ వరం" అన్నాడు – నచికేతుడు.

ఇది చాలా లోతైనవిషయం. చాలామందికి ఇటు వంటి సందేహాలు వస్తూనే ఉంటాయి. కానీ, ధైర్యంచేసి అడుగరు. అడిగినా సమాధానం చెప్పే వాళ్లుండరు. చెప్పినా అర్థం కావడం కష్టం. ఎందుకంటే అర్థం కావడానికి కొన్ని అర్హతలు ఉంటాయి. ఆ అర్హత నచికేతుడికి ఉందా అని పరీక్షించ దలచాడు యముడు.

"నచికేతా! ఇది చాలా సూక్ష్మమైంది. ఈ విష యంలో పూర్వం దేవతలకు కూడా సందేహం కలిగింది.



తేలికగా అర్థం కాదు. దీన్ని వదిలెయ్యి. మరేదైనా కోరుకో!" అన్నాడు.

"ధర్మమూర్తీ! దేవతలకే వచ్చింది ఈ సందేహం అన్నావు. సులభంగా తెలియదన్నావు. కనుక తప్పక తెలుసు కొని తీరాలి. నీ వంటి ధర్మమూర్తి తప్ప మరొకరు చెప్పలేరు. ఈ వరం తప్ప వేరేది వద్దు" అన్నాడు పట్టుదలగా నచికేతుడు.

"ఆత్మతత్త్వం తెలుసుకోవడం ఒకటి వదలిపెట్టు. వంద సంవత్సరాలు జీవించే కొడుకుల్నీ మనుమల్నీ కోరుకో! గో, గజ తురగాదుల్నీ, బంగారాన్నీ, భూమినీ, సంపదనూ, ఆయువునూ దేన్నైనా కోరుకో! మానవులకు దొరకని సుందరీ మణుల్ని కూడా గ్రహించి వారిచేత నీ ఇష్టమైన సేవల్ని చేయించుకో! మృత్యువును గురించి మాత్రం అడుగవద్దు". యముడు గట్టిగా అన్నాడు.

"యమధర్మరాజా! ఈ భోగభాగ్యాలు శాశ్వతమైనవి కావు. పైగా ఇవి ఇంద్రియాల తేజస్సును హరిస్తాయి. అవి వద్దు. నీ దర్శనం చాలు- ధనం లభించడానికి. నీ అను గ్రహం చాలు బతికి ఉండడానికి. నేను కోరుకొనే వరం ఆత్మజ్ఞానం ఒక్కటే. ఇంకేమీ వద్దు. మర్త్యుడు అంటే మృతి కలవాడు. మృత్యువు తప్పదనీ, భోగాలు తుచ్ఛమయినవనీ తెలిసి, దీర్ఘాయువును ఎవరు కోరుకొంటారు?" గట్టిగా అడిగాడు నచికేతుడు.

నచికేతుడి పట్టుదల గ్రహించిన యముడు అతడికి ఆత్మజ్ఞానం ఉపదేశించాడు.

"శ్రేయస్సు, ప్రేయస్సు అనే రెండుమార్గాలున్నాయి. రెండూ జీవుణ్ణి బంధిస్తాయి. రెండూ జీవుడివెంట వస్తూ ఉంటాయి. శ్రేయోమార్గంలో వెళితే పరమపురుషార్థమైన మోక్షం పొందుతాడు. ప్రేయోమార్గం కావాలనుకొంటే లౌకిక మైన యోగక్షేమాలు పొందుతాడు. నువ్వు చక్కగా ఆలోచించి వివేకంతో భోగభాగ్యాల్ని కోరలేదు. అందువల్ల నిన్ను జ్ఞానా పేక్ష కలవాడివని అనుకొంటున్నాను. ధనాశతో మత్తుడై ఉన్న వాడికి పరలోకం అనే ఆలోచనే రాదు. ఈ లోకమే తప్ప పరలోకం లేదనే వాళ్లు మాటిమాటికి నా పాల బడతారు. నువ్వు అడిగిన ఆత్మనుగురించి విననివాళ్ళు కూడా ఎంతో మంది ఉన్నారు. కొంతమంది విన్నా గ్రహించలేరు. ఆత్మను గురించి చెప్పేవాళ్లూ, వినేవాళ్లూ కూడా అరుదుగా ఉంటారు.

అణుస్వరూపమైన ఆత్మ ఊహకూ, వాక్కుకూ అందదు. తర్కానికి అసలే అందదు. బ్రహ్మానుభూతి పొందిన వాడు చెప్పినప్పుడుమాత్రమే గోచరిస్తుంది. నీలాగా ప్రశ్నించే శిష్యుడు ఉంటేనే ఆత్మనుగురించి చెప్పగలం.

అన్నీ అశాశ్వతాలని తెలిసికూడా నేను నాచి కేతాగ్నిని వ్రేల్చి, ఈ పదవి పొందాను.

బ్రహ్మానందానికి ఏవీ సాటి రావని అన్నిటినీ వదలిన నీకోసం బ్రహ్మలోకం తెరచినట్లు నేను భావిస్తున్నాను."

ఆత్మజ్ఞానం ప్రాముఖ్యాన్ని తెలిపిన యముణ్ణి బ్రహ్మపదాన్నిగురించి ఉపదేశించుమని అడిగాడు- నచి కేతుడు. అపుడు ప్రణవతత్త్వాన్ని, ఆత్మతత్త్వాన్ని, తెలియ చేశాడు- యముడు.

ఆత్మ శాశ్వతం. ఆత్మకు చావు పుట్టుకలు లేవు. ప్రసన్నమైన మనసు, ఇంద్రియాలు ఉన్నవాడికి, సూక్ష్మబుద్ధి ఉన్నవాడికిమాత్రమే ఆత్మస్వరూపం గోచరమవుతుంది. చెడు ప్రవర్తన ఉన్నా, ఇంద్రియనిగ్రహం, శాంతి లేకపోయినా ఆత్మను తెలుసుకొని అనుభూతి చెందలేరు. ఆత్మ అన్ని ప్రాణు ల్లోనూ గూఢంగా ఉంటుంది. సూక్ష్మబుద్ధి ఉన్నవాళ్ళు మాత్రమే గుర్తించగలుగుతారు. ఇంకా ఆత్మ, శరీరం మొద లైన విషయాలు ఎన్నో చెప్పాడు. ఈ ఆత్మవిద్యను గ్రహించిన వాడు ముక్తుడై, బ్రహ్మలోకంలోకూడా పూజలు పొందుతాడు అని తన ఉపదేశం ముగించాడు- యముడు. ఆత్మవిద్యను పొందిన నచికేతుడు యమసదనంనుంచి తిరిగి వెళ్ళి, ధర్మ బద్ధమైన జీవితం గడిపి ముక్తి పొందాడు.

పట్టుదల ఉంటే బాలురైనా గొప్పవిద్యల్ని సాధించ వచ్చునని నచికేతుడికథ సందేశం ఇస్తుంది. బాలుడైన నచికేతుడి కారణంగా ఈ ఆత్మవిద్య, నాచికేతాగ్ని లోకానికి లభించాయి. జ్ఞానానికి వయసుతో సంబంధంలేదు.



విరామ సమయంలో తిరుపతి పరిసర ఆలయాలు దర్శించవచ్చు

భాగవత కథాసాగరం

# ఋషభ దేవుని ఆవిర్భావం

- డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్,
98219 14642

ఋషభదేవుని అవతార వర్ణనం శ్రీమద్భాగవతం లోని పంచమస్కంధంలో వస్తుంది. అది భగవంతుని అవ తారపట్టికలో ఎనిమిదవదిగా వర్ణింపబడింది. "అష్టమే మేరుదేవ్యాంతు నాభేర్జాత ఉరుక్రమః" అని భాగవతంలోని ప్రథమస్కంధంలో చెప్పబడింది. మహారాజు నాభి, అతని భార్య మేరుదేవికి భగవానుడైన ఉరుక్రముడు ఋషభ దేవుని రూపంలో ఆవిర్భవించి, పూర్ణమైన ఇంద్రియనిగ్ర హాన్ని కలిగినవాడై సర్వ ఆశ్రమాలవారిచే గౌరవించబడి ధీరులు అనుసరించునట్టి పూర్ణత్వమార్గాన్ని చూపాడు. అద్భుతమైన ఈ ఋషభ దేవుని అవతారంలో భగవానుడు అమోఘమైన ఉపదేశాలు చేస్తాడు. ప్రియవ్రతుని వంశంలో ఆవిర్భవించిన ఋషభదేవునికి ముందు ఇతరవంశజుల వివరాలు-

సాక్షాత్తు నారదమునిచేతనే కీర్తించబడిన ప్రియ వ్రతుడు ఆధ్యాత్మికజీవన పథాన్ని అనుసరించడానికి తపో వనానికి వెళ్లిపోయిన తరువాత అతని పుత్రుడైన ఆగ్నీధ్రుడు జంబూద్వీపానికి రాజయ్యాడు. ధర్మ యుతంగా పాలన చేస్తూ, అతడు ప్రజలను కన్న బిడ్డలుగా చూచుకునేవాడు. అందరూ ధర్మయుతమైన జీవనాన్ని.. గడిపేటట్లుగా... మార్గదర్శి అయ్యాడు. ఆగ్నీధ్రుడు తన తొమ్మిదిమంది రాకుమారులకు జంబూద్వీపంలోని వివిధ భాగాలను రాజ్యాలుగా పంచి ఇచ్చాడు. వారందరూ పితృదత్తమైన రాజ్యాలను చక్కగా పాలించారు.

ఆగ్నీధ్రుడు మరణించిన తరువాత అతని తొమ్మిది మంది కొడుకులు పుత్రులు మేరుతనయలైన మేరుదేవి, ప్రతిరూప, ఉగ్రదంష్టి, లత, రమ్య, శ్యామ, నారి, భద్ర, దేవవీతి అనేవారలను వివాహం చేసు కొన్నారు. ఆగ్నీధ్రుని తనయుడైన నాభి కూడా పుత్ర వాంఛతో సమస్త యజ్ఞపతి, యజ్ఞభోక్త అయిన విష్ణు భగవానుణ్ణి భక్తిశ్రద్ధలతో స్తుతించి అర్చించాడు. అతని భార్య మేరుదేవి కూడ భర్తతో పాటు దేవదేవుని అర్చించింది. భక్తుడైననాభి నిష్కల్మష హృదయంతో చేసిన ప్రవర్యమనే యజ్ఞంచేత సంతుష్టి చెందిన భగవానుడు చతుర్భుజుడై అతనికి దర్శనమిచ్చాడు. చతుర్భుజ నారాయణుడు పురుషోత్తమునిగా కనిపించాడు, ఆతనివక్షః స్థలంపై నిత్యశోభలీనే శ్రీవత్సం ఉంది. శంఖచక్రగదాపద్మా లను ధరించిన ఆతనిమెడలో వనమాల విరాజితమై ఉంది. కిరీటకుండలాలతో ఆతడు దేదీప్యమానంగా శోభించాడు. ఆ విధంగా భగవద్దర్శనం కాగానే అక్కడున్న వారు పేద వానికి పెన్నిధి లభించిన భావనను పొందారు. ఋత్విక్కులు ఆ దేవదేవుణ్ణి వినమ్రంగా స్తుతించారు.



"పరమపూజ్యుడా! మేము నీ సేవకులం. నీవు పూర్ణుడవు అయినప్పటికీ నిత్యదాసులమైన మా కొద్దిపాటి సేవను స్వీకరించగలవని భావిస్తున్నాము. దేవదేవా! వరదాతలలో నీవు శ్రేష్ఠుడవు. నాభి ఒనర్చినట్టి ఈ యజ్ఞంలో వరం ఇవ్వడానికే నీవు దర్శనమిచ్చినావని మేము నమ్ముతున్నాము. అయినా నీ దర్శనమే గొప్ప వరం! నీ వంటి పుత్రుణ్ణి పొందడమే ఈ నాభియొక్క అభీష్టం" అని ఋత్విక్కులు దేవదేవునితో అన్నారు.

అపుడు నాభిదంపతులు, యజ్ఞస్థలిలో ఉన్న వారందరూ విష్ణువుకు సాదరంగా నమస్కరించారు. వారిపట్ల ప్రసన్నుడైన భగవానుడు మేఘగంభీరస్వరంతో ఇలా పలికాడు: "ఋషులారా! మీ స్తుతులచే నేను సంతుష్టి చెందాను. మీరు సత్యవాక్కును కలిగినవారు. నాభిరాజుకు నా వంటి పుత్రుడు కావాలని మీరు అడిగారు. కానీ అది అసాధ్యం. ఎందుకంటే నేను అసమానుడను, అద్వితీయుడను. కాబట్టి నా అంశకళతో విస్తరించి మేరుదేవిగర్భంలో నేను అవతరిస్తాను."



బంగారుపూలతో..
పూజచేశారా,
బంతి పూలతో..
పూజచేశారా,
అన్నది
ముఖ్యం కాదు.

భక్తితో భగవంతుని
మీద మనస్సును
ఎంతసేపు నిలిపారు
అన్నదే ముఖ్యం!

భగవంతుడు పలికిన మాటలను నాభిరాజుభార్య మేరుదేవి విని, ప్రసన్నచిత్తరాలు అయింది. తరువాత భగవానుడు అంతర్హితుడయ్యాడు.

ఆ విధంగా ఆ దేవదేవుడు ఋషుల వల్ల మిక్కిలి సంతుష్టుడై ధర్మ విధానాన్ని స్వయంగా ప్రదర్శించడానికీ, నాభిరాజు కోరికను తీర్చడానికీ శుద్ధసత్త్వరూపంలో మేరుదేవికి పుత్రుడుగా ఆవిర్భవించాడు.

భగవానుడు నాభి తనయుడిగా అవతరించినపుడు తన పాదతలములపై దివ్యచిహ్నాలను ప్రదర్శించాడు. ధ్వజం, వజ్రం వంటి ఆ చిహ్నాలు భగవల్లక్షణాలు. ఆ పిల్లవాడు పరమశాంతుడిగా ఉండేవాడు, భోగవిరాగుడై ఉండేవాడు, దివ్యలక్షణసమన్వితుడై అతడు దినదినం శక్తిశాలిగా పెరుగసాగాడు.

అతణ్ణి చూచి బ్రాహ్మణులు, దేవతలు, అమాత్యులు అతడే తమకూ, భూమండలానికీ రాజు కావాలని కోరుకునేవారు. నాభికి జన్మించినట్టి భగవానుడు కవులు వర్ణించే సమస్తలక్షణాలను ప్రదర్శించాడు. చక్కని శరీరం, శౌర్యం, బలం, సౌందర్యం, యశస్సు, ప్రభావం, ఉత్సాహం– అన్నీ అనంతపరిమాణంతో అతనిలో గోచరించాయి.

అందుకే అతడు నరులలో శ్రేష్ఠుడని తలచి, నాభి అతనికి ఋషభదేవుడని పేరు పెట్టాడు. తమ కోరికకు తగినట్లుగా శ్రేష్ఠుడైన పుత్రుణ్ణి బడసి, నాభి మేరుదేవి దంపతులు ఎంతో సంతోషించారు.

తన పుత్రుడైన ఋషభదేవుడు సర్వలోకసమ్మతుడు కావడాన్ని గమనించిన నాభిరాజు వైదిక ధర్మానుసారం ప్రజాపాలనం చేయడానికి అతణ్ణి ప్రపంచచక్రవర్తిగా నియమించి, రాజ్యపాలనలో మార్గదర్శనం చేయగలిగినట్టి బ్రాహ్మణులకు తన పుత్రుణ్ణి అప్పజెప్పి, పిదప నాభి భార్యాసమేతుడై హిమాలయంలోని బదరికాశ్రమానికి వెళ్ళిపోయాడు.

అక్కడ ఆ మహనీయుడు శ్రీకృష్ణుని ప్రధానాంశమైన నరనారాయణులను సేవిస్తూ, సమాధిమగ్నుడై కాలక్రమంలో వైకుంఠం చేరుకున్నాడు.

# శ్రీవిల్లిపుత్తూరు

– శ్రీ కె.కె.మంగపతి, 93940 05212

మన దేవాలయాలు

తమిళనాడు, మధురైనగరానికి నైఋతి దిశగా, సుమారు 80 కి.మీ దూరంలో శ్రీవిల్లి పుత్తూరు ఉంది. ఇది విరుధనగర్‌జిల్లాపరిధి లోకి వస్తుంది. ఈ క్షేత్రంలో ఉన్న పెరుమాళ్ ఆలయం చాల ప్రాచీనమైంది. స్వామిని వడపెరుం కోవిలుడైయాన్ (వటపత్రశాయి)గా పిలుస్తారు.

మండూక మహర్షికి స్వామి ప్రత్యక్షమైనాడు. పెరుమాళ్ ఆలయాన్ని ఆళ్వార్లు "దివ్యదేశం"గా కీర్తించారు. పెరియాళ్వారు మరియు ఆండాళ్ మంగళాశాసనం గావించారు. పెరుమాళ్ బ్రహ్మోత్సవాలు తమిళ పురటాసిమాసంలో (సెప్టెంబరు–అక్టోబరు) 10 రోజులు పాటు జరుగుతాయి. ఆలయదర్శన వేళలు ఉ॥ 7 నుంచి 12 గం॥ల వరకు, తిరిగి సా॥ 4 నుంచి 8 గం॥ల వరకు. వటపత్రశాయి పెరుమాళ్ ఆలయరాజగోపురాన్ని తమిళనాడు ప్రభుత్వం రాష్ట్రచిహ్నంగా గౌరవించింది.

పెరుమాళ్ ఆలయానికి కుడివైపున గల పూదోటను ఆండాళ్ అమ్మవారి అవతారస్థలంగా శ్రీవైష్ణవులు గౌరవించుతారు. ఆ పూదోటను "ఆండాళ్ నందనవనం" అంటారు.

ఇచ్చటనే భూదేవి అంశం అయిన ఆండాళ్ అమ్మవారు ఆలయపూజారికి (విష్ణుచిత్తునికి) దొరికింది. అతడు గోదా అనే పేరుతో పెంచాడు. తెలుగువారు గోదాదేవిగా ఆరాధిస్తారు.

వటపత్రశాయి దేవాలయం వెనుకభాగంలో శ్రీఆండాళ్‌అమ్మవారికి ఒక చక్కటి ఆలయం ఉంది. దేవాలయంలో అద్భుతమైన శిల్పసంపద చూపరుల్ని ఆకట్టుకుంటుంది. కల్యాణమంటపం, అద్దాలమంటపం, మహామంటపం, ముఖమంటపం, వివిధసన్నిధులు ఉంటాయి ఆలయ గర్భాలయంలోని పీఠంపైన శ్రీరంగనాథ్ పెరుమాళ్‌తో పాటు శ్రీఆండాళ్ అమ్మవారు, శ్రీగరుడాళ్వార్‌ను దర్శించగలం. నిత్యపూజలు వైభవంగా జరుగుతాయి.

శ్రీఆండాళ్ అమ్మవారి కల్యాణోత్సవాలు తమిళ పంగుణి మాసంలో (మార్చి–ఏప్రియల్) ఘనంగా జరుగుతాయి. ఆడిమాసంలో (జూలై–ఆగష్టు) అమ్మవారి జన్మ ఉత్సవాలు నిర్వహిస్తారు. మార్గళిమాసంలో (డిసెంబరు–జనవరి) తిరుఉత్సవాలు ఉంటాయి. ఆలయం బయట పూజాసామగ్రి విక్రయించే అంగళ్లున్నాయి. శ్రీఆండాళ్ అమ్మవారి పాల కోవా ప్రసాదం విక్రయిస్తారు. ఇది ఇక్కడ చాల ప్రసిద్ధి. పెరియాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా ఈ ఆలయంలో తిరుఉత్సవాలు జరుగుతాయి.

ఆండాళ్ అమ్మవారిరచన "తిరుప్పావై"గా లోకప్రసిద్ధి. ఇది 30 పాశురాలతో కూడినకావ్యం. ధనుర్మాసంలో స్త్రీలు 30 రోజులు భక్తిశ్రద్ధలతో తిరుప్పావై పారాయణం చేస్తారు. ఆండాళ్ ఆళ్వార్‌యొక్క మరోకావ్యం "నాచ్చియార్ తిరుమొళి" ఆండాళ్ అమ్మవారిజన్మనక్షత్రం సందర్భంగా ఉత్సవాలు జరుగుతాయి. తెలుగువారు శ్రావణమాసం, శుద్ధచవితి, పుబ్బనక్షత్రంతో కూడిన తిథినాడు తిరునక్షత్ర ఉత్సవాలు నిర్వహిస్తారు.







# వెలితిని పూరించిన వేణుమాధవుడు

- డా॥ గాలి రాజేశ్వరి, 94925 94424

భాగవతంలో "కుబ్జ కృష్ణుల వృత్తాంతం" చిన్నదే అయినా తరచి చూస్తే మానసికసౌందర్యానికి, మానవ మాధవ సంస్కారాలకు ఛత్రం. ఈ వృత్తాంతంలో నాయిక కుబ్జ. ఆకర్షణకు ఆకృతి కృష్ణుడు. కుబ్జ మనోపరిమళానికి ఈ ఆకర్షణ తలవాల్చింది. ఆకర్షణలో ఆకర్షణ లయించింది. అసలు ముందుగా కృష్ణుడే కుబ్జను చూశాడు. ఆమె యథావిధిగా వీథిలో వారగా నడుచుకుంటూ వెళ్తోంది. చూడటమేకాదు, ముందుగా ఆమెను పలకరించింది కూడ కృష్ణుడే! కుబ్జ భౌతికంగా అనాకారి అయినా ఆమె చిత్తవృత్తి మాత్రం పరమాత్మను పరవశింపచేయగల శక్తిమంతమైంది.

అప్పటికి కృష్ణుడు బాల్యావస్థను అధిగమించి కౌమారదశను సంతరించుకుంటున్న తరుణం. కుబ్జకు ఎదురుగా కౌమార కృష్ణుడు నిలిచాడు. మనసు పరిమళించింది. తనువు పరవశించింది. "ఎవ్వరి దానవు!?"– ఇది కృష్ణుని మొదటిమాట. ఆపైన "సుందరీ! నీ పేరేమిటి!? ఎవరి కోసం ఇంత శ్రద్ధగా, బుద్ధిగా లేపనాలను తీసుకొని పోతున్నావు? ఈ సుగంధ లేపనాలన్నింటినీ మాకిమ్ము. మాకిచ్చినట్లైతే నీవు బహు చక్కగా ప్రకాశిస్తావు కమల నయనా" అన్నాడు.

ఈ ఘట్టం మహాకవి పోతన సంస్కార పరిమళానికి మచ్చుతునక. ఇహంలోనివన్నీ పరానికి సొంతం, అంకితం. లేపనాలంటే వాసనలు. జన్మాంతరవాసనలు, జన్మజన్మల కర్మఫలాలు. ఆ ఫలాలే కుబ్జతనం, కురూపితనం! అయినా ఆమె మనసు స్ఫటికమంత స్వచ్ఛమూ, పారదర్శకమూ. కాబట్టే అది పరమాత్ముని తాకింది, ప్రతిబింబించింది. భౌతిక సంబంధ వాసనాకర్మలను ఆ పరమాత్మ అడిగి మరీ తీసుకుంటున్నాడు. కుబ్జ నిర్మలాబ్జ, ధన్యజీవి. మనసా వాచా కర్మణా శూన్యహృదయ!. తనముందు నిలబడి అలా మాట్లాడిన ముకుందునితో పొలుపారగ ఇలా అంది. "సుందరాంగా! నీవు నిజంగానే అందగాడివి. అందరికీ అన్ని అందాలూ ప్రాప్తించవు కదా. ప్రాప్తించిన వాటితో సరిపెట్టుకున్న నేను త్రివక్రను. అంగవైకల్యాన్ని ప్రకృతి ప్రసాదంగా భావించే నేను కంసదాసిని. అచ్చమైన మైపూతలను తయారుచేయగల నేర్పరిని. నన్ను కంసరాజెంతగానో మెచ్చుకుంటాడు. అందగాళ్ళైన మీరు మా అనాకారితనాన్ని సుందరీ! అంటూ హేళన చేసి వేధించకండి. కావాలంటే ఈ లేపనాలను స్వీకరించి శరీరానికి అద్దుకుని ఆనందించండి అంది". ఎంత కావాలో అంతే మాట్లాడటం, అవసరమైనంతే ఇవ్వడం, తీసుకోవడం, సరససంభాషణ, ప్రియభాషణలు, మృదుభాషణలు కుబ్జ కృష్ణులలో కనిపిస్తాయి.

మూడొంకరలతో ఉన్న కుబ్జ దేహాన్ని సరిదిద్దాలనుకున్నాడు మాధవుడు. శకటాసురుని ఎగదన్నిన పాదాలను, కాళీయమర్దనం చేసిన పాదాలను, ప్రేమలోకాలకు పాదైన తన పాదాలను కృష్ణుడు, కుబ్జ పాదాలపై ఉంచి, గట్టిగా



నాగులాపురంలో వెలసిన దేవుడు 'వేదనారాయణుడు'

తొక్కి అదిమి పట్టి ఎందరికో అభయమిచ్చిన తన చేతి రెండు వేళ్ళను గడ్డంకింద నొక్కిపెట్టి, వంకరలను సాగదీస్తూ, పైకెత్తినాడు. కుబ్జ 'తనువు' అనే ధనువును సవరించాడు.




దివ్యాంగురాలయిన కుబ్జ సకలాంగగా సర్వాంగ సుందర సంశోభితగా భాసించింది. మేనిలోని వికారం మాయమై మనోహరంగా చక్కదనాలను పుణికిపుచ్చుకుంది. అవయవాల పొంకంతో, అరవిరిసిన అందంతో, మన్మథుని సమ్మోహనాస్త్రం వలె ఒప్పారుతున్న ఆ చక్కని చుక్క కమలాక్షునివైపు కాంక్షతో దృష్టిని సారించింది. శ్రీకృష్ణుణ్ణి తన ఇంటికి ఆహ్వానించింది.

**కృష్ణసాహిత్యంలో కుబ్జ మణిపూస. కృష్ణతత్త్వానిది అద్వైతశృంగారం. ఆత్మ స్వరూపుడైన పరమాత్మను అనుభూతించిన ఫలంతోనే... కుబ్జ తన వక్రతను కోల్పోయింది. వంకరలను ఇచ్చినవాడే పుచ్చుకున్నాడు. ఆ దేవాధిదేవుని స్పర్శతో కుబ్జ ధన్యతను పొందింది. కాంతల కన్నీటిని తుడిచి ఊరడించి, ఓదార్చగలిగే నేర్పరి ఆ నీరజాక్షుడొక్కడే! శ్రీకృష్ణశృంగారం లేదా శ్రీకృష్ణునితో శృంగారం సూక్ష్మ గ్రాహకం. కృష్ణుడు జగద్గురువు. లోకంలో శ్రీకృష్ణునికి నచ్చనిదంటూ లేదు. శ్రీకృష్ణుణ్ణి ఏమీ కోరనిది కుబ్జ.**

అందుకు కృష్ణుడు లాలనగా ఇలా అన్నాడు. "ఓ చంద్రవదనా! నేను కార్యార్థినై వచ్చినాను. నా పని పూర్తి అయిన తర్వాత మీ ఇంటికి రాగలను. ప్రస్తుతానికి కోపించకు"మని అనునయించి అక్కడి నుండి బయలుదేరాడు. ఒడుపైన దుడుకులు సదా ఆమోదయోగ్యాలే కదా! దుడుకులను ఒడుపుగా చేసి మగువల మన్ననలను పొందిన ఏకైక ధీరలలితుడు కృష్ణుడే. పరమాత్ముని పరిష్వంగం కంటే ముక్తి, మోక్షం గొప్పవి కావు. మోహక్షయమే మోక్షం. ఇహలోక మోహక్షయానికి కుబ్జ నోచుకుంది. కుబ్జది ఆత్మ నివేదన. అది అనంతుని రప్పించుకుంది.

పురుషుడు అన్న పదానికి, పూర్ణుడు- పూరించువాడు- పౌరుషవంతుడు అనే అర్థాలున్నాయి. సృష్టిలో పరమాత్మ ఒక్కడే పురుషుడు! పురుషోత్తముడు! మిగిలిన వారంతా స్త్రీలే. స్త్రీలోని లోటుపాట్లను, సరిచేసి, ఆమెకున్న వెలుతులను పూరించేవాడే పురుషుడు. కుబ్జకున్న వెలుతులను పూరించి, పరిపూర్ణురాలిగా మలిచిన మహాయోగి కృష్ణుడు. గోవిందుని అపరిమితమైన యోగసంపన్నత వల్ల, కుబ్జలోని కుండలినీ శక్తి జాగృతమైంది.


కుబ్జ సంస్కారధార! కృష్ణసాహిత్యజగత్తులో ఆమె ఒక ఇంద్రధనుస్సు, భక్తి, రక్తి కలగలిసిన హరివిల్లు. సిద్ధ శుద్ధ వజ్రసంకల్ప! రాజీ యెరుగని కర్మశీలి! ఆమెది కైవల్య భావన! ఆమె అంతరంగం ఆత్మసంస్కారాల సంస్థానం. కుబ్జ కృష్ణుల ప్రేమ, జీవుని దేవుని అద్భుత ప్రణయపరిష్వంగం! వక్రత నశించాక కృష్ణవిరహిణి అయినా నిబ్బరంగా అతని కోసం ఎదురుచూచిన విశిష్టవిరహిణి కుబ్జ. కుబ్జ విరహం కృష్ణునికి అనురాగ హారతి. కృష్ణునితో సంగమం సృష్టితో సమాగమం. నీ, నా, ప్రాణస్పందనలకు ఆలవాలం పార్థ సారధి. పరమేశ్వరతత్త్వానికి పరాకాష్ఠ కుబ్జ!

కంసవధ తర్వాత కృష్ణుడు కుబ్జ ఇంటికి వెళ్లాడు. కుబ్జ మహదానందంగా ఆహ్వానించింది. వారి మాటలు, ఊసులు, బాసలు ఏకమయ్యాయి. వారి చిత్తమూ, మనసూ, సంకల్పమూ ఒకటే. కృష్ణుని దయకు ఆది, అంతాలు లేవు. స్నేహమంటే అత్యంత సన్నిహితమని ఆచరించి చూపాడు. శ్రీకైవల్యాన్ని కుబ్జ చేరుకుంది. అందుకు ఆమె ఆత్మమగ్నత, అంతర్ముఖీనతలే అర్హతలు.

# కైంకర్యమే.. తనువు దాల్చితే....

43

– డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478



**( కంబర్ మహాశయుడు నమ్మాళ్వార్ల దివ్యప్రభావాన్ని స్తుతించారు. ఇందుకు ఎంతో సంతోషపడ్డ మధురకవులు శ్రీనమ్మాళ్వార్లవారి దివ్య వైభవాన్ని, వారు అనుగ్రహించిన దివ్యప్రబంధాలను తలచుకొని మైమరచి 'కణ్ణినుణ్ శిఱుత్తామ్బినాల్' గానం చేయడం ఈ సంచికలో చదువవచ్చు.)**

**(ఎన్నప్పనిల్)–** నా స్వామి అయిన శ్రీకృష్ణుని విడచి– అని అర్థం. ఆళ్వార్ల పట్లనే లగ్నమైన వీరిని (మధురకవులను) కూడ శ్రీకృష్ణుని లీలలు అభినివేశాన్ని పొందించినందున "అప్పనిల్" అని అంటున్నారు. నమ్మాళ్వార్లు లేతమనస్సు కలవారైనందున, భగవానుని సౌలభ్య ప్రకాశకమైన లీలలో లగ్నమై, మోహాన్ని పొందారు. వీరు ఆ విధంగా లేతమనస్సును కలవారు కానందున, ప్రథమ పర్వమైన శ్రీకృష్ణుణ్ణి విడచి, చరమపర్వమైన నమ్మాళ్వార్ల వద్దకు వచ్చారు.

**(ఎన్ అప్పనిల్ నణ్ణి)–** శ్రీకృష్ణుని విడచి, ఆళ్వార్లను ఆశ్రయించి–అని అర్థం. భగవానునకు గల వైలక్షణ్యం (ఆశ్రితులను) శబ్దాదిలౌకికవిషయాలలోని అభిరుచిని లేకుండా చేసి, ఆస్వామిపట్ల అభినివేశాన్ని పొందేటట్లు చేస్తుంది. ఆళ్వార్లకు గల వైలక్షణ్యం– భగవానుని విషయం లోని మాధుర్యంనుండి నివర్తింపజేసి, తన పట్ల ఆసక్తిని కల్గి ఉండేటట్లు చేస్తుంది. అందువల్ల ఆళ్వార్ల వైలక్షణ్యమే గొప్పది– అని భావం.

**(తెన్ కురుకూర్ నమ్బి ఎన్టక్కాల్ అణ్ణిక్కుమ్)–** **"కుఱుఙ్గుడినమ్బి"** కంటే **"కురుకూర్ నమ్బి"**కి గల అతి శయాన్ని ఈప్రయోగం వ్యక్తం చేస్తున్నది. భగవానునకు పూర్ణత– జ్ఞానం, శక్తి మొదలైనవానితో కల్గింది. లోకాన్ని తన వశం చేసికొనే గుణాలు– భగవానునిగుణాలు. భగ వానుని తన వశం చేసే రీతిలోనివి– ఆళ్వార్లగుణాలు.

**(అణ్ణిక్కుమ్ అముదూఱుమ్ ఎన్ నావుక్కే)–** ఆళ్వార్లను తలచిన మనస్సులోని మాధుర్యాన్ని మొదటి పదం తెల్పుతోంది. వారి నామాన్ని పల్కిన జిహ్వకూడ మధురమై ఉండే విషయాన్ని రెండవ పదం తెల్పుతోంది.

**(ఎన్టక్కాల్ అముదూఱుమ్) –** పల్కినది ఒక్కసారి మాత్రమే అయినా, ఆనందం పొందింది అన్ని కాలాలలోను. ఇక భగవద్విషయాన్ని గూర్చి భావించడానికి మనస్సు అనేది లేదు; పలుకడానికి జిహ్వ లేదు.

**(ఎన్ నావుక్కే)–** భగవద్విషయం భోగ్యంగా, ఆళ్వార్లు కూడా భోగ్యంగా ఉండే మీ నాలుక (లోకంలోని వారి నాలుక) వంటిది కాదు కదా, నా జిహ్వ. ప్రారంభం నుండి ఆళ్వార్లభోగ్యతలో ప్రవర్తించి, అలవాటుపడ్డ జిహ్వ కదా, నాజిహ్వ.

**(ఎన్ నావుక్కే)–** ఆళ్వార్లవిషయంలో అభినివేశాన్ని పొందడంలో నా జిహ్వ మొదలైన ఇంద్రియాలకు, వాటిని కల్గిన నాకు తేడా లేదు. ఆళ్వార్లు, భగవద్విషయాన్నిగూర్చి **"ఎన్ నెఞ్జినాల్ నోక్కి క్కాణీర్"** (తిరువాయ్–5–5–2) (నా మనస్సుతో గమనించి చూడండి) అని అన్నారు. అదే రీతిలో వీరు, ఆళ్వార్లవిషయంలో **"ఎన్ నావుక్కే"** (నా జిహ్వకు) అని అన్నారు.

***(ఇంకా ఉంది)***

# తి.తి.దే. ఆలయాల ప్యాకేజి టూర్





### ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్

## 1. స్థానిక ఆలయాలు (ప్రతి రోజు)

| టిక్కెట్టు ధర | బస్సు బయలుదేరు స్థలం | ట్రిప్పులు | బయలుదేరు సమయం |
|---|---|---|---|
| నాన్ ఎ.సి. రూ. 100/-<br>ఎ.సి.రూ. 150/-<br>(10 సం॥లోపు పిల్లలకు టిక్కెట్టు అవసరం లేదు) | శ్రీనివాసం కాంప్లెక్స్ మరియు విష్ణు నివాసం తిరుపతి | 6 (ఆరు) | ఉదయం 6.00 నుండి మ॥ 1.00 గం॥లవరకు |

### చూపబడు ఆలయములు

1) శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయం --- తిరుచానూరు
2) శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయం --- తొండవాడ
3) శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం --- శ్రీనివాసమంగాపురం
4) శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయం --- తిరుపతి
5) శ్రీ గోవిందరాజస్వామి ఆలయం --- తిరుపతి

## 2. సమీప ఆలయాలు (ప్రతి రోజు)

| టిక్కెట్టు ధర | బస్సు బయలుదేరు స్థలం | ట్రిప్పులు | బయలుదేరు సమయం |
|---|---|---|---|
| నాన్ ఎ.సి. రూ. 250/-<br>ఎ.సి.రూ. 350/-<br>(10 సం॥లోపు పిల్లలకు టిక్కెట్టు అవసరం లేదు) | శ్రీనివాసం కాంప్లెక్స్ మరియు విష్ణు నివాసం తిరుపతి | 2 (రెండు) | ఉదయం 8.00 గంటలకు మరియు ఉదయం 9.00 గంటలకు |

### చూపబడు ఆలయములు

1) శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం --- కార్వేటి నగరం
2) శ్రీ వేదనారాయణస్వామి ఆలయం --- నాగలాపురం
3) శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయం --- నారాయణవనం
4) శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం --- అప్పలాయగుంట
5) శ్రీ కరియమాణిక్యస్వామి ఆలయం --- నగరి
6) శ్రీ అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం --- బుగ్గ
7) శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయం --- సురుటుపల్లి

**ఇతర వివరాలకు**

**0877 - 2289123, 2289120/121, 9848007033**

# నల్లగుట్ట శ్రీకూర్మనాథస్వామిక్షేత్రం

*– శ్రీ ఎ.జి.నరేష్, 98494 17794*

జాతకరీత్యా నాగదోషాలు, కాలసర్పదోషాలు, రాహుకేతుదోషాలు వీటివల్ల పెళ్లికాకపోవడం, ఆలస్యం కావడం, లేదా సంతానం కలగకపోవడం అనారోగ్యం వంటి దోషాల పరిహారార్థమై వెలసిన దివ్యమైన భవ్యమైన క్షేత్రం **నల్లగుట్ట శ్రీకూర్మనాథస్వామిక్షేత్రం.**

కేవలం దర్శనం మాత్రం చేతనే, గిరిప్రదక్షిణంతోనే సమస్త మానసిక, శారీరక రుగ్మతల్ని పోగొట్టి కుటుంబపర మైన శారీరకమైన అన్ని కోరికలను తీరుస్తున్న దివ్యక్షేత్రం **నల్లగుట్ట శ్రీకూర్మనాథస్వామి వారి గుహాలయం.** అద్భుతమైన ఈ పుణ్యక్షేత్రంలో మహామృత్యుంజయమంత్రాన్ని జపిస్తే చాలు, అపమృత్యుదోషం తొలగడమేగాక సంపూర్ణమైన ఆరోగ్యవంతులవుతారని ప్రశస్తి.

**ఇన్ని విధాలుగా పేరు పొందిన ఈ క్షేత్రం కర్నూలు జిల్లా ఆదోనితాలుకా ఆస్పరిమండల కేంద్రానికి కేవలం నాలుగైదు కిలోమీటర్ల దూరంలో అత్యంతప్రకృతి రమణీ యంగా వెలసి ఉంది. ఆస్పరి నుంచి నిరంతరం ఆటో సౌకర్యం ఉంది.**

ఎప్పుడో కృతయుగంలో దేవదానవులు అమృతం కోసం క్షీరసముద్రాన్ని మథించారని పురాణకథనం కదా! అందుకోసం మందరపర్వతం కవ్వంగా, వాసుకి అనే మహాసర్పం తాడుగా, వీటికి సముద్రం అట్ట అడుగున కుదురుగా శ్రీమహావిష్ణువు మహా కూర్మంగా మారగా, సముద్ర మథనం జరిగింది. ఆ సందర్భంలో హాలాహలం అనే మహాకాలకూట విషం ఆవిర్భవించింది. దాన్ని పరమేశ్వరుడు జవురుకొని నోటిద్వారా తాగి కంఠంలో ఉంచుకొని లోకా లను రక్షించాడు. ఆ తర్వాత వరుసగా ఉచ్చైశ్రవం, ఐరా వతం, కల్పవృక్షం, కామధేనువు, శ్రీమహాలక్ష్మి.... ఇలా ఎన్నెన్నో ఆ సముద్రం నుండి ఆవిర్భవించగా వాటిని ఇంద్రాది దేవతలు పంచుకొన్నారు. చిట్టచివరగా అమృతంతో నిండి ఉన్న కలశం అశ్చర్యంగా సముద్రం నుండి బయటికి వచ్చింది. అది **'మాది, మాది'** అంటూ దేవదానవులిద్దరూ వాదులాడుకొన్నారు, గింజకున్నారు, ఎట్లాగైతేనేమి రాక్షసులు ఆ అమృతకలశాన్ని తమ వశం చేసుకొన్నారు. అయితే ఆ రక్కసులు దానికోసం తమలో తామే కొట్లాడుతుండినారు. ఇంతలో మహావిష్ణువు జగన్మోహనాకారమైన తన అందంతో అందరినీ భ్రమింపజేస్తూ అవతరించి, చాకచక్యంగా అమృత కలశాన్ని తనవశం చేసుకొన్నాడు. సమ్మోహనకరమైన స్త్రీవేషంలో ఉన్న మహావిష్ణువు సౌందర్యానికి ఆకర్షితులైన రాక్షసులు అమృతాన్ని మరచి ఆమెకోసం వెంటపడ్డారు.

**2019 డిసెంబరు, 26న సూర్యగ్రహణం సందర్భంగా..**

ఆ జగన్మోహిని, అమృతాన్ని తానే పంచుతానని, దేవతలను, రాక్షసులను రెండువరుసలుగా కూర్చోబెట్టి మాయతో దేవతలకు పంచుతుండింది. ఈ కార్యాన్ని పసి గట్టిన 'స్వర్భాను' అనే రాక్షసుడు మారురూపంతో దేవతల్లో చేరి ఆ అమృతాన్ని స్వీకరించాడు. దీన్ని గమనించిన సూర్య చంద్రులు జగన్మోహినికి సైగ చేశారు. వెంటనే మోహిని రూపంలో ఉన్న విష్ణువు ప్రత్యక్షమై తన సుదర్శనచక్రంతో ఆ 'స్వర్భాను' రాక్షసుని తలను ఖండించాడు. కాని అప్పటికే అమృతం మింగిన కారణంగా ఆ రాక్షసుని తల, మొండెం తెగి వేరుగా అయినప్పటికీ, రెండూ బ్రతికి అమర త్వాన్ని పొందాయి. వాటిల్లో తలభాగాన్ని 'రాహువు' గాను, మొండెం భాగాన్ని 'కేతువు'గాను. నవ గ్రహాల్లో స్థానం కల్పించాడు బ్రహ్మదేవుడు. కేవలం ఛాయాగ్రహాలుగా స్థానం పొందిన ఈ గ్రహాలబాధ ఆనాటి నుంచి, కేవలం మానవుల్నే గాక, సూర్యచంద్రులనూ కూడ గ్రహణాల రూపంలో బాధపెడుతూనే ఉన్నాయి.

ఆ తర్వాతికాలంలో నాగుల తల్లి "కద్రువ" గరుత్మం తునిచే వధింపబడిన తన సంతానం తోకభాగాన్ని రాహువు

నకు, తలభాగాన్ని కేతువునకు దానం చేయడంద్వారా వాటికి పరిపూర్ణమైన రూపాన్ని ప్రసాదించింది. అందువల్ల తన సంతానమైన నాగులకు అమృతత్వాన్ని సిద్ధింపజేసుకొంది నాగమాత కద్రువ. ఆనాటినుండి రాహు కేతు దోషాలు ఉన్నవారు నాగారాధన చెయ్యాలనీ, అలాగే నాగదోషం, కాలసర్పదోషం ఉన్నవారు రాహుకేతుపూజలు చేసుకోవాలన్నది శాస్త్రవిధిగా; నియమంగా ఏర్పడిందన్నది జ్యోతిశ్శాస్త్రపండితుల కథనం కూడా! మరి ఇన్నిన్ని పౌరాణిక ఘట్టాలను, ఒకేచోట కలబోసుకొని రూపుదాల్చిన దివ్యక్షేత్రం **నల్లగుట్ట శ్రీకూర్మనాథస్వామి క్షేత్రం.**

ఎప్పుడో ఏనాడో మందరపర్వతం ఘనీభవించి పర్వతంలాగా రూపుదాల్చగా, దానికి చుట్టుకొన్న వాసుకి మహాసర్పం శిలారూపంలో సుమారు కిలోమీటరు పొడవు, పరిథిలో వ్యాపించి సర్పాకారాంలోనే దర్శమివ్వడం పరమాద్భుతం! ఆ మందరపర్వతం కింద ఉన్న గుహాలయంలో, శ్రీమహావిష్ణువు శ్రీకూర్మ(తాబేలు)నాథస్వామి దివ్యశిలా రూపంలో అర్చనలందుకొంటున్నాడు. సుమారు కిలోమీటరు పొడవున వ్యాపించివున్న వాసుకిసర్పంలాంటి పర్వతంపైన, బృహదాకారంలో ఆనాడు ఉద్భవించిన అమృతకలశం నేటికీ దర్శమిస్తూ అందరికీ అమృత ఫలాలను అందజేస్తుండడం అనుభవైకవేద్యం. ఇదిగాక ఆ పర్వత గుహాలయంలో శ్రీకూర్మనాథస్వామివారితోపాటు, ఆనాడు కాలకూటవిషాన్ని మింగిన పరమేశ్వరుని "శివలింగం", పెద్ద నాగులపుట్ట వెలసివుండడం కూడ మహిమాన్వితక్షేత్రంగా విరాజిల్లుతూ ఆర్తులకు ఉపశమనం కలిగిస్తున్నది.

ఇంతేగాక, ప్రతి శనివారంనాడు **"రాహుకాలం"**లో ఉ.9 నుండి 10.30 గంటల మధ్య సుమారు ఒక కిలోమీటరుకు పైగా వ్యాపించి ఉన్న సర్పాకారపు ఈ పర్వతానికి **"గిరిప్రదక్షిణం"** అద్భుతంగా, వేడుకగా, ఉత్సవంగా నిర్వహింపబడుతుంది. వివాహం కావలసిన యువతీ, యువకులే కాకుండా, రాహుకేతు గ్రహపీడితులైన వారితోపాటు, నాగదోష, కుజదోష పీడితులు, అనేక శరీరరుగ్మతలు ఉన్నవారు కూడా ఈ గిరిప్రదక్షిణం కార్యక్రమంలో భక్తిప్రపత్తులతో పాల్గొంటారు. కేవలం ఒకే ఒకగంట సమయంలో "గిరిప్రదక్షిణం" పూర్తయ్యే ఈ ఉపాసనలో భాగంగా ఆ పర్వతం చుట్టూ ఆ యా చోట్ల మొత్తం **"తొమ్మిది పెద్దనాగులపుట్టలు"** ఉన్నాయి. వాటికీ దీక్షగా పూజలు చేస్తూ, రాహుకేతువుల, నాగదోషాల విముక్తికోసం చేసే **"శ్రీకూర్మనాథస్వామి, వాసుకీ పర్వతగిరిప్రదక్షిణం"** కార్యక్రమం అత్యంత కొద్దికాలంలో ఎన్నెన్నో బాధల ఉపశమనకార్యంగా, ఉపాసనా కార్యక్రమంగా ప్రసిద్ధికెక్కింది. అంతేకాదు, ఈ దివ్యక్షేత్రానికి మరోప్రత్యేకత ఉంది. **చంద్రగ్రహణ, సూర్యగ్రహణ వేళల్లో కూడ నిరంతరం రాత్రింబవళ్ళు, ఈ గుహాలయంలో శ్రీకూర్మనాథస్వామివారికి, శివలింగానికి, నాగులపుట్టకు పూజలు జరిపించుకోవచ్చు. గ్రహణ దోషాలు ఏమాత్రం లేని అంటని మహిమాన్వితమైన అద్భుతక్షేత్రం శ్రీకూర్మనాథస్వామి గుహాలయం దివ్యక్షేత్రం.**

ఈ క్షేత్రమహిమను గూర్చి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఎన్నో మందులూ, మాకులు వాడుతూ, ఎన్నెన్నో పూజలు చేసినా ఫలితం లేనందువల్ల విసిగి వేసారిపోయిన ఆర్తులు అందరూ ఒక్కసారి కేవలం ప్రతి శనివారం ఉదయంపూట జరిగే **గిరిప్రదక్షిణంలో, ఆదివారంనాడు** లేదా **గ్రహణ సమయాల్లో** ఆ యా నక్షత్రాల, రాసులవాండ్లు ఈ క్షేత్రాన్ని ఒక్కసారి దర్శించండి. కేవలం ఒకే గంట సమయంలో సులభంగా ఉపాసన చేసుకొనగల ఈ క్షేత్రాన్ని దర్శించండి. ఫలితాలను పొందండి. **శనివారం నాటి గిరిప్రదక్షిణ సమయంలోనూ, గ్రహణసమయాల్లోను, వైకుంఠ ఏకాదశివంటి పండుగ దినాల్లోను భక్తులకు క్షేత్రనిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేస్తారు.**

ఒక్కసారి కేవలం దర్శనం మాత్రం చేతనే, ఒకే ఒక గంట గిరిప్రదక్షిణంతోనే కోరికలు సిద్ధించే నల్లగుట్ట శ్రీకూర్మనాథస్వామివారి గుహాలయక్షేత్రాన్ని ఆర్తులైన భక్తులందరూ దర్శించండి. కేవలం తెలుగువారే కాక, కర్నాటక, తమిళనాడు నుండి భక్తులు వస్తున్న ఈ క్షేత్రం ఇప్పుడిప్పుడే అత్యంతప్రచారాన్ని పొందుతున్నది.

*ఓం శ్రీకూర్మనాథాయ నమః*




# చెడనీక బ్రతికించే... సిద్ధమంత్రమా!

– శ్రీమతి వి. ఉమారాణి

మొన్న మొన్న ఏప్రియల్ మాసం వరకు వాసంత సమీరం మోసుకువచ్చే మల్లెపూల సౌరభాన్ని ఆఘ్రాణిస్తూ తిరుపతి రోడ్లపై మణికిరీటం లేని మహరాజు లాగ హాయిగా తిరిగారు మా శ్రీవారు. మండుటెండలో కొత్త రంగులను సంతరించుకున్న ఏడుకొండల అందాలను చూసి ఎంతో ఆనందించేవారు. మా ఇంటికి ఎదురుగా ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని గంటలు వినిపించే నాదాలతో సమ్మిళితం చెంది, వీనులవిందుగా వినిపించే శ్రీరంగం గోపాలరత్నంగారి "ఒక పిలుపులో పిలిచితే పలుకుతావట" పాటతో మనసు పరవశిస్తుంటే ఆయనను ఆయనే మరచిపోయేవారు. ఆ మనోహర దృశ్యాలు ఇంకా నా కనులలో తడి ఆరని జ్ఞాపకాలుగానే ఉన్నాయి. ఇంతలో అకస్మాత్తుగా విధి మా ముంగిట కరాళ నృత్యం చేసింది.

మావారికి రోడ్డు ప్రమాదం సంభవించింది. రెప్పపాటులో జరిగిపోయిన యాక్సిడెంట్ ఏం జరిగిందో అర్థమైయ్యేలోపు మావారి చేతి ఎముక విరిగి, చెదిరి ఆసుపత్రి బెడ్ మీద అచేతనంగా మిగిలారు.

మన జీవితాల్లో యాక్సిడెంట్లు ఎప్పుడెప్పుడు తప్పిపోయాయో చెప్పడం బ్రహ్మతరం కూడా కాదంటారు. తప్పిపోనప్పుడేకదా ఎత్తులకు ఎగిరే చైతన్యం, మట్టిలోతుల్లోకి చొచ్చే ఉత్సాహం చచ్చుబడి, ఇలా ఆసుపత్రి పడకల త్రిశంకునరకం పాల్పడతాము. అసలు యాక్సిడెంటు అంటే, కాలపుపొదలో పొంచి అడివి ఎలుగువంటి విధి మనమీద క్రూరాతిక్రూరంగా దాడిచేయడమేనా? చూస్తూండగానే ఉక్కుముక్క అని భ్రమింపచేసిన దేహం పటుత్వం తప్పి కదలికలను కట్టడిచేయడమేనా? చూస్తూండగానే కనీస పలకరింపు కూడా కరవయ్యే అస్తిత్వం మరింతగా భయపెట్టడమేనా? మరణం కన్నా ఎక్కువగా భయపట్టేది జీవితమేనని గుర్తుచేసేది బహుశా ఇటువంటి యాక్సిడెంటేనేమో?

సాధారణంగా ఒక మనిషి రోడ్డు ప్రమాదానికి గురైయితే, కేవలం ఆ మనిషిమాత్రమే రోడ్డునపడ్డట్టుకాదు అతని కుటుంబమే రోడ్డునపడ్డట్టు.

ఏ చేయూత లేనప్పుడు, నాలుగు సానుభూతి మాటలు కూడా కరవైపోయినప్పుడు, ఆ మరణం కన్నా ఎక్కువ భయపెట్టేది జీవితమేనని మరింత అర్థమౌతుందేమో? ఎముకస్థానే వేసిన స్టీలు రాడ్ చుట్టూ ఇన్ఫెక్షన్ సోకి చికిత్స వికటించి, వ్రణం రేగి, జబ్బు తిరగబెట్టి మళ్లీ మావారు మంచాన పడినప్పుడు జీవితగుమ్మానికి కాలం కట్టిన మామిడితోరణం ఎండుటాకులు గలగలలాడిన చప్పుడు కర్ణకఠోరంగా వినిపించింది.

చావు–పుట్టుక–బతుకు–చావు విషమబాహు త్రిభుజంలో మధ్యలో మావారి మూలుగు నాకు మాత్రమే వినిపిస్తున్న ఏకాకితనానికి చిక్కి, సుక్కి ఉన్న నిస్సహాయస్థితి నాది. ఆయనేమో నెప్పితో అల్లాడిపోతున్నారు. నాకేమి చేయాలో పాలుపోలేదు. ఆ సమయంలో నేనెవరిని ఆశ్రయించాలి.. ఒక్క ఏడు కొండలవాడే నా మదిలో మెదిలాడు. కోరినవరాలిచ్చే కొండలరాయడే నాకు శరణ్యమయ్యాడు. దీనుల పాలిట దిక్కై నిలిచే ఆ ఆశ్రితచింతామణికి ముడుపు కట్టాను. నా మాంగల్యానికి నీవు వినా రక్ష ఎవరయ్యా? అని స్వామి వారిని గట్టిగానే నిలవేశాను.. స్వామి నమ్మిన వారిని మోసం చేస్తాడా? చేయడు. దైవం మానుష రూపేణా అని మంత్రం వేసినట్టు డా॥ సి.మురహరి (ఎలైట్ ఆసుపత్రి,

తిరుపతి) గారిని మాకు చూపించాడు ఆ ఏడుకొండలవాడు. ఆ మహానుభావుడు మా వారికి ఆపరేషన్ చేసి కాస్త ఊరట కలిగించాడు. తాత్కాలికంగా మాకు తెరపి కలిగించి కోయం బత్తూరులోని గంగ ఆసుపత్రికి వెళ్లమని సలహా ఇచ్చాడు.

మా జీవితకథలో ఈ విషాదసన్నివేశం తాలూకు నేపథ్యదృశ్యం ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర సరిహద్దులు దాటి, తమిళ నాడు- కేరళ రాష్ట్రాల సరిహద్దులకు మారింది. కోయం బత్తూరుకు మా వారిని తీసుకుని ఒంటరిగా బయలుదేరాను. నాకెవరు ఇచ్చారు ఈ ధైర్యాన్ని.. ఒక్క ఆశ్రితవత్సలుడైన ఆ శ్రీనివాసుడు తప్ప! నాకే కాదు మా ఆయనకు కూడా ఆయనే రక్షగా నిలిచాడేమోనని పిస్తుంది.. లేకుంటే చిన్న రొంప చేస్తేనే మిన్నూమన్నూ ఏకమయ్యేలా గోల చేసే ఆయన ఆ దీనవరదుడి కృప ఉంది కనుకనే అంతటి విషాదాన్ని భరించేసాడనిపిస్తుంది.

ఆయనను ఆ వేంకటేశ్వర స్వామే డాక్టర్ల రూపంలో వచ్చి కాచి రక్షించాడు. డా॥ దీనదయాళ్, డా॥ హరివెంకట రమణిగార్లు ఆయనకు ఆపరేషన్ చేసి పునర్జీవితాన్ని ప్రసాదించారు.. ఆపరేషన్ దాదాపు తొమ్మిది గంటల పాటూ జరిగింది. ఆసమయంలో నేను, మా అత్తగారు తప్ప మరెవరూ మా చెంత లేరు. ఆయన ఆపరేషన్ థియే టర్లో, మేము బయట.. ఆ సమయంలో ఆయనకు మత్తు ఇంజెక్షను ఇస్తారు గనుక ఆయన ప్రపంచంలో మేమెవ్వరం లేము. స్నేహితులు, బంధువులు అందరూ ఆ సందర్భంలో స్మృతిఫలకం మీద చెరిగిపోయిన బొమ్మలు. ఆయనక్కడ ఐ.సీ.యు.లో, అకస్మాత్తుగా ఆయన సృష్టించుకున్న కొత్త ప్రపంచంలో ఆయనకేమి జరుగుతున్నదో తెలీని స్థితిలో ఆయనున్నారు. నేను అక్కడ ఒంటిస్తంభపుమేడవంటి నిశ్శబ్దపు గదిలో.. నాకేమి జరుగుతున్నదో అర్థం కాని దశలో నేను... రెండువెలుగులు ఉన్నట్టుండి రెండు చీకట్లుగా మారిపోయిన ఘోరసందర్భం అది.

పిట్ట మాత్రమే కాదు, ఉరకలెత్తే వాగు కూడా చిక్కుతుంది వేటగాడి వలలో... ఎంత తన్నుకులాడినా, ఎంత విలవిలలాడినా, ఎంత దీనంగా మా వారు తడి చూపులు చూసినా.. నాకు అది రంపపుకోత. గాఢాంధ కారపు ఇనుపదారాలలో చిక్కుబడిపోయి ఒకచుక్క కాంతి కోసం దిక్కులన్నీ తడుముకుంటున్నాను నేను. ఆ చీకట్లో కంటికి వెలుగు శ్రీనివాసుడే! నా మొర ఆలకించాడేమో! డా॥ సుస్మిత్(బర్డ్), డా॥ నీరజ్(గంగ ఆసుపత్రి)ల రూపంలో కనిపించాడు. దారీ తెన్నూ తెలీక దిక్కుతోచనిపరిస్థితిలో ఉన్న మావారికి చక్కటి వైద్యం అందించి 'వైద్యో నారాయణో హరిః' అన్న సూక్తిని సార్థకం చేశారు ఈ ఇరువురు డాక్టర్లు. ఇప్పటికీ మావారు వారిద్దరినీ పదే పదే కలవరించుకుంటుం టారు. ఏదైనా ఒక ప్రమాదం మనిషి శరీరాన్ని ఎంత బాధకు గురి చేస్తుందో, అంతకుమించిన మానసిక వ్యథను రగులుస్తుంది.

ప్రమాదానంతరం మనుషులకు తటస్థించే వేదన అనేకదుష్ఫలితాలకు దారితీస్తుంది. ఇందుకు ఉదాహరణ మావారే! ఆసుపత్రి జీవితం ఏనాడూలేని విధంగా ఆయనలో డిప్రెషనుకు ఆజ్యంపోసింది. ఫలితంగా ఆయనలో ఏవో వెర్రి ఆలోచనలు. జీవితపరమార్థం ఏమిటి? ఈ బ్రతుకు ఎవరికిని ఉద్ధరించడానికి-ఇలా ఎన్నో రకాల ప్రశ్నలు ఆయన నాకు వేసేవారు. ఈ సన్నివేశం రాత్రివేళ్లలో నాకంటికి కునుకును కరవుచేశాయి. వారి డిప్రెషన్‌ను పోగొట్టే గోసాయిచిట్కాలు ఏమున్నాయి? వాటిని నాకు ఎవరు సూచిస్తారు? వారిని మనోవ్యాధినుండి ఎలా బయట పడవేయాలి? నెలలతరబడి మంచానికే పరిమితమవడం, ప్రసారమాధ్యమాలకు దూరంకావడం, చదవడం, రాయడం వంటి ఇష్టమైన పనులకు చెల్లుచీటీ వ్రాయడం, సెల్‌ఫోను వాడకానికి చెయ్యి సహకరించకపోవడం వంటి పలు కారణాలవల్ల ఆయనది సమూహంలో ఏకాకి జీవితంగా మారింది. నడిసంద్రంలో నావలా చిక్కుకున్న మా బ్రతుకు నావను సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరుడే అనేకమంది డాక్టర్ల రూపంలో అవతరించి ఒడ్డుకుచేర్చాడు. ఇంకా చెప్పాలంటే, మావారికి వైద్యం చేసిన డాక్టర్లందరిపేర్లు స్వామివారి పేర్లే కావడం యాదృచ్ఛికం. దీనులను కాపాడేందుకే దీనబాంధ వుడు, ఆశ్రితవత్సలుడు అయిన అలమేలుమంగపతి ఇలపై అవతరించాడనేదే సత్యం, సత్యం, పునఃసత్యం.

ఆయుర్వేదం

# ప్రకృతికానుక - కానుగ

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

కానుగ చెట్టుకు సంస్కృతంలో కరంజ అని పేరు. ఈ చెట్టు ఆకులు నునుపుగా, మందంగా నూనె పూసినట్లు ఉండుటచే స్నిగ్ధపత్ర అనీ, గుత్తులు గుత్తులుగా ఉన్న పూలు కలిగి ఉండడం వల్ల గుచ్ఛపుష్ప అని, వీటివిత్తనాలల్లోని పప్పులో నెయ్యిని పోలిన తైలం ఉండుటచే ఘృతపూరక అని సంస్కృతం పేర్లు కూడా కలవు.

పొంగామియా గ్లాబ్ర అనే శాస్త్రీయనామాన్ని కలిగిన ఈ కానుగ పాసిలియోనేసి అనే వృక్ష కుటుంబానికి చెందింది. ఆంగ్లంలో ఇండియన్ బీచ్ అంటారు.

మన దైనందినజీవితంలో ఎదుర్కొనే వివిధరకాలైన అనారోగ్యసమస్యలకు కానుగను ఎలా సద్వినియోగం చేసుకుని, అ సమస్యల నుంచి బయటపడవచ్చో తెలుసుకుందాం!

**ముక్కు నుంచి శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటే-** కానుక విత్తులోని పప్పులను పదింటిని తీసుకొని, పై పొట్టు తీసి, ఆ పప్పులకు తగినంత నీరు చేర్చి, మెత్తగా నూరి పేస్టులా చేసి 100 మి.లీ. నెయ్యిలో కలిపి, సన్నమంటపై ఆ పేస్టు నల్లగా అయ్యేంతవరకు వేడిచేసి దించి, చల్లార్చి, వడగట్టి నిల్వ ఉంచుకుని రాత్రి పడుకొనేటప్పుడు ఒక్కొక్క ముక్కు రంధ్రంలో 3,4 చుక్కలు వేసుకుంటు ఉండాలి.

ఇలా వేసుకోవడంవల్ల ముక్కులోని కంతులు కరుగుతాయి. ముక్కులోపలి భాగం ఎండినట్టు ఉండటం, ముక్కు దిబ్బడకూడా తగ్గుతాయి. శ్వాస బాగా తీసుకోగలిగే పరిస్థితి కలుగుతుంది.

**మొలలవ్యాధి (పైల్స్ లేదా మూలశంక)-** రోజూ రెండు పూటలా ఐదు, ఆరు కానుగ లేతచిగుళ్లను మెత్తగా నూరి, 100 మి.లీ. తాజామజ్జిగలో కలిపి తీసుకోవాలి.

లేదా 25 గ్రాముల కానుగ పప్పుచూర్ణాన్ని, 50 గ్రాముల పటికబెల్లం పొడిలో కలిపి నిల్వ ఉంచుకొని రోజూ పరగడుపున 100 మి.లీ. నీటిలో 2-3 గ్రాముల పొడిని కలిపి సేవిస్తు ఉండాలి.

పై పూత మందుగా రోజూ రాత్రి పూట కానుగ లేత ఆకులను 2, 3 తీసుకుని కొద్దిగా ఆముదం చేర్చి మెత్తగా నూరి, వెచ్చగా చేసి, మూలవ్యాధి పిలకలపై పెట్టి కట్టుకట్టి, ఉదయం తీసేస్తుండాలి.





ఆసక్తి కల్గినవారు తిరుమలలో 'శ్రీవారిసేవ'లో పాల్గొనవచ్చు

**తేలు కాటుకు-** కానుగపప్పు, పటిక సమానంగా కలిపి, నీరు చేర్చి, మెత్తగా నూరి, తేలు కుట్టిన ప్రాంతంలో దట్టంగా పూస్తే శీఘ్రంగా మంట, పోటు, బాధ లాంటివి తగ్గిపోతాయి.

**శరీరదుర్గంధం తగ్గేందుకు-** 50 గ్రాముల చొప్పున కానుక పప్పు, చింతపండు గుజ్జు తీసుకొని రెండింటినీ కలిపి, మెత్తగా నూరి ఒంటికి పట్టించి, అరగంట లేదా గంటసేపు తరువాత స్నానం చేస్తూ ఉండాలి.

**అతిమూత్రవ్యాధికి-** బాగా ఎండించిన కానుగపూలను మెత్తగా చూర్ణం చేసి, జల్లించి నిల్వ ఉంచుకొని, రోజూ రెండు పూటలా పూటకు 2-3 గ్రాముల పొడిని 100 మి.లీ. గోరువెచ్చని నీటిలో కలిపి సేవిస్తూండాలి.

**సోరియాసిస్ అనే చర్మవ్యాధి తగ్గేందుకు-** రోజూ ఒకసారి 200 మి.లీ. నీటిలో 2-3 గ్రాముల కానుగపప్పు పొడి, 2-3 గ్రాముల తాటి కలకండ కలిపి 100 మి.లీ. నీరు మిగిలేలా మరిగించి, దించి, చల్లార్చి, వడగట్టి సేవిస్తూ సోరియాసిస్ అనే చర్మవ్యాధి తగ్గటమే కాక, సోరియాసిస్ వల్ల వచ్చే సోరియాటిక్ అర్థరైటిస్ అనే కీళ్ళ నొప్పుల సమస్య కూడా తగ్గుతుంది. తగినంత కానుగపప్పును తగినంత నీరు లేదా నిమ్మరసం లేదా చాల్‌మొగ్రా ఆయిల్ కలిపి మెత్తగా నూరి, పూస్తుంటే సోరియాసిస్ తగ్గటమే కాక గజ్జి, తామర, ఎగ్జిమా, సిబ్బెం లాంటి చర్మవ్యాధులూ తగ్గుతాయి.

**జ్వరాలకు-** కానుగపప్పు పొడి 20 గ్రాములు, పిప్పళ్ల చూర్ణం 20 గ్రాములు, తుమ్మ జిగురు 10 గ్రాములు కలిపి, తగినంత నీటితో మెత్తగా నూరి శనగలంత మాత్రలు చేసి, ఆరించి రోజు 2,3 సార్లు పూటకు ఒక్కొక్క మాత్ర చొప్పున గోరువెచ్చనినీటితో సేవిస్తుంటే అతిత్వరలో వివిధరకాలైన తరుణ, దీర్ఘకాలిక జ్వరాలు తగ్గుతాయి.

**జలుబు, దగ్గు లాంటి శ్లేష్మ వ్యాధులకు-** కానుగ చెట్టు కాండాన్ని బాగా ఎండించి కాల్చి, బూడిద చేసి, చల్లార్చి, జల్లించి ఉంచుకుని రోజూ రెండుపూటలా-పూటకు 1-2 గ్రాముల భస్మాన్ని 10 మి.లీ. అల్లం రసం లేదా తగినంత తేనె కలిపి సేవిస్తుండాలి. అందువల్ల జలుబు, దగ్గు, గొంతులో గరగర, ఆయాసం, గురకలాంటి శ్లేష్మవ్యాధులు తగ్గుతాయి.

జాత్యాదిఘృతం, కరంజాదిఘృతం, బిల్వాదిగుటిక మొదలగు ఆయుర్వేదఔషధాల తయారీలో కూడా ఈ కానుగను ఉపయోగిస్తారు.

**తమకు కష్టం వస్తే కష్టాలు**
**మంచివాళ్లకే వస్తాయి అంటారు తప్ప**
**తాము ఏమైనా పాపం చేశామేమో అనుకోరు!**

**అదే కష్టాలు ఎదుటివారికి వస్తే-**
**చేసిన పాపాలు ఊరకేపోతాయా? అని అంటారు.**

**తమ కష్టానికి కారణాన్ని తెలుసుకుని,**
**ఎదుటివారి కష్టాన్ని సానుభూతితో..**
**అర్థం చేసుకునే వారే**
**నిజమైన మనుషులు!**

## వైకుంఠపాళి
### :: 48- సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| [1] వై | ■ | [2] బృం | దా | [3] వ | న | [4] ము | ■ | [5] జ |
| వ | ■ | ద | ■ | ణి | ■ | క్తి | ■ | య |
| [6] స్వ | ని | ■ | [7] అ | జు | డు | ■ | [8] అ | దే |
| త | ■ | [9] దుః | ■ | డు | ■ | [10] గో | ■ | వ |
| [11] మ | యూ | ఖ | ము | ■ | [12] మీ | స | ము | ■ |
| న్వం | ■ | ము | ■ | [13] అ | ■ | ము | ■ | [14] శ |
| [15] త | పం | ■ | [16] అ | శ్వ | ము | ■ | [17] తా | ర |
| ర | ■ | [18] పా | ■ | త్థ | ■ | [19] పం | ■ | దృ |
| ము | ■ | [20] పి | తా | మ | హు | డు | ■ | తు |

## నేనే నేనే అరుణాచలం
### (గేయములు)

రచన - ఒక రమణ భక్తుడు,
ఆకృతి- 1/8 డెమ్మి, పుటలు- 70,
వెల-రూ60/-,
ప్రతులకు - డా॥ దోనెపూడి నరేష్‌బాబు,
శ్రీషిర్డీసాయిబాబా దేవాలయము,
జూతేపల్లి (గ్రా), గోస్పాడు (మ),
కర్నూలు జిల్లా-518 674.

తమిళనాడు రాష్ట్రంలోని తిరువణ్ణా మలైలో ఆశ్రమం స్థాపించి అక్కడే కాలధర్మం చెందిన శ్రీరమణమహర్షి ఎన్నో ఆధ్యాత్మిక బోధనలు చేశాడు. వాటిలో కొన్నిటిని ఎన్నుకొని ఒక రమణభక్తుడు గేయరూపంలో రాశాడు. ఇందులో 108 గేయాలున్నాయి. అవి పాడుకొనుటకు అనువుగా ఉన్నాయి. ఈ గ్రంథంలో రమణతత్త్వమననం, రమణశరణం, రమణ నిధి ధ్యాసనం, రమణ చతుస్సూత్రి, ఆత్మసంవాదాలు, రమణ తత్త్వసారం, ప్రత్యుత్తరాలు వంటి అంశాలు గేయరూపంలో చెప్పబడ్డాయి. రమణ భక్తులకు ఈ గ్రంథం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందనవచ్చు.

- డా॥ డి.మస్తానమ్మ.

---

## కలియుగదైవం- శ్రీవేంకటేశ్వరస్వామి
### (శ్రీవారి సంపూర్ణ చరితము)

రచయిత-డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు,
ఆకృతి-1/8 డెమ్మీ, పుటలు-470;
వెల-రూ.299/-,
ప్రాప్తిస్థానం- శ్రీవిజయలక్ష్మి పబ్లికేషన్స్,
ఇ.నెం.28-20-8/1, జాని వీధి,
అరండల్ పేట, విజయవాడ-520002.
సెల్-98482 82647

బ్రహ్మాండంలో వేంకటాద్రికి సాటి వచ్చే స్థానం లేదు. ఇది అక్షరసత్యం.

శ్రీరమేష్‌బాబుగారు గొప్ప ఆధ్యాత్మిక విదులు. వీరు శ్రీస్వామివారిచరిత్రను సరళవచనంలో రాశారు. ఆ దేవదేవునికి సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా వివరిస్తూ చక్కగా రాశారు. స్వామిచరిత్రను వివిధవ్యాసాల్లో వివరించారు. ఈ గ్రంథానికి 'కలియుగదైవం- శ్రీవేంకటేశ్వరస్వామి' అనే పేరు పెట్టారు. పేరుకు తగ్గట్టుగానే ఈ గ్రంథం ఉంది. ఇందులో 30 వ్యాసాలున్నాయి.

ప్రతి వ్యాసానికి తగిన చిత్రాలను చేర్చారు. గ్రంథాంతంలో శ్రీవేంకటేశ్వర సుప్రభాతం. శ్రీవేంకటేశ్వరస్తోత్రం, శ్రీవేంకటేశ్వరప్రపత్తి, శ్రీవేంకటేశ్వర వజ్రకవచం, శ్రీవేంకటేశ్వర మంగళాశాసనం, గోదాదేవి తిరుప్పావై (తెలుగు అనువాదం), ఇంకా వివిధ దేవతా ప్రార్థన శ్లోకాలు చేర్చారు.

శ్రీవేంకటేశ్వరస్వామి వారి ముఖ చిత్రంతో ఈ గ్రంథం చాలా ఆకర్షణీయంగా ఉంది. స్వామివారి భక్తులందరి ఇళ్లలో ఉండదగిన ఒక మంచి ఆధ్యాత్మిక గ్రంథం ఇది.

- డా॥ కె.రెడ్డెప్ప.

---

## ఘంటసాల భగవద్గీత- సంగీత సౌందర్యం
### (శ్లోకాల విశ్లేషణ)

రచయిత-డా॥ఎం.పురుషోత్తమాచార్య,
ఆకృతి-1/8 డెమ్మి, పుటలు- 92,
వెల-రూ.50/-,
దొరకుచోటు-
డా॥ఎం.పురుషోత్తమాచార్య,
ఇ.నెం.516, శ్రీరామచంద్ర ఎన్‌క్లేవ్,
5వ అంతస్తు, రామగిరి,
నల్లగొండ-508001.
చరవాణి-93966 11905.

శ్రీఘంటసాలగారు స్వరపరచి ఆలపించిన భగవద్గీత శ్లోకాల్లోని 108 శ్లోకాలను ఎన్నుకొని వాటిని విశ్లేషిస్తూ చక్కని గ్రంథం రాశారు. డా॥ పురుషోత్తమాచార్యగారు. ఈ గ్రంథానికి 'ఘంటసాల భగవద్గీత - సంగీత సౌందర్యం' అనే పేరు పెట్టారు. పేరుకు తగ్గట్టుగా ఇందులో సంగీత సౌందర్యం ఉంది. రచయిత శ్లోకాన్ని ఘంటసాల గారు ఏ రాగంలో ఆలపించారో తెలిపారు. మూలశ్లోకాన్ని ఇచ్చారు. దానికి చక్కని తెలుగువచనం ఇచ్చారు. వీటన్నిటిని చక్కగా విశ్లేషించారు. ఈ విధంగా చేయడం ద్వారా భగవద్గీత మరియు ఘంటసాల ప్రాశస్త్యం ఇనుమడింపబడింది. ఇదొక నూతన ప్రయత్నం. ఈ గ్రంథం చదవడం ద్వారా పాఠకులకు సంగీత పరిజ్ఞానంతో చాటు భగవద్గీత ఔన్నత్యం కూడా బోధపడుతుంది. అర్జునునికి గీతబోధ చేస్తున్న శ్రీకృష్ణపరమాత్మ ముఖచిత్రంలో ఉన్న ఈ గ్రంథం చాలా ఆకర్షణీయంగా ఉంది. - కె.ఆర్.శ్వేత.

డిసెంబరు, 2019

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–**మనోవిచారం, అధికధనవ్యయం, తన తప్పు లేకున్నా కలహం సంభవించడం, దేశాంతరవాసం, అప్పుల వల్ల ఇబ్బందులు. సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన ఉపశమనం.



**వృషభం–**బంధుమిత్ర సమాగమం, ఉన్నత అధికారులను కలియడం, మీకృషిని వారు ప్రశంసించి, బహుమానాలు ఇవ్వడం, ధన లాభం, ధనం నిల్వచేయడం, సకలకార్యసిద్ధి, సమస్తసన్మంగళాలు కల్గడం, దూరప్రయాణాలు చేస్తారు.



**మిథునం–** వ్యవసాయదారులకు పైరుపంటలు కలసివస్తాయి. వృత్తివ్యాపారాలు కలసివస్తాయి. బంధువులనుండి శుభవార్తాశ్రవణం, కల్యాణాది శుభకార్యాలలో పాల్గొంటారు. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంవల్ల చిక్కుల నుండి ఊరట కల్గుతుంది.



**కర్కాటకం–** పంటలు కలసివస్తాయి. ఇతరులకు సమయానికి ఆసరాగా ఉంటారు. ఎంతటి కార్యాన్నైనా అవలీలగా సాధిస్తారు. ధనధాన్యలాభాలు కల్గుతాయి. జలసంబంధవృత్తులవారికి అధికాదాయం కల్గుతుంది.



**సింహం–**వృత్తివ్యాపారాలలో ఆదాయమార్గాలు పెరగటం, ధనం నిల్వచేయడం, విహార యాత్రలు, విందువినోదాలలో పాల్గొనడం, సంతానం, పరీక్షల్లో ఉత్తీర్ణులైనందున వారి విజయాలు ఆనందాన్నిస్తాయి. ఇష్టకార్యసిద్ధి.



**కన్య–**వ్యవసాయదారులకు పంటలు అనుకూలం. నూతనగృహం కొనుగోలు. గృహ నిర్మాణానికి అధిక ధనవ్యయం. ధైర్యంతో కార్యభారం మోసి, విజయంసాధిస్తారు. వస్తువాహనప్రాప్తి కలుగుతాయి.



**తుల–** వృత్తిఉద్యోగాలలో శ్రమించి, అందరి మన్ననలను అందుకుంటారు. రైతులు అధిక దిగుబడులద్వారా, పంటలవల్ల అధికలాభాలు పొందుతారు. విందువినోదాలకై అధికధన వ్యయం చేస్తారు.



**వృశ్చికం–**సమయానుకూలంగా వ్యవహరించి, విపత్తులను అరికట్టగల్గుతారు. ఇతరులతో వాక్సంయమనం పాటించడం వల్ల అనర్థాలు తొలగుతాయి. ధనలాభం వరిస్తుంది. మాసాంతంలో దుబారా ఖర్చులు తగ్గించడం మంచిది.



**ధనుస్సు–** విహారయాత్రాదుల వల్ల మన స్సౌఖ్యం, ప్రయత్నించినపనులు సత్వరమే పూర్తికావడం వల్ల ధనలాభం, అన్ని రంగాల వారికి ధనధాన్యాదుల సమృద్ధి, విదేశీప్రయాణాలు కలసివస్తాయి.



**మకరం–** ధనధాన్యవృద్ధి. సంతోషం, కీర్తి కల్గును. బంధుమిత్రులతో సంయమనం పాటించి అన్ని విషయాలలోనూ పురోగతి చెందుతారు. విదేశీప్రయాణాలు కలసివస్తాయి.



**కుంభం–** పుణ్యక్షేత్రాలసందర్శనం, సద్గోష్ఠి, ప్రవచనాలలో పాల్గొనుట, పేదలకు అన్న వస్త్రదానాదులు చేయడం, ఆనందకరమైన జీవనం, దూర ప్రాంతాలలో ఉన్న సంతానం రాక పోకలు జరుగును.



**మీనం–** మిత్రవర్గాలతో విందువినోదాలు, కళాపోషణ, జూదం మొదలగు వ్యసనాల వల్ల ఋణాలు చేయడం. గోచారరీత్యా అష్టమ కుజదోష నివారణకై సుబ్రహ్మణ్య ఆరాధన, అభిషేకాలు, ఋణవిమోచక అంగారకస్తోత్రాలు పఠించడం మేలు.

తిరుమల ఘాట్‌రోడ్లలో వాహన మరమ్మతులకు ఉచిత ఆటోమొబైల్ కేంద్రం ఉంది

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

# సప్తగిరి

(ఆధ్యాత్మిక మాసపత్రిక)

## చందా నమోదు పత్రం

1. పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

_______________

_______________

_______________

(పిన్‌కోడ్ తప్పని సరి) | | | | | | |

సెల్ నెం. | | | | | | | | | | |

2. కావలసిన భాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం (సంవత్సరచందా మాత్రమే) ☐

3. సంవత్సర/జీవిత చందా :

రూ.60/- ☐ రూ.500/- ☐

4. చందా పునరుద్ధరణ :

(అ) చందా నెంబరు :

(ఆ) భాష :

5. చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. :

తేది :

(చెక్కులు స్వీకరించబడవు)

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.60/-, జీవితచందా రూ.500/-లు; డి.డి. / ఎం.ఓ.ను **'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి'** వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. **ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప-మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.**

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా **"ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".**

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.**0877-2233333, 2277777.**



48

# వైకుంఠపాళి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ■ | 2 | | 3 | | 4 | ■ | 5 |
| | ■ | | ■ | | ■ | | ■ | |
| 6 | | ■ | 7 | | | ■ | 8 | |
| | ■ | 9 | ■ | | ■ | 10 | ■ | |
| 11 | | | | ■ | 12 | | | ■ |
| | ■ | | ■ | 13 | ■ | | ■ | 14 |
| 15 | | ■ | 16 | | | ■ | 17 | |
| | ■ | 18 | ■ | | ■ | 19 | ■ | |
| | ■ | 20 | | | | | ■ | |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

## అడ్డం

2)శ్రీకృష్ణుడు విహరించిన ప్రదేశం(5); 6)అగ్ని(2); 7)పరమాత్మ(3); 8)అదేరా! నీకు చెప్పేది, ఈ వాక్యంలో ఒక పదం(2); 11)కిరణము(4); 12)మహారాజులకు ముఖానికి అందాన్నిఇచ్చేది(3); 15)గ్రీష్మఋతువు(2); 16)గుఱ్ఱము(3); 17)వాలి భార్య(2); 20)బ్రహ్మ(5)

## నిలువు

1)మనమిప్పుడు ఏడవ మనువుకాలంలో ఉన్నాము. ఆ మనువు పేరు(9); 2)తులసికి మరో పేరు(2); 3)వ్యాపారి(4); 4)మోక్షం(2); 5)అష్టపదుల్ని రచించినది(4); 9)విచారము(3); 10)ప్రాతఃకాలము(3); 13)ద్రోణాచార్యుల కుమారుడు(4); 14)ఆశ్వయుజ, కార్తికాలలో ఈ ఋతువు ఉంటుంది(4); 18)పాపాలు చేయువానిని ఇలా అంటారు(2); 19)కాయలు ముదిరి పండితే ఇలా అంటాము(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు

# భక్తుల సేవలో....

## శ్రీనివాస కల్యాణాలు - ప్రపంచవ్యాప్తంగా....







12-10-2019న సింగపూర్‌లో జరిగిన శ్రీనివాస కల్యాణంలో తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస కల్యాణాలు ప్రపంచవ్యాప్తంగా భక్తిభావంతో జరపటంతోనే శ్రీవేంకటేశ్వర భక్తితత్త్వం అలవడుతుందని ఆయన తెలిపారు. కోరినంతనే కోరిన వరాలిచ్చే కొండలరాయుడి కృప విశ్వమంతా ప్రసరించాలని ఆయన అభిలషించారు!!





09-11-2019న మెల్‌బోర్న్‌లో తి.తి.దే. నిర్వహించిన శ్రీనివాసకల్యాణంలో తి.తి.దే. ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీనివాసుని ఆశీస్సులే మానవాళికి శ్రీరామరక్ష అన్నారు. దేశం విడిచి వచ్చినా మన సంస్కృతీ సంప్రదాయాలను సజీవంగా నిలపడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇదే ఆధ్యాత్మిక వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు అందించాలని అభిలషించారు. విశృంఖల పాశ్చాత్య సంస్కృతికి భిన్నంగా తెలుగుదనం ఉనికిని చాటుతున్న ప్రవాసాంధ్రులను అభినందించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల్లో తీసుకొస్తున్న సంస్కరణలను తెలియజేశారు.

24-10-2019న తిరుపతిలోని తి.తి.దే. రవాణా విభాగంలో దసరావేడుకల్లో భాగంగా ఆయుధపూజ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తి.తి.దే. ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పర్వదినాలలో తి.తి.దే. రవాణా విభాగంలో ఆయుధపూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భక్తులకు విశేష సేవలు అందిస్తున్న తి.తి.దే. రవాణా విభాగం అధికారులు, సిబ్బంది, డ్రైవర్లకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.







Edited and published on behalf of T.T.Devasthanams by **Dr. K.Radha Ramana,** M.A., M.Phil., Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by **Sri R.V.Vijaya Kumar,** B.A., B.Ed., Dy. E.O., (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.

**లోకక్షేమం కోసం.......**

**తిరుమల తిరుపతి దేవస్థానములు**


## శ్రీనివాసమంగాపురం, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో
## 16-10-2019 నుండి 18-10-2019 వరకు జరిగిన
## అష్టోత్తరశతకుండాత్మక శ్రీనివాస మహాయాగ మహోత్సవ దృశ్యమాలిక


















SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 25-11-2019. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742, Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020

